




epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-6-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 129 పేజీలు: 8+16 వెల: 6.50



సుక్మాలో పేలిన పాతర 3
ఎఎస్పీ మృతి, 12 మందికి గాయాలు

ఉక్రెయిన్‌పై 479 డ్రోన్లతో 5
విరుచుకుపడిన రష్యా


# పిసిసికి భారీ కార్యవర్గం

## 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులు

### వర్కింగ్ ప్రెసిడెంట్లు లేకుండానే కమిటీ

### వైస్ ప్రెసిడెంట్లలో బిసిలు-8, ఎస్సీలు- 5, ఎస్టీలు- 2, ముస్లింలు -3

### జనరల్ సెక్రటరీలలో బిసిలు -26, ఎస్సీలు- 9, ఎస్టీలు-4, ముస్లింలు-8

వైస్ ప్రెసిడెంట్లు




బల్మూరి వెంకట్ బసవరాజు సారయ్య కోట నీలిమ

జనరల్ సెక్రటరీలు



పర్ణిక రెడ్డి మట్ట రాగమయి వెడ్మ బొజ్జు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) జంబో కార్యవర్గాన్ని ఏఐసీసీ సోమవారం రాత్రి ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీ నుంచి అధికారిక ప్రకటనను కెసి వేణుగోపాల్ వెల్లడించారు. నూతన కమిటీలో పలువురు సీనియర్లు, యువ నాయకులతో పాటు ప్రస్తుత ప్రజాప్రతినిధులకు కూడా కీలక బాధ్యతలు అప్పగించారు. కాగా పిసిసి కార్యవర్గంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎవరినీ నియమించలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ టీపీసీసీ కార్యవర్గంలో మొత్తం 27 మందిని ఉపాధ్యక్షులుగా నియమించినట్లు ఏఐసీసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వీరిలో పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) రఘువీర్‌రెడ్డి, శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) నాయిని రాజేందర్‌రెడ్డి, వి. వంశీ కృష్ణ ఉన్నారు. అదేవిధంగా, శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) బల్మూరి వెంకట్‌తో పాటు సీనియర్ నేత, మాజీ మంత్రి బసవరాజు సారయ్య కూడా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. టీపీసీసీ కార్యకలాపాలను >>2



సోమవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో భేటీ అయిన డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం

# కాంగ్రెస్‌లో ఇంకా అసంతృప్తి ముసురు

### పార్టీని భూస్థాపితం చేస్తామన్న సుదర్శన్‌రెడ్డి అనుచరులు

### అజ్ఞాతంలో రాజగోపాల్‌రెడ్డి.. మల్‌రెడ్డిని కలిసి బుజ్జగించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** తాజాగా మంత్రివర్గ విస్తరణ చేసిన తర్వాత కాంగ్రెస్‌లో చెలరేగిన అసంతృప్తులు ఇంకా చల్లారలేదు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో సుదర్శన్ రెడ్డి అనుచరులు ఆందోళనకు దిగారు. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ, పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మంగళవారం బోధన్ >>2

# 40 నిమిషాలు.. 20 ప్రశ్నలు

## జస్టిస్ ఘోష్ విచారణలో మాజీ మంత్రి హరీష్ జవాబులు

### తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదు.. మహారాష్ట్ర అభ్యంతరాల వల్లే మార్పు

### అన్ని ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పిన హరీష్



సోమవారం హైదరాబాద్‌లో కాళేశ్వరం విచారణకు హాజరైన హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** కాళేశ్వరం కమిషన్ విచారణకు ముందు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరయ్యారు. సోమవారం ఉదయం 40 నిమిషాల పాటు కొనసాగిన విచారణలో కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ అడిగిన అన్ని ప్రశ్నలకు హరీష్‌రావు సమాధానం ఇచ్చారు. మొత్తం 20 ప్రశ్నలు అడగ్గా.. ప్రతి ప్రశ్నకు హరీష్‌రావు ఆధారాలు సమర్పిస్తూ సమాధానం ఇచ్చారు. ప్రధానంగా కాళేశ్వరం కార్పొరేషన్, డిజైన్ల మార్పుపై కమిషన్ హరీష్‌రావును ప్రశ్నించింది. బ్యారేజీలలో నీళ్లను నింపడం, డిజైన్లు తయారీపై కమిషన్ ప్రశ్నించింది. మహారాష్ట్ర ఒప్పుకోలేదు కాబట్టే మేడిగడ్డ నిర్మాణం జరిగిందని హరీష్‌రావు తెలిపారు. కమిషన్ ముందు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌ను హరీష్‌రావు చూపించారు. కమిషన్ ముందు జీవోలు, డాక్యుమెంట్ ఆధారంగా సమాధానాలు చెప్పిన హరీష్ రావు. ఇరిగేషన్ మంత్రిగా ఎన్ని రోజులు పనిచేశానని హరీష్‌రావును కమిషన్ ప్రశ్నించింది. కమిషన్ ప్రశ్నలు.. హరీష్‌రావు సమాధానాలు ఇలా..

**కమిషన్.. జీవో 115 మంత్రుల సబ్‌కమిటీ ఎందుకు ఏర్పాటు చేశారు? మంత్రుల సబ్‌కమిటీ ఏ అంశాలపై స్టడీ చేసింది?**

**హరీష్ రావు..** రైతులకు ఎక్కువ సంఖ్యలో నీళ్లు అందించడానికి అప్పటి ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. సబ్ కమిటీలు తుమ్మల నాగేశ్వరరావు ఈటల రాజేందర్ హరీష్ రావు ఉన్నారు. సీడబ్ల్యూసీ, రిటైర్డ్ ఇంజనీర్ల సూచనల మేరకు మేడిగడ్డ నిర్మాణం జరిగింది. మహారాష్ట్ర ఒప్పుకోలేదు కాబట్టి.. తుమ్మిడిహట్టి వద్ద నుంచి మేడిగడ్డకు మార్చాం. 16 లక్షల కంటే ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలంటే.. రిజర్వాయర్ల సంఖ్య పెంచాలని దిజూది చెప్పింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకే బ్యారేజీలు, రిజర్వాయర్ల సంఖ్య పెంచాం. మేడిగడ్డ నిర్మాణం ఒక్కరినిర్ణయం కాదు..మేడిగడ్డ నిర్మాణానికి ముందు మంత్రులు అధికారులు అనేకసార్లుభేటీ అయ్యారు. వ్యాప్కాన్స్ సంస్త నివేదికల ఆధారంగా మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలు నిర్మించాం. మేడిగడ్డ నిర్మించాలని రిటైర్డ్ ఇంజనీర్లు సైతం రిపోర్టులు ఇచ్చారు.

**కమిషన్-అన్నారం సుందిళ్ల లోకేషన్ మార్చడంపై ఏమైనా చర్యలు తీసుకున్నారా..?**

**హరీష్‌రావు..** లోకేషన్ మార్పు అంశం >>2


**కాళేశ్వరమే తెలంగాణకు జీవధార**
మీడియాతో హరీష్ 7


# నేడు కొత్త మంత్రులకు శాఖలు

### కొందరు పాత వారికి శాఖలు మారే అవకాశం

### ఢిల్లీలోనే సిఎం రేవంత్, నేడు ఖర్గేతో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** మంత్రి వర్త విస్తరణ పూర్తి కావడంతో శాఖల కేటాయింపులపై చర్చ జరుగుతోంది. ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో ఆయన మంత్రుల శాఖల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి సుదీర్ఘ చర్చలు జరిపారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో, పార్టీ శ్రేణుల్లో ఈ శాఖల కేటాయింపుపైనే ఆసక్తి నెలకొంది. పెద్ద మొత్తంలో శాఖలమార్పులు, చేర్పులు జరగనున్నట్లుగా పార్టీ అంతర్గతవర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడానికి, పరిపాలనలో నూతన ఉత్తేజాన్ని తీసుకురావడానికి ఈ మార్పులు అవసరమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్టానం ఆశయాలకు, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా శాఖలను కేటాయించేందుకు ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నారు. పలువురు మంత్రుల పనితీరు, వారి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని వారికి మరింత బాధ్యతాయుతమైన శాఖలను అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రుల మార్పుపై సీఎం అధిష్టానంతో చర్చిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఈ శాఖలు ఎవరు నిర్వహించాలనే దానిపై పార్టీలో విస్తృతమైన చర్చ జరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడానికి, పౌర >>2






# ట్యాపింగ్‌తో సంబంధం లేదు

## సిట్ విచారణలో ప్రభాకర్‌రావు

### రివ్యూ కమిటీని ఎందుకు ప్రశ్నించలేదని అధికారులకు ప్రశ్న

### మొదటి రోజు విచారణపూర్తి.. రేపు మరోసారి



హైదరాబాద్‌లో సోమవారం విచారణ కోసం వచ్చిన ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ బాస్, నిఘా విభాగం మాజీ ఓఎస్‌డి డాక్టర్ ప్రభాకర్ రావు మొదటి దఫా విచారణ సోమవారం నాడు ముగిసింది. జూబ్లీహిల్స్‌లోని ఎసిపి కార్యాలయంలో జరిగిన ఈ విచారణలో ప్రభాకర్ రావును ఎనిమిది గంటలకు పైగా ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు ప్రశ్నించారు. అయితే పోలీసుల ప్రశ్నలకు ప్రభాకర్ రావు సరైన సమాధా నాలు ఇవ్వకుండా అసలు ఈ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను అమాయకుడినని బుకాయించేందుకు ప్రయత్నించారని తెలిసింది. ఫోన్ ట్యాపిం గ్ అనేది నిఘా విభాగంలో వుండే ఒక సాధారణ యూనిట్ అని, ఫోన్ ట్యాపింగ్‌లు చేయడంపై ఒక రివ్యూ కమిటీ వుంటుందని, ఈ కమిటీ సభ్యుల సూచనల మేరకే ఎవరి ఫోన్‌లు ట్యాపింగ్ చేయాలనేది నిర్ణయం వుంటుందని, తాను ఇందులో ఏనాడు సభ్యుడుగా లేనని ఆయన చెప్పినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో రివ్యూ కమిటీ సభ్యులను ఎందుకు ప్రశ్నించలేదు..? కమిటీ సభ్యులను ఎఫ్ఐఆర్‌లో ఎందుకు నిందితులుగా >>2


**ఇద్దరు మాజీ డిజిపిలు, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ విచారణకు సిట్ నిర్ణయం** 2




# హైకోర్టులో మళ్లీ శ్రీలక్ష్మి విచారణ

### ఓబుళాపురం మైనింగ్ కేసు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం రేపిన అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్ కేసులో ప్రస్తుత ఎపి సీనియర్ ఐఎఎస్ అధి కారిణి, నాటి గనుల శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి పాత్రపై తెలంగాణ హైకోర్టులో మంగళవారం నుంచి విచారణ జరగనుంది. 2022లో ఓబుళాపురం గనుల గోల్ మాల్‌లో శ్రీలక్ష్మి పాత్రపై సిబిఐ సమర్పించిన ఆధారాలు సరిగ్గా లేవని తెలంగాణ హైకోర్టు ఆమెను ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేయడం తెలిసిందే. దీనిపై సిబిఐ అ ధికారులు సుప్రీం కోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టును సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేయడంతో దీనిపై స్పందించిన సర్వో న్నత న్యాయస్థానం తెలంగాణ హైకోర్టు తీర్పును పక్కనపెట్టింది. దీంతో >>2



ఎన్డీయె సర్కార్ పదకొండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో 'వికసిత్ భారత్ కా అమృత్ కాల్: సేవ, సుశాసన్ ఔర్ గరీబ్ కల్యాణ్ కే 11 సాల్' అనే కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న బిజెపి జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా. చిత్రంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర పార్టీ నేతలు

# లోకల్ రైలులోంచి పడి ఐదుగురు దుర్మరణం

## ముంబ్రాలో దుర్ఘటన.. పదిమందికి తీవ్రగాయాలు

**ముంబయి, జూన్ 9:** మహారాష్ట్రలోని ముంబ్రాలో సోమవారం దారుణం జరిగింది. కదులుతున్న లోకల్ రైలులో నుంచి 10 మందికి పైగా ప్రయాణికులు అమాంతం కింద పడిపోయారు. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. థానే జిల్లాలోని ముంబ్రా - దివా స్టేషన్ల మధ్య ఈ ఘోరంజరిగింది. వీరు ప్రయాణిస్తున్న రైలులో రద్దీ కారణంగా ఈ ప్రమాదం జరిగింది. పరిమితికిమించి ప్రయాణికులు రైలు ఎక్కడం వల్ల లోపల చోటులేకుండా ఫుట్‌బోర్డుపై అధిక మంది వేలాడుతూ ప్రయాణించారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో రెండు రైళ్లు వ్యతిరేక దిశల్లో ఒకదానికొకటి దాటుతుండగా ఫుట్‌బోర్డుపై వేలాడుతున్న పది మంది పట్టుతప్పి కింద పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రైలు ముంబ్రా స్టేషన్ గుండా వెళుతుండగా క్రాసింగ్ సమయంలో పైకి క్రిందికి వెళ్ళే రెండు రైళ్ల ఫుట్‌బోర్డులపై నిలబడి ఉన్న ప్రయాణికులు ఢీకొనడం ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. వ్యతిరేక దిశల్లో వెళ్లే రైళ్లలో ఫుట్ బోర్డు అంచున నిలబడిన ప్రయాణించే ప్రయాణికులు ఢీకొని బ్యాలెన్స్ కోల్పోయారని సెంట్రల్ రైల్వే సీపీఆర్ఓ స్వప్నిల్ ధన్‌రాజ్ నీలా తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారిని థానే సివిల్ హాస్పిటల్, కళ్యాణ్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. క్షతగాత్రుల్లో కొంతమంది ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు రైల్వేశాఖ తెలిపింది. రైల్వే యంత్రాంగం ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించింది. ఈ ప్రమాదం కారణంగా పలు సెంట్రల్ రైల్వే స్థానిక రైలు సర్వీసులు రద్దయ్యాయి. ముంబయి దివా విభాగంలో కార్యకలాపాలు కొంతకాలంగా నెమ్మదిగా ఉండటం వల్ల ప్రయాణికులకు అసౌకర్యానికి గురవుతున్నారు.

# అసంతృప్తి ముసురు

>> బందుకు కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. సుదర్శన్ రెడ్డి అనుచరులు ఈ క్రమంలో పార్టీ పదవులకు మూకుమ్మడి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సంతకాలతో కూడిన రాజీనామా లేఖలను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు పంపారు. సీనియర్లను కాదని కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని సుదర్శన్ రెడ్డి అనుచరులు మండిపడుతున్నారు. లోకల్ బాడీ ఎన్నికలలోపు సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోతే బోధన్, నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని సుదర్శన్ రెడ్డి అనుచరులు హెచ్చరించారు. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సోమవారం మంత్రి శ్రీధర్ బాబు తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గడిచిన పది సంవత్సరాలు పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కార్యకర్తలు, పార్టీని కాపాడిన నేత మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు అని ఆయన ఆవేదనను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఇతర పార్టీ పెద్దలు మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మాట్లాడారని అన్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహానికి గురి కాకుడదని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. తాజా మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపులేదని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆర్థికంగా భరించడంతో పాటు పార్టీలోకి వచ్చి ఊపుతేవడం..చాలాచోట్ల అభ్యర్థులను మళ్లీ గెలిపించినప్పటికీ గుర్తింపులేదనే బాధలో ఆయన ఉన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, రాజగోపాల్‌రెడ్డి ఓ టీంగా వచ్చి పార్టీని గట్టెక్కించారని ఆయన అనుచరులు అంటున్నారు. అయినా మంత్రి పదవి ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని అనుచరులు మండిపడుతున్నారు. అయితే కేబినెట్ విస్తరణ తర్వాత మంత్రి పదవులు ఆశించిన పలువురు ఎంఎల్‌ఎలను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, తాజా మంత్రి మంత్రి వివేక్ తదితర నేతలు బుజ్జగించే పనిలో ఉన్నారు. రాజగోపాల్‌రెడ్డిని కూడా కలిసి బుజ్జగించేందుకు ఆయా నేతలు శతధా ప్రయత్నాలు చేశారు. తనను కలిసేందుకు ఈ నేతలు ప్రయత్నించినా రాజగోపాల్‌రెడ్డి అందుబాటులోకి రాలేదు. నాకు పార్టీ పదవులు వద్దు.. నాకు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవి ఇవ్వండి.. లేదంటే నన్ను వదిలేయండి అని సున్నితంగా చెప్పి ఎవరినీ కలవకుండానే ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు పలువురు చెబుతున్నారు. త్వరలో ఆయన సన్నిహితులు, నియోజకవర్గ ముఖ్యులతో సమాలోచనలు చేసి ఏం చేద్దాం? అనే విషయంపై చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీలో ఉంటూనే నాయకత్వంపైనే తిరుగుబాటు చేస్తారని పలువురు అనుకుంటున్నారు. అయితే మంత్రివర్గంలో ఇంకా ఆరు ఖాళీలు ఉండగా ముగ్గురిని మాత్రమే కేబినెట్‌లోకి తీసుకున్నారు. మిగిలిన ఖాళీలు భర్తీ చేసేవరకు వెయిట్ చేయాలనే ఆలోచనలో రాజగోపాల్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యాపేట జిల్లా, దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలునాయక్‌కు కూడా మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తారని ఆయన అభిమానులు ఎంతగానో ఆశించారు. మంత్రి పదవి లేదంటే డిప్యూటీ స్పీకర్ పదవి ఎస్టీ గిరిజన కోటాలో దక్కుతుందని ఊహించినా అది కూడా ఆయనకు దక్కలేదు. ఇటీవల ఎస్టీ కోటాలో శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో బాలూనాయక్‌కు మంత్రి పదవి దూరమైందని పలువురు అంటున్నారు. అంతేకాకుండా రాజగోపాల్‌రెడ్డికి ఇవ్వకుండా మరో పదవి జిల్లాకు ఇస్తే ఆయన మరింత అసంతృప్తిని వ్యక్తపరుస్తారనే కారణంతో ఇవ్వలేదనే వాదన కూడా వినిపిస్తోంది. తాజాగా డిప్యూటీ స్పీకర్ పదవిని రాంచంద్రునాయక్‌కు ఇవ్వడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకే ఎస్‌టి కోటా పదవులు రెండూ వరించాయని అంటున్నారు. అదే ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సీతక్క మంత్రి పదవిలో ఉన్నారు. ఇదిలా ఉండగా, మంత్రి పదవి రానందున అసంతృప్తితో ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును కాంగ్రెస్ పెద్దలు బుజ్జగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనతో సోమవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. ఇంకా మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నందున ఆయనకు అవకాశం ఉంటుందని చెప్పారని సమాచారం. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్(చెన్నూర్)కు మంత్రి పదవి ఇచ్చారు.

# ఇద్దరు మాజీ డిజిపిలు, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ విచారణకు సిట్ నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వుండి 15 నెలల తరువాత సోమవారం నాడు విచారణకు హాజరైన ఎంఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ కేసును విచారిస్తున్న సిట్ అ ధికారులు ఇద్దరు మాజీ డిజిపిలతో పాటు మరో ఇద్దరు పూర్వ నిఘా విభాగం అధిపతులను విచారించాలని భావిస్తున్నట్లు సమాచారం. తాను ఎస్ఐబి బాస్‌గా పనిచేసిన సమయంలో తన పై అధికారుల ఆదేశాలు పాటించాను తప్పించి... సొంత నిర్ణయాలు తీసుకోలేదని ప్రభాకర్ రావు సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు ఎస్ఐబి బాస్‌గా మొదట్లో డిఐజి క్యాడర్‌లో వుండగా ఆ తరువాత ఐజి క్యాడర్‌కు పదోన్నతి పొంది అక్కడే పదవీ విరమణ చేసి ఓఎస్‌డిగా కూడా కొనసాగారు. గత ఏడాది డిసెంబర్ నాలుగవ తేదీన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాక అదే రోజు సాయంత్రం రాజీనామా చేశా రు. ఆయన ఎస్ఐబి బాస్‌గా పనిచేసిన సమయంలో నిఘా విభాగం అధిపతిగా మొదట్లో ఐజి క్యాడర్ అధికారి నవీన్ చంద్ వుండేవారు. ఆయన పదవీ విరమణ తరువాత నాలుగైదు నెలల పాటు ప్రభాకర్ రావు ఓఎస్‌డిగా నిఘా విభాగం బాస్‌గా కూడా కొనసాగారు. విశ్రాంత ఐజి స్థాయి అధికారిని నిఘా విభాగం బాస్‌గా అప్పటి బిఆర్ఎస్ సర్కారు నియమించడం సంచలనం రేపింది. ఇటువంటి నియామకం దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదని అధికారులు అప్పట్లో చెప్పుకున్నారు. నిఘా విభాగం బాస్‌గా నవీన్ చంద్ పదవీ విరమణ చేసే నాటికి నిఘా విభాగంలోనే మరో ఐజి స్థాయి అధికారి రాజేష్ కుమార్ వున్నప్పటికీ ఎ స్ఐబి ఓఎస్‌డిగా వున్న ప్రభాకర్ రావును మొత్తం నిఘా విభాగానికి బాస్‌గా చేయడం అప్పట్లో రాష్ట్ర పోలీసు శాఖలో సంచలనం రేపింది. అయితే ఆ తరువా త అనూహ్యంగా ప్రభుత్వం నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించి ప్రభాకర్ రావును ఎస్ఐబికి పరిమితం చేసింది. ఇక ఎస్ఐబి బాస్‌గా ప్రభాకర్ రావు పనిచేసిన సమయంలో డిజిపిగా మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్‌లు పనిచేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు తాజాగా ఇచ్చి వాంగ్మూల ం ఆధారంగా నిఘా విభాగం బాస్‌లుగా పనిచేసిన నవీన్ చంద్, అనిల్ కుమార్‌లతో పాటు డిజిపిలుగా పనిచేసిన మహేందర్ రెడ్డి, అంజనీ కుమారలను విచా రించాలని సిట్ నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై ఒకటి త్వరలో ఈ నలుగురు అధికారులకు అధికారికంగా సమాచారం అందించే వీలుందని తెలిసింది.

## వారం - వర్జ్యం

తేది : 10-06-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
చతుర్దశి ఉ.11.34
అనూరాధ సా.5.59
వర్జ్యం రా.12.05-1.50
దు.ఉ.8.12-9.04, 2) రా.11.55-12.47
శుభసమయం : ఉ.5.15-6.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగులకు ఎదురైన ఒత్తిడులు సన్నిహితుల సాయంతో తొలగించుకొంటారు.

**వృషభం :** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మిథునం:** అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు. ఎంతోకాలంగాఎదురు చూస్తున్న అవకాశాలు పొందుతారు.

**కర్కాటకం :** కొత్త పనులు చేపడతారు. మీ అంచనాలు, ఊహలు నిజమవుతాయి. వృత్తి-వ్యాపారాలు విస్తరిస్తారు.

**సింహం:** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**కన్య :** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. భూ వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**తుల :** వృత్తి-వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైనా అధిగమిస్తారు. ధన, వస్తు లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వ్యక్తులు పరిచయమై సహాయసహకారాలు అందిస్తారు.

**ధనుస్సు:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మకరం:** తండ్రి నుండి కీలక సమాచారం అందుతుంది. ఇంటర్వ్యూలు, పోటీపరీక్షల యత్నాలు ముమ్మరంచేస్తారు.

**కుంభం:** కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 40 నిమిషాలు.. 20 ప్రశ్నలు

>> పూర్తిగా టెక్నికల్.. టెక్నికల్ రిపోర్టులు ఆధారంగా లొకేషన్స్ మారాయి. బ్యారేజీలు, ప్రాజెక్టుల లొకేషన్స్ మారడం ఇప్పుడు కొత్తేమీ కాదు. గతంలో నాగార్జున సాగర్, కాంతనపల్లి లాంటి ప్రాజెక్టులు లొకేషనులు మారాయి.

**కమిషన్ ప్రాజెక్టుల లొకేషన్‌లు మార్చే అధికారం హై పవర్ కమిటీకి అధికారం ఉందా..?**

**హరీష్‌రావు** అప్పటి ప్రభుత్వం హై పవర్ కమిటీకి అన్ని అధికారాలు ఇచ్చింది.

కమిషన్..**కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటుకు కారణం ఏంటి?**

**హరీష్‌రావు..** లోన్స్ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.

కమిషన్.. **కార్పొరేషన్ ద్వారా తీసుకున్న లోన్స్ రీపేమెంట్స్ ఎలా చేయాలనుకున్నారు.?**

**హరీష్‌రావు..** నీళ్లను అమ్మి లోన్లను రీ పేమెంట్ చేయాలి అనుకున్నాము.

కమిషన్.. **కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ జనరేట్ అయిందా? అయితే ఇంత చేశారు?**

**హరీష్‌రావు..** కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాలు డిలే అయింది.

కమిషన్.. **నిర్మాణ సంస్థలకు సైట్ ఆలస్యంగా ఎందుకు ఇచ్చారు?**

**హరీష్‌రావు..** సాధారణంగా అప్పటి పరిస్థితులు ఆధారంగా సైట్స్ కొంత డిలే అవుతాయి.

కమిషన్.. **మేడిగడ్డ నుంచి మిడ్ మానేరుకు డైరెక్ట్‌గా నీళ్లు ఇవ్వొచ్చు ఎక్స్‌పర్ట్ కమిటీ చెప్పిందా..?**

**హరీష్‌రావు..** డైరెక్ట్‌గా నీళ్ల ఇవ్వడానికి సాధ్యం కాదని ఎక్స్‌పర్ట్ కమిటీ చెప్పింది.

కమిషన్.. **కాళేశ్వరం ద్వారా ఎన్ని నీళ్లలో స్టోరేజీ చేశారు..?**

**హరీష్‌రావు..** రిజర్వాయర్ల ద్వారా 141 టిఎంసిల నీళ్లను స్టోరేజ్ చేసాం.

కమిషన్.. **బ్యారేజీలలో ఫుల్ లెవెల్ ట్యాంక్ వరకు నీళ్లను స్టోర్ చేశారా ?**

**హరీష్‌రావు..** టెక్నికల్ అంశాలు అధికారులు మాత్రమే చూసుకుంటారు.

కమిషన్.. **బ్యారేజీలలో నీళ్లను నింపమని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందా?**

**హరీష్‌రావు..** బ్యారేజీలలో నీళ్లను నింపమని ఎవరు ఆదేశించలేదు.

# ట్యాపింగ్‌తో సంబంధం లేదు

>> చేర్చలేదని ప్రభాకర్ రావు సిట్ అధికారుల ను ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అప్పట్లో తనపై అధికారుల ఆదేశాలను కాదని తాను ఎలాంటి సొంత నిర్ణయం తీసుకోలేదని, ఈ విషయమై వస్తున్న ఊహాగానాలు సరైంది కాదని సిట్ అధికారులకు ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. అయితే ప్రభాకర్ రావు ప్రశ్నలకు సిట్ అధికారులు కొంత ఇబ్బంది పడినా ఆ తరువాత తేరుకుని మీ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులు మరో మాజీ పోలీసు అధికారి వాంగ్మూలం ఇచ్చారని చెప్పగా, దీనిపైనా ప్రభాకర్ రావు తనదైన శైలిలో సమాధానం ఇచ్చారని తెలిసింది. తాను ఆదేశాలు ఇస్తేనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అరెస్టయిన నలుగురు చెబుతుంటే...దీనికి సంబంధించిన ఆధా రాలు వారిని చూపించమనండి... ? లేదా మీరైనా వీటిని వారి వద్ద తీసుకు ని నాకు చూపండి...? ఈ వివరాలు కనీసం కోర్టుకు అయినా ఇవ్వండి...అప్పుడు నమ్ముతాను అని ప్రభాకర్ రావు పోలీసులను ఎదురు ప్రశ్నించినట్లు సమాచా రం. ఫోన్ ట్యాపింగ్‌పై కేసు నమోదు కాగానే మీరు ఎందుకు అమెరికాకు పారిపో యారు...? ఇంతకాలం అక్కడి నుంచి రాకుండా ఎందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు...? నాంపల్లి కోర్టు నుంచి అరెస్టు వారంట్, ఇంటర్ పోల్ నుంచి రెడ్ కా ర్నర్ నోటీసు...పాస్ పోర్టు రద్దు వరకు పరిస్థితి ఎందుకు వచ్చింది...? ఆఖరు కు నాంపల్లి కోర్టు నుంచి ఆస్తుల జప్తు వరకు ఎందుకు వచ్చింది...? అనే అంశాలను సిట్ అధికారులు ప్రభాకర్ రావును గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లుసమాచారం. అయితే ఈ ప్రశ్నలకు ప్రభాకర్ రావు కొంత దాటవేసే సమాధానాలు ఇచ్చారని తెలిసింది. తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, పైగా తనకు గుండె బైపాస్ ఆపరేషన్ కూడా జరిగిందని, ఉత్తమ వైద్యం కోసం తాను అమెరికాకు వెళ్లానని, అంతకు మించి ఏమీ లేదని, ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు తరువాత తా ను అమెరికాకు పారిపోలేదని, అంతకు ముందే వెళ్లానని, తాను అమెరికాలోనే వుండిపోవాలని అనుకోలేదని, ఆరోగ్యం కుదుట పడ్డాక వద్దామని అనుకున్నానని ఆయన చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు డిసెంబర్ నాలు గవ తేదీన వెలువడగా అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు తాను త న ఉద్యోగానికి రాజీనామా చేశానని ప్రభాకర్ రావు సిట్ అధికారులకు చెప్పారని తెలి సింది. అయితే అదే రోజు రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఎస్ఐబి డిఎస్‌పిగా వున్న ప్రణీత్‌రావు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి మూసీనదిలో పడవేయగా ఇందులో తనకు ఎలాంటి సంబంధం వుందని ఆయన ప్రశ్నించినట్లు స మా చారం. ఎస్ఐబిలో ఫోన్ ట్యాపింగ్ యూనిట్ డిఎస్‌పి ప్రణీత్ రావు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసిన తరువాత మీ ఆదేశాల మేరకే ఇదంతా చేసినట్లు వాంగ్మూలం ఇచ్చాడని, దీనిపై మీ సమాధానం ఏమిటని సిట్ అధికారులు ప్రశ్నించగా ఇందు లో తన పాత్ర ఎంతమాత్రం లేదని, ఎవరి ఒత్తిడి మేరకు ప్రణీత్ రా వు ఇలాంటి వ్యాఖ్యలు చేశాడో...? తనకు తెలియదని పభాకర్ రావు చెప్పినట్లు తెలిసింది. దీంతో పాటు ఈ కేసులో అరెస్టయిన మిగతా నిందితులు కూడా వే రే వాళ్ల ఒత్తిడితో తన పేరు చెప్పి వుండవచ్చని ప్రభాకర్ రావు వెల్లడించారని తెలిసింది. ఎస్ ఐబిలో ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌లో బయటి వ్యక్తులు ముఖ్యంగా పోలీసు శాఖతో సంబంధం లేని మీడియా అధినేత శ్రవణ్ రావును ఎందుకు జోక్యం చేసుకు నేలా చేశారు...? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించి నట్లు తెలిసింది. అప్పట్లో రాజకీయ నేతలు ముఖ్యంగా కాంగ్రెస్, బిజెపిలోని ప్రముఖ నేత లు, సినీ ప్రముఖులు, రియల్టర్లు, సెలబ్రిటీల ఫోన్‌ల ట్యాపింగ్ ఎవరి ఆదేశాల మేరకు జరిగింది...? అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలు ఏమైనా వుందా...? అని ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించిరాని సమాచారం. దీనికి కూడా ఆయన సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. అప్పట్లో నాలుగు వేలకు పైగా ఫోన్‌లను మీ హయాంలో ట్యాపింగ్‌కు గురైనట్లు మా వద్ద ఆధా రాలు వున్నాయి. ఈ నంబర్లన్నీ మీకు ఎవరు ఇచ్చారు...? ఒకవేళ అసెంబ్లీ ఎన్నికల ఫలితా ల్లో బిఆర్ఎస్ విజయం సాధించి వుంటే హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి వుండేవారా...? అని ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించగా దీనికి కూడా ఆయన సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌లో జడ్జిల ఫోన్‌లను కూడా వదల్లేదు. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చింది. మీడియా అధినేత శ్రవణ్ రావు ప్రైవేటు వ్యక్తి...అతనితో ఎస్ఐబికి ఏమిటీ సంబంధం...? మీతో అతనికున్న అనుబంధం ఏమిటీ...? అని ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించిన ట్లు తెలిసింది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఉప ఎన్నికలు, అ సెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతల వద్ద లభించిన డబ్బులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసు లు ఇదంతా మీ ఆదేశాలతోనే జరిగిందని వాంగ్మూలం ఇచ్చారని సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించగా ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లే దని ఆయన బదులిచ్చినట్లు తెలిసింది. బుధవారం నాడు మరో సారి విచారణకు రావాలని ప్రభాకర్ రావును సిట్ అధికారులు ఆదేశించారు. ఉదయం 11.20 గ ంటల సమయంలో సిట్ కార్యాలయానికి వచ్చిన ప్రభాకర్ రా వు రాత్రి ఏడున్నర గంటలకు విచారణ పూర్తవడంతో వెళ్లిపోయారు. కాగా విచారణ తరువాత బయటకు వచ్చిన ప్రభాకర్ రావు మీడియాతో మాట్లాడకుండా వె ళ్లిపోయారు. విచారణ సందర్భంగా ఆయన వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. ఇ దంతా వీడియో తీశారు. విచారణ ప్రక్రియ అంతా పశ్చిమ మ ండల డిసిపి విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరగగా జూబ్లీహిల్స్ ఎసిబి వెంకటగిరి తన బృందంతో పర్యవేక్షించారు.



ప్రపంచంలోనే అతిపెద్ద కంటైనర్ షిప్ ఎంఎస్‌సి ఇరియానా సోమవారం కేరళలోని విజిజం అంతర్జాతీయ ఓడరేవుకు చేరుకొన్న దృశ్యం

# హైకోర్టులో మళ్లీ శ్రీలక్ష్మి విచారణ

>> పాటు ఓబుళాపురం గనుల గోల్‌మాల్‌లో శ్రీలక్ష్మీ పాత్రపై మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని గత మే నెలలో సిబిఐని ఆదేశించింది, కాగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు ఓబుళాపురం గనుల గోల్‌మాల్‌లో శ్రీలక్ష్మీ పాత్ర పై మరోసారి విచారణను సిద్ధమవుతోంది. మంగళవారం నుంచి ఈ విచారణ మొదలు కానుంది. కాగా ఇదే కేసులో శిక్షలు పడి చంచల్‌గూడ జైల్లో వున్న బిజెపి ఎంఎల్‌ఎ గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నిందితులు సిబిఐ కోర్టు తీర్పును సవాల్ చేయడంపైనా హైకోర్టులో విచారణ జరగనుంది.

# నేడు కొత్త మంత్రులకు శాఖలు

>> సరఫరాల వ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా నడపడానికి ఈ శాఖలకు సమర్థులైన మంత్రులు అవసరమని భావిస్తున్నారు. అంతేకాకుండా, పురపాలక, విద్యాశాఖ, ఇతర కీలక శాఖల కేటాయింపులపైనా సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నట్లు సమాచారం. ఈ శాఖలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి కాబట్టి, వాటికి సరైన నాయకత్వాన్ని ఎంచుకోవడంలో సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఢిల్లీలో అధిష్టానంతో జరిపే చర్చల ద్వారా తుది జాబితాను రూపొందించే అవకాశం ఉంది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. వారి సూచనలు, సలహాలు తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లి ఖార్జున ఖర్గేతో సమావేశం కానున్నారు. ఈ మేరకు ఈ చర్చల అనంతరం మంగళవారం శాఖల కేటాయింపులకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కేబినెట్‌లో కీలకమైన హోం శాఖను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేటాయించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్కకు హోం శాఖ అప్పగించడం ద్వారా ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, పరిపాలనలో ఆయన అనుభవాన్ని వినియోగించుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హోం శాఖ రాష్ట్ర శాంతిభద్రతలకు సంబంధించిన అత్యంత కీలకమైన శాఖ కాబట్టి, దానిని సమర్థవంతంగా నిర్వహించగలిగే నాయకుడికి అప్పగించడంపై దృష్టి సారించారు. అలాగే, మంత్రి శ్రీధర్‌బాబుకు ఐటీతోపాటు ఇతర శాఖలను కేటాయించే అవకాశముంది. శ్రీధర్‌బాబు గతంలో కూడా పలు కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఉండటంతో ఆయనకు ఇతర శాఖల బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు మరికొందరు మంత్రులకు ఉన్న శాఖలలో మార్పులు, కొత్తగా చేరిన మంత్రులకు ఏయే శాఖలు కేటాయిస్తారు అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా మంత్రివర్గ విస్తరణతో మంత్రుల సంఖ్య 15కు చేరింది. కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గడ్డం వివేక్‌లకు శాఖలు కేటాయించాల్సి ఉంది. కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడిన తరువాత సీఎం వారికి శాఖలు కేటాయిస్తారు. గడిచిన పది రోజులుగా రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, పోటీ చేసిన నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు.

# పిసిసికి భారీ కార్యవర్గం

>> క్షేత్రస్థాయిలో మరింత విస్తృతం చేసేందుకు 69 మందిని ప్రధాన కార్యదర్శులుగా కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ జాబితాలో కూడా పలువురు శాసనసభ్యులకు ప్రాధాన్యత ఇచ్చింది. ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారిలో ఎమ్మెల్యేలు వేడ్మ బొజ్జు, పర్ణికారెడ్డి, మట్టా రాఘమయి తదితరులు ఉన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పదవులలో సామాజిక న్యాయానికి, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన కాంగ్రెస్. 27 మంది ఉపాధ్యక్షులలో బీసీ లకు 8, ఎస్సీలకు 5, ఎస్టీ లకు 2, ముస్లింలకు 3 పదవులు ఇచ్చారు. 67 శాతం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు ఇచ్చారు. అలాగే 69 ప్రధాన కార్యదర్శి పదవులలో బీసీ లకు అత్యధికంగా 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులు ఇచ్చారు. 68 శాతం బిసి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లకు ఇవ్వడం జరిగింది. ఇదిలా ఉండగా, టిపిసిసి నూతన కార్యవర్గంలో సీనియర్ నేతలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. 20 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో అంకిత భావంతో పని చేస్తున్న అనేక మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులకు నూతన కార్యవర్గంలో అవకాశం ఇచ్చారు. టిపిసిసి అధ్యక్షులుగా మహేశ్‌కుమార్‌తో ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన అనేక మంది కాంగ్రెస్ నాయకులకు స్థానం దక్కడంతో కాంగ్రెస్ పార్టీలో హుషారు కనిపిస్తోంది.

**ఉపాధ్యాక్షులు వీరే..** ఉపాధ్యాక్షుల్లో టి.కుమార్‌రావు, కె.రఘువీర్‌రెడ్డి(ఎంపీ), నాయిని రాజేందర్‌రెడ్డి(ఎమ్మెల్యే), చిక్కుడు వంశీకృష్ణ(ఎమ్మెల్యే), బల్మూర్ వెంకట్(ఎమ్మెల్సీ), బస్వారాజు సారయ్య(ఎమ్మెల్సీ), హనుమాండ్ల ఝాన్సి రెడ్డి, బండి రమేశ్, కొండ్రు పుష్పలీల, నీలిమ, కైలాశ్‌కుమార్, ఎన్.శ్రీనివాస్, ఆత్రం సుగుణ, గాలి అనిల్ కుమార్, చిట్ల సత్యనారాయణ, ఎ.ధనవంతి, వేణుగౌడ్, వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, ఫహీమ్(సంగారెడ్డి), ఎస్.సురేశ్‌కుమార్, బొంతు రామ్మోహన్, యూసుఫ్ జాహీ, జగదీశ్వర్‌రావు, ఆలంఖాన్, జి.మోహన్‌రెడ్డి, చింతపట్ల సంగమేశ్వర్ ఉన్నారు.

**ప్రధాన కార్యదర్శులు వీరే**

ప్రధాన కార్యదర్శుల్లో వెడ్మబొజ్జు(ఎమ్మెల్యే), పర్నికారెడ్డి(ఎమ్మెల్యే), రాఘమయి(ఎమ్మెల్యే), రాంభూపాల్, సంజీవ్ ముదిరాజ్, సంధ్యారెడ్డి, సదాలక్ష్మీ, స్వర్ణకుమారి, దారాసింగ్ తందూరి, శశికల యాదవరెడ్డి, వెంకటస్వామి, అబ్దుల్ ఫహీమ్, సంతోష్‌కుమార్, దుర్గం భాస్కర్, ఖాజా ఫక్రుద్దీన్, జగదీశ్వర్‌గౌడ్, నరేశ్ జాదవ్, అల్లం భాస్కర్, గిరిజ శత్కర్, కొప్పుల ప్రవీణ్‌కుమార్, జంగారెడ్డి, కె.శ్రీనివాస్‌రావు, దుద్దిళ్ల శ్రీనివాస్, బి.ఇంద్రకరణ్‌రెడ్డి, చరగాని దయాకర్, మహిపాల్‌రెడ్డి, గజ్జెల కాంతం, ఇ.సుబ్బారావు, చకిలం రాజేశ్వరరావు, ఈర్ల కొమురయ్య, ఎ.రవిబాబు, నాగా సీతారాములు, శ్రీనివాస్‌గౌడ్, పృథీవి చౌదరి, ఎ.రాజేశ్వర్, డిడి వెంకటరాజ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్ షబ్బీర్ అలీ, రంగారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, అనంత కిషన్, రామారావు గౌడ్, రమేశ్‌బాబు, బాల మురళీకృష్ణ, రాజీవ్‌రెడ్డి, ఆదం రాజ్, షమీమ్ ఆగా, ఇవి శ్రీనివాస్‌రావు, మిథున్‌రెడ్డి, వెంకటేశ్ పవార్, కల్పనా యాదవ్, రాజేశ్ కాశిపాక, రహ్మత్ హుస్సేన్, ప్రసన్నకుమార్ శర్మ, అసదుద్దీన్, యాదయ్య ముదిరాజ్, డి.రవీందర్, ఉప్పల శ్రీనివాస్ గుప్త, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణం, ఉపేందర్‌రెడ్డి, ధర్మారావు, ఎన్.సత్యనారాయణగౌడ్, దుర్గా ప్రసాద్, వెంకట గోవిందరావు, పి.శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్9:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనపై నమోదైన కేసును కొట్టేసేందుకు తిరస్కరించింది. పోలీసులు నమోదు చేసిన కేసులో 188 సెక్షన్ ను కొట్టేసిన కోర్టు.. మిగతా సెక్షన్లలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఎమ్మెల్యేకు తేల్చిచెప్పింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాడి కౌశిక్ రెడ్డి ఓ ర్యాలీలో మాట్లాడుతూ.. తనను గెలిపించకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై నోడల్ అధికారి ఫిర్యాదు చేయగా కమాలపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే, ఈ కేసును కొట్టివేయాలంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. కేసునుకొట్టివేయలేమని పేర్కొంటూ కౌశిక్‌పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# కెసిఆర్‌తో హరీష్ భేటీ, 11న విచారణకు వెళ్లనున్న మాజీ సిఎం

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌తో హరీష్‌రావు సమావేశమయ్యా రు. గురువారం కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన హరీష్‌రావు.. విచారణ ముగిసిన తరవాత నేరుగా కెసిఆర్‌తో సమావేశం కావడానికి ఎర్రవల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ విచారణకు సంబంధించిన వివరాలను ఆయన కెసిఆర్‌తో పంచుకున్నట్లు తెలిసింది. సుమారు ఐదు గంటలకు పైగా సమావేశమయ్యారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ అడిగిన ప్రశ్నలకు తాను సాక్ష్యాధారాలతో సమాధానం ఇచ్చిన అంశాలను హరీష్ కెసిఆర్‌కు వివరించినట్లు సమాచారం. విచారణ సందర్భంగా జస్టిస్ ఘోష్ ప్రస్తావిస్తున్న అంశాల గురించి చర్చించినట్లు తెలిసింది. బుధవారం(జూన్ 11) కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరుకానున్నారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్న కెసిఆర్, విచారణ సందర్భంగా కమిషన్ అడిగే ప్రశ్నలపై పూర్తి స్థాయిలో సిద్ధమైనట్లు తెలిసింది.

# నెలాఖరులో తెలంగాణలో పర్యటించనున్న అమిత్‌షా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల చివరి వారంలో తెలంగాణలో పర్యటించనున్నారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభించనున్నారు. దీంతో పాటు పసుపుబోర్డు లోగో ఆవిష్కరణలో కూడా పాల్గొంటారని ఆయా వర్గాల సమాచారం. ఇదిలా ఉంటే నిజామాబాద్ నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ అద్దె ప్రాతిపదికన పసుపు బోర్డు కార్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## పెరిగిన ఆర్టీసి బస్‌పాస్ రేట్లు

### విద్యార్థుల బస్‌పాస్‌పై రూ. 200 పెంపు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టీసి) బస్‌పాస్ ఛార్జీలను పెంచి ప్రజలకు షాక్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల బస్‌పాస్ ఛార్జీలను పెంచిన ఆర్టీసి.. సాధారణ ప్రజలతో పాటు స్టూడెంట్ బస్ పాస్ ధరలను పెంచింది.పెంచిన బస్ పాస్ ధరలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్య తరగతి ఉద్యోగులకు, విద్యార్థులకు, సాధారణ ప్రయాణీకులకు ఆర్టీసి పెద్దషాకిచ్చినట్లయింది. గ్రీన్ మెట్రో ఏసీ, ఆర్డినరీ బస్ పాస్ రేట్లను పెంచుతూ ఆర్టీసి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఆర్డినరీ బస్‌పాస్ రూ.1150 ఉండగా.. దా నిని కొత్త రూ.1400కు పెంచారు. రూ. 300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌ను రూ.1600కి.. రూ.1450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్‌ను కొత్త రూ.1800 కు పెంచారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఏసీ పాస్ ధరలను సైతం పెంచారు. రూ.400 ఉన్న స్టూడెంట్ బస్‌పాస్‌ను కొత్త రూ. 600కి పెం చారు. పెంచిన బస్‌పాస్ ఛార్జీలు ఉద్యోగులు, రోజువారీ పనులు చేసుకు నేందుకు వెళ్లే వారిపై ప్రభావం పడనుంది. నగరంలో చిన్న, మధ్యతరహా ఉద్యోగులు చేసే వారు ఎక్కువగా ఈ పాస్‌లను తీసుకుంటారు. ఆర్టీసి పెంచిన బస్‌పాస్‌లపై ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యతిరేకత వ్యక్తం కావడమే కాకుండా.. పెంచిన స్టూడెంట్ బస్‌పాస్‌లను ఉపసంహరించు కోవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.



## ఉత్తర మలేసియాలో రోడ్డుప్రమాదం

### 15 మంది విద్యార్థులు మృతి, మరో ఏడుగురి పరిస్థితి విషమం

**కౌలాలంపూర్, జూన్ 9:** మలేసియాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఉత్తర మలేసియాలో యూనివర్సిటీ విద్యార్థులను క్యాంపస్‌కు తీసుకు వెళుతున్న ఒక మినీవ్యాన్ ఢీకొనడంతో 15 మంది విద్యార్థులు మరణిం చారు. మరికొందరు గాయాలపాలయ్యారు. ఉత్తరమలేసియాలోని సుల్తాన్ ఇద్రిస్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీకి చెందిన బస్సు విద్యార్థులతో వెళ తుండగా అదుపు తప్పి ముందు వెళుతున్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. తర్వాత బస్సు బోల్తాపడటంతో 13 మంది విద్యార్థులు అక్కడికక్కడే చనిపోయారు. ఘటనాస్థలానికి చేరిన సహాయక బృందాలు 30 మందిని పైగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ప్రస్తుతం మరో ఏడుగురిపరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో అందరూ కూడా 21 నుంచి 23 యేళ్ల మధ్య ఉన్నట్లు అధికారులు తెలిపారు. మలేసియా ప్రధానమంత్రి అన్వర్ఇబ్రహీం ఈ ప్రమాదంపై తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున సాయం చేయాలని ఉన్నత విద్యామంత్రిత్వ శాఖను ప్రధాని ఆదేశించారు.

## రాష్ట్రంలో మూడురోజులు భారీ వర్షాలు

### హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** తెలంగాణలో మూడు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా మే నెల చివరి వారంలో వర్షాలు దంచికొట్టాయి. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. కాని జూన్ నెలలో వారం రోజులుగా మళ్లీ పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో ప్రజలు మధ్యాహ్నం వేళ మండే ఎండలతో పాటు, ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, మళ్లీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావం కనిపిస్తుండగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 10న సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలతోపాటు భారీ వర్షాలుకూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అలాగే 11వ తేదీన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారా యణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. కాగా హైదరాబాద్‌లో సోమవారం ఉదయం వర్షం దంచికొట్టింది. తెల్ల వారుజాము నుంచే వాతావరణం మేఘావృతం అయ్యిఉండటంతోపాటు ఉదయం పలు ప్రాంతాల్లో వర్షం పడింది. పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో రోడ్లపై నీరు నిలిచింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వారం రోజుల పాటు నగరంలో అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# క్వాంటమ్ టెక్నాలజీతో దేశాన్ని అగ్రగామిగా నిలబెడతాం



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వివరాలు వెల్లడిస్తున్న జిఎస్ఐ అధికారులు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్) జూన్ 9, ప్రభాతవార్త:** క్వాంటమ్ టెక్నాలజీతో భారతదేశాన్ని ప్రపంచం లోనే అగ్రగామిగా నిలబెట్టడమే కేంద్ర ప్రభుత్వం ధ్యేయమని కేంద్ర భూగర్భ గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజక వర్గం నాగోల్ డివిజన్‌లోని జిఎస్ఎల్ సోమవారం నెక్స్ట్‌జెన్ జియో ఫిజిక్స్ 2025 సదస్సును మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌తో కలిసి మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ ఆవిష్కర ణలతో ప్రపంచ వ్యాప్తం గా మొదటి బహుమతిని భారతదేశం సాధించిందని గుర్తు చేశారు. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, జియో ఫేషియల్ అనలిటిక్స్ ద్వారా ఖనిజ అన్వేషణ, ప్రమాద అంచనా, స్థిరమైన అభివృద్ధిని సాధించగలుగుతున్నామని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారానే అది సాధ్యమైందన్నారు. భారతదేశంలో పెరుగుతున్న నాయకత్వాన్ని జి-7, జి-20 సద స్సులలో ప్రపంచానికి తెలియజేశామన్నారు. దేశ అభివృద్ధికి కీలకమైన ఖనిజాలను భద్రపరచడంపై వ్యూహాత్మక దృష్టి సారిస్తున్నామన్నారు. భారత దేశానికి 175 సంవత్సరాలు అద్భుతమైన సహకారాన్ని జిఎస్ఐ అందించడం పట్ల మంత్రి ప్రశంసించారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం క్లీన్ ఎనర్జీ, సాంకేతిక అవసరాలను తీర్చడానికి హై రిజ ల్యూషన్, భూకంపం డేటా, ఏఐ ఎంఎల్, ఇంటిగ్రేషన్ జియోఫిజికల్, మ్యాపింగ్‌లను ఉపయోగించే ప్రాముఖ్యతను గురించి వివ రించారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఖనిజ భద్రత, పర్యావరణ ప్రకృతి వైపరీత్య సవాళ్లను పరిష్కరించడంలో భౌగోళిక శాస్త్రీయ పరిశోధన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భౌగోళిక ప్రమాద అంచనాలు, ఖనిజ పరిశోధనలో జిఎస్ఐ కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో జిఎస్ఐటిఐ మిషన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్ రవి, జిఎస్ఐ డైరెక్టర్ జనరల్ అసిత్‌సహా, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్పి సింగ్, కార్పొరేటర్లు చింతల అరుణ సురేందర్ యాదవ్, కొప్పుల నరసింహారెడ్డి, జిల్లా బిజెపి నాయకులు సామ రంగారెడ్డి, వన్‌పల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐసెట్-2025 పరీక్షకు 90 శాతం హాజరు

### 21న ప్రాథమిక కీ విడుదల..

### 26 వరకు అభ్యంతరాలు స్వీకరణ

### 93 కేంద్రాల్లో జరిగిన పరీక్ష

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఎ, ఎంసిఎ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఐ సెట్-2025 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలకి 90.51 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను ఆదివారం రెండు సెషన్‌లలో నిర్వహించగా.. సోమవారం ఒక సెషన్‌లో నిర్వహించారు. మూడు సెషన్‌లలో కలిపి 90.51 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు ఐ సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐ సెట్-2025కి 71,746 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 64,938 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 జోన్లలో 93 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకి 34,409 మంది పురుషులు దరఖాస్తు చేసుకోగా.. 37,331 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన సెషన్‌లో 93 పరీక్షా కేంద్రాల్లో 24,330 మందికి గానూ.. 21,897 మంది(90 శాతం) పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 91 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన సెషన్‌లో 24,330 మందికి గానూ 22,136 మంది(90.98 శాతం) హాజరయ్యారు. సోమవారం సెషన్ ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన పరీక్షను 91 కేంద్రాల్లో నిర్వహించగా.. 24,330 మందికి గానూ 20,905 మంది(90.55 శాతం) హాజరయ్యారు. మొత్తం మూడు సెషన్‌లలో 71,746 మందికిగాను.. 64,938 మంది(90.51 శాతం) హాజరయ్యారు. ఐ సెట్ ప్రాథమిక కీని ఈ నెల 21న విడుదల చేయనున్నట్టు ఐ సెట్ కన్వీనర్ ప్రొపెసర్ రవి తెలిపారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను ఈ నెల 26లోపుగా సమర్పించాలని సూచించారు.

# రూ. 2.50 లక్షల విలువైన మద్యం బాటిళ్లు సీజ్


### గోవా నుంచి వచ్చే వాహనాల తనిఖీ

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ ఎండిపిఎల్ నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మూడు కేసుల్లో ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది 56 మద్యం బాటిల్ లను పట్టుకున్నారు. సికిందరాబాద్ మిలిటరీ హాస్పిటల్ పరిసరాల్లో తిరుమలగిరి ప్రాంతంలో ఎస్టిఎఫ్ సిఐ నాగరాజు ఎస్సై జ్యోతి కలిసి శ్రీ పవ రమణ అనే వ్యక్తి వద్ద 20 సిగ్నేచర్ బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఇదే ఎస్‌టిఎఫ్‌డి టీం సికిందరా బాద్ పరిసర ప్రాంతాల్లో కేఎస్ఆర్ బెంగళూరు, రాజధాని ఎక్స్‌ప్రెస్ నుంచి వచ్చినటువంటి ప్రయాణికులను తనిఖీ చేస్తున్న సమయంలో అజయ్‌సింగ్ అనే వ్యక్తి కరోనా ఎక్స్ట్రా బీర్44 బాటిల్లను4 మద్యం బాటిళ్లను తీసుకువెళ్తుండగా సీఐ నాగరాజు సీట్ చేశారు.గంజాయిఅమ్మకాలు జరుగు తున్నాయని సమాచారం మేరకు వేస్ట్ మారేడ్పల్లి ప్రాంతంలో ఎస్‌టిఎఫ్ బి టీం సిఐ భిక్షా రెడ్డి ఎస్సై బాలరాజు ఎస్సై సంధ్యాలు టీం లీడర్ ప్రదీప్ రావులు కలిసి నిర్వహించిన దాడిలో రునీత్ ఆదిత్య అనే ఇద్దరు వ్యక్తులు ఇంట్లోంచి 13 గ్రాముల ఓజి కుష్ గంజాయితోపాటు, గోవా మణిపూర్ ఢిల్లీ ప్రాం తాల నుంచి తీసుకువచ్చిన 32 మద్యం బాటిళ్లను ఇంట్లో నిలువ చేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారని ఎస్టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్‌రావు తెలిపారు. వీరిద్ద రిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూపాయలు రెండున్నర లక్షల మేరకు ఉంటుందని అంచనా వేశారు.

**గోవా నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు.. 17 మద్యం బాటిళ్లు స్వాధీనం**

గోవా నుంచి వచ్చె వాహనాలను సోమవారం హెచ్‌టిఎఫ్, డిటిఎఫ్, చెక్‌పోస్టు ఎక్సైజ్ సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసీం ఇచ్చిన అదేశాల మేరకు ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్)పై వారం రోజులుగా తనిఖీలు చేపడుతున్నారు.జాహీరాబాద్ ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద ఎస్టీఎప్ సీఐ బిక్షా రెడ్డి, ఎస్సై బాలరాజు, సంగారెడ్డి టిటిఎఫ్ సీఐ హన్మంత్, చెక్‌పోస్టు సీఐ మల్లికార్జునబాబు సిబ్బంది కలిసి టూరిస్టు బస్సు లను, కార్లను, అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేశారు.

# కేరళ సముద్రజలాల్లో విదేశీ నౌకలో పేలుడు



### సకాలంలో స్పందించిన భారత నావికాదళం

**కొచ్చి, జూన్ 9:** కేరళ సముద్ర తీరంలో సోమవారం ఉదయం ఒక భారీ ప్రమాదం చోటు చేసుకుంది. సింగపూర్ జెండా కలిగిన ఎంవీ వాన్ హై 503 అనే భారీ కంట్టైనర్ నౌకలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనతో నౌక సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందు కున్న భారత నౌకాదళం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. రక్షణ శాఖ ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో కేరళ తీరానికి సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఎంవీ వాన్ హై 503 నౌక లోపలి భాగంలో ఈ పేలుడు సంభవించినట్లు ప్రాథ మికంగా నిర్ధారిం చారు. ప్రమాద వార్త అందిన వెంటనే భారత నౌకాదళం అప్రమత్త మైంది. తక్షణ సహాయక చర్యల నిమిత్తం ఐఎన్ఎస్ సూరత్ యుద్ధనౌకను ఘటనా స్థలానికి తరలించారు. దీంతో పాటు, కొచ్చిన్‌లోని నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ గరుడ్ నుండి డోర్నియర్ నిఘా విమానాన్ని పంపి, ఆ ప్రాంతంలో గగనతల పర్యవేక్షణ చేపట్టారు.

నౌకలోని సిబ్బంది భద్రత, నౌక పరిస్థితిని అంచనా వేశారు. ప్రమాదానికి గురైన ఎంవీ వాన్ హై 503 నౌక దాదాపు 270 మీటర్ల పొడవున్న భారీ కంట్టైనర్ రవాణా నౌక. ఇది జూన్ 7వ తేదీన శ్రీలంకలోని కొలంబో ఓడరేవు నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించింది. షెడ్యూల్ ప్రకారం, ఈ నౌక జూన్ 10వ తేదీ నాటికి ముంబైకి చేరుకోవాల్సి ఉంది.

మార్గమధ్యంలో కేరళ తీరానికి సమీపంలో ఉండగా ఈ దుర్ఘటన జరిగింది. ఇటీవల కేరళ తీరంలోనే మరో నౌక ప్రమాదానికి గురైంది. లైబీరియాకు చెందిన ఎంఎస్‌సీ ఎల్సా 3 అనే నౌక కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో ఒకవైపునకు ఒరిగిపోయింది. ఆ సమయంలో కొన్ని కంట్టైనర్లు సముద్రంలో పడిపోయాయి. ఇండియన్ కోస్ట్ గార్డ్ వెంటనే స్పందించి, ఆ నౌకలోని 24 మంది సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. ఆ నౌకలో చమురు, ఫర్నేస్ ఆయిల్‌తో పాటు కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలు కూడా ఉన్నాయి.

# సుక్మాలో పేలిన పాతర

### ఎఎస్పీ మృతి, డిఎస్పీ, సిఐ, ఎస్సైసహా 12మందికి తీవ్రగాయాలు

### ప్రతీకారానికి దిగిన మావోయిస్టులు



అడిషనల్ ఎస్పీ ఆకాష్‌రావు (ఫైల్)



ఐఇడి బాంబు పేలిన దృశ్యం

**జమ్మికుంట (హుజూరాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా, బీజాపూర్, దంతెవాడ, అంబుజ్‌ముడ్, బస్తర్, నేషనల్ పార్క్, కర్రెగుట్టలు దండకారణ్యంలో గత సంవత్సర కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో మావోయిస్టు నక్సల్స్ ఏరివేతలో ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తూ, పోలీసులు రోజురోజుకు ముందడుగు వేస్తుండడంతో బీతిల్లిపోయిన మావోయిస్టు దండకారణ్య బలగాలు, ప్లాటూన్‌లు ఒక్కసారిగా రగిలి పోయాయి. వారం రోజుల వ్యవధిలోనే కేంద్ర కమిటీ మావోయిస్టు నంబాల కేశవరావు అలియాస్ సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారాపు ఆడేల్లు అలియాస్ భాస్కర్, మరికొంత మంది సభ్యులు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో ప్రతికార దాహంతో రగిలిపోతున్న మావోయిస్టులు కేశవరావు మృతికి నిరసనగా ఈ నెల 10న బంద్‌కు పిలుపునిచ్చారు. దీనితో బంద్‌ను విచ్ఛిన్నం చేయడానికి దండకారణ్యంలోని ఆదివాసీ ప్రాంతాలలో పోలీసులు డేఘా కన్ను వేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని తారురోడ్లపై వాహనంలో ప్రయాణిస్తుండగా సోమవారం మావోయిస్టు నక్సల్స్ చత్తీస్‌ఘడ్ సుక్మాజిల్లా కొంట ఎర్రబోర సమీ పంలో ఐఇడి పే ల్చడంతో పెట్రో లింగ్‌కు వెళ్తున్న పోలీస్ వాహ నంలో సుక్మా జిల్లా అడిషనల్ ఎస్పి ఆకాష్‌రావు గిరిపుంజే అక్కడిక్కడ మృతి చెందగా, మరో డిఎస్పి, సిఐ, ఎస్సైలతో పాటు 12మంది భద్రత సిబ్బంది తీవ్రంగా గాయాలు కావడంతో హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోకి తరలించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. తీవ్ర గాయాలపాలైన ఎస్సై పరిస్థితి విషయంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సంఘటన స్థలం నుండి ఏఎస్పి ఆకాష్‌రావును మెరుగైన వైద్యంకోసం ఆసుపత్రికి తరలించిన ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించడంతో, చత్తీస్‌ఘడ్ పోలీస్ యంత్రాంగం ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

నేషనల్ పార్క్ దండకారణ్యంలో సుమారు వారం రోజులుగా జరుగుతున్న సెర్చ్ ఆపరేషన్‌లో పట్టుబడిన మావోయిస్టు నేతలను కాల్చి చంపారన్న పౌరహక్కుల సంఘం నాయకుల ఆరోపణలతో చత్తీస్‌ఘడ్ దండ కారణ్యంలో మావోయిస్టు పోలీస్ భద్రత బలగాల మధ్య తీవ్ర ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. చాలా కాలంగా శాంతిచర్చలకు మావోయిస్టు కేంద్ర, రాష్ట్రాల నాయకత్వాలు ఒకటికి నాలుగుసార్లు, నాలుగు మెట్లు దిగివచ్చిన, ఎన్నిమార్లు ప్రకటనలు చేసిన శాంతి చర్చలు అన్న పదాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూచికపుల్లగా పక్కన పడేయడంతో, ప్రతికార వాంఛలతో రగిలి పోతున్న మావోయిస్టు దండకారణ్య ప్లాటూన్ బలగాలతో పాటు దండకారణ్యంలోని మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు నేత, పిపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్జిఏ) మొదటి బెటాలియన్ చీఫ్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న హిడ్మా అలియాస్ సంతోష్ అలియాస్ విలాస్ తన అంతరంగిక యాక్షన్ టీం సభ్యులతో కలిసి, కొద్ది రోజులుగా దండకారణ్యంలో ఎత్తులు, జిత్తులతో చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే సుక్మా జిల్లా కొంట ఎర్రబోర సమీపంలో వ్యూహాత్మకంగా అమర్చిన ఐఈడి బందు పాతరలను పేల్చి వేసినట్లు పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. మోస్ట్ వాంటెడ్ గెరిల్లా మిలిట్రి శిక్షణలో ఆరితేరిన హిడ్మా వేలాది కిలోమీటర్లు దండకారణ్యాన్ని సుమారు 20వేల మంది బద్రత బలగాలతో సంవత్సర కాలంగా అడవిని జల్లెడ పడుతున్న ఆవగింజంతలో మెరుపు వేగంతో తప్పించుకుని పోతున్నాడే తప్ప.. ఆయనను చూసిన పోలీస్ భద్రత సిబ్బంది లేరు. వారం రోజుల క్రితం కొత్తగా దొరికిన హిడ్మా ఫోటోను పోలీసులు మీడియాకు విడుదల చేయడం జరిగింది. హిడ్మా బెటాలియన్‌లో గతంలో పనిచేసిన కొంతమంది మహిళలు, పురుషులు పలు కారణాల వల్ల పార్టీ నుండి బయటకు రావడంతో అక్కడి రాష్ట్ర యంత్రాంగం వారికి శిక్షణ ఇచ్చి, పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేసి ఆయుధాలు ఇవ్వడంతో, హిడ్మా కదలికలపై వారు డేఘా చూపుతో నిఘా వేసి శోదిస్తున్న, హిడ్మా తప్పించుకుని తిరుగుతున్నాడని, ఆయనతో పనిచేసిన అనుభవం తమకు ఉందని, పలువురు మహిళ బస్తర్ పోలీసులు నేషనల్ పార్క్ ప్రాంతంలో, హిడ్మా పనితీరుపై మీడియాకు అనేక అంశాలు వెల్లడించారు. సోమవారం జరిగిన ఈ ఘోర దుర్ఘటనపై చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. గాయాలపాలైన పోలీస్ సిబ్బందికి మెరుగైన కార్పోరేట్ వైద్యాన్ని అందిస్తున్నారు. ఐఈడి పేల్చిన మావోయిస్టుల కోసం పోలీస్ బలగాలు అరణ్యంలో ముందుకు దూసుకు పోతుండడంతో, ఆదివాసీ గుడాలలో తీవ్ర ఆందోళనలు చెలరేగుతున్నాయి. మావోయిస్టులు బంద్ పిలుపుచ్చిన 10వ తేదికి ముందే ఐఈడి పేల్చి పోలీస్ అధికారిని బలిగొనడంపై పోలీసులు జీర్ణించుకోలేక పోతున్నారు. దండకారణ్యంలో ఎక్కడో ఏం జరుగుతుందోనన్న భయం తో ఆదివాసీ గుడాలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నాయి.

## పాక్ డిజిఎంఒతో చర్చలు జరిపిన లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌ఘాయ్‌కు పదోన్నతి



**న్యూఢిల్లీ, జూన్ 9:** ఆపరేషన్ సిందూర్‌కు నేతృత్వం వహించిన లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ స్ట్రాటజీగా సోమవారం నియ మితులయ్యారు. అయితే డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) పదవిలో కూడా ఆయన కొనసాగుతారు. డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (స్ట్రాటజీ) అనేది ఆర్మీ ఆపరేషన్స్, ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్‌లను పర్య వేక్షించేందుకు ఏర్పాటు చేసిన కొత్త విభాగం. రక్షణ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం ఇండియన్ ఆర్మీలోని అత్యంత కీలకమైన నియామకాలలో ఇది ఒకటి. కాగా, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్‌లోని కీలక వైమానిక స్థావరాలను భారత వాయుసేన ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది. కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) కోరారు. భారత డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్‌తో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో మే 10న భారత్, పాక్ మధ్య కాల్పుల ఒప్పందం అమలులోకి వచ్చింది. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌లో విశిష్ట సేవలను గుర్తిస్తూ జూన్ 4న జరిగిన డిఫెన్స్ ఇన్వెస్టిచర్ సెర్మనీ 2025 (ఫేజ్-2) సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్‌కు ఉత్తమ యుద్ధ సేవా మెడల్ కూడా లభించింది.

## హైకోర్టులో కూనంనేనికి ఊరట..

### అనర్హత కేసును కొట్టేసిన హైకోర్టు

### న్యాయం గెలిచింది: కూనంనేని

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు హైకోర్టులో గొప్ప ఊరట లభించింది. ఆయనపై అనర్హత వేటు వేయాలని నందూలాల్ అగర్వాల్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తున్నట్టు సోమవారం ప్రకటిం చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూనంనేని సాంబశివరావు నిబంధనల మేరకు అఫిడవిట్‌ను దాఖలు చేయలేదని కొత్తగూడెం పట్టణానికి చెందిన నందూలాల్ హైకోర్టును ఆశ్రయించారు. కూనంనేనిపై అనర్హత వేటు వేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నందూలాల్ వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలంటూ కూనంనేని హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై వాదనలు విన్న హైకోర్టు.. పిటిషన్‌ను క్వాష్ చేయడానికి నిరాకరించింది. ఈ అంశంపై సమగ్రంగా విచారణ జరగాల్సి ఉందని తెలిపింది. దీంతో ఈ తీర్పును సవాలు చేస్తూ కూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే తనపై దాఖలు అయిన పిటిషన్‌ను కొట్టివేయాలంటూ కూనంనేని వేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో తాజాగా ఈ కేసులో వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. సరైన ఆధారాలు లేవంటూ నందూలాల్ అగర్వాల్ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం హైకోర్టు తుదితీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. న్యాయమే గెలిచిందని అన్నారు. గతంలో ప్రజాక్షేత్రంలో గెలుపొందడం ద్వారా ప్రజా విజయం సాధించామని.. తాజాగా తన ఎన్నిక చెల్లందంటూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం ద్వారా న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు. ఈ తీర్పుతో న్యాయ వ్యవస్థ పట్ల మరింత విశ్వాసం, గౌరవం ప్రజలలో పెరిగిందన్నారు. లక్షలాది మంది ఓట్లు వేసి గెలిపించినప్పటికీ, వారి మనోభావాలకు భిన్నంగా అడ్డదారుల్లో ప్రయోజనం పొందాలని అనుకునేవారికి ఈ తీర్పు చక్కటి గుణపాఠమన్నారు. ఈ తీర్పు ప్రజా సేవలో ద్విగుణీకృతమైన ఉత్సహంతో పనిచేసేందుకు మరింత స్ఫూర్తిని కలిగించిందని సాంబశివరావు తెలిపారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన మంత్రి శ్రీధర్‌బాబు

## మల్‌రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తాం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ (తుర్కయంజాల్) జూన్ 9, ప్రభాతవార్త :** 10 సంవత్సరాల పాటు ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ పార్టీని నిలబెట్టిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శ్రీధర్‌బాబు కరీంనగర్ నుంచి నేరుగా తుర్కయంజాల్ మున్సి పాలిటీ తొర్రూరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కు రావడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... నిన్న మంత్రివర్గం విస్తీర్ణంలో సామాజిక కోణంలో ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడవద్దని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డికి మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని సహాయ శక్తుల కృషి చేస్తానని వారు వివరించారు. మూడో విడత మంత్రివర్గ విస్తీర్ణంలో రంగారెడ్డి జిల్లాకు న్యాయం జరుగుతుందని వారు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గతంలో రంగారెడ్డి జిల్లాకు 2,3 మంత్రులు ఉండేవారని కానీ ఇప్పుడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, హైద రాబాద్, మల్కాజిగిరి జిల్లాల నుంచి ఒక్క ఎమ్మెల్యేను కూడా మంత్రివర్గంలో తీసుకోక పోవడం బాధాకరమైన విషయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర డెవలప్‌మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రామిరెడ్డి, భూపతి గల్లా మహిపాల్, ఇసి శేఖర్ మామ, కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, గుండ్లపల్లి ధనరాజ్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవుడా! మేం ఏం పాపం చేశాం!

**తల్లిదండ్రులకు కడుపుకోత**

**చిన్నారులను బలికొన్న నీటికుంట**

**బొమ్మనపల్లిలో విషాదఛాయలు**

**అచ్చంపేట, జూన్ 9, ప్రభాతవార్త:** నవ మాసాలు మోసి పేగు తెంచుకొని జన్మనిచ్చిన తల్లిదండ్రుల కళ్ల ముందు అల్లారుముద్దుగా ఆడుతూ పాడుతూ తిరుగుతున్న చిన్నారులు ఇద్దరు ఒకేసారి మృతి చెందడం ఆ తల్లి దండ్రులకు కడుపు కోత మిగిల్చింది. కోటి ఆశల తో తమ పిల్లలను అల్లారుముద్దుగా సాదు కుంటున్న తల్లిదండ్రు లకు ఇద్దరు చిన్నారుల మృతి తీరని శాపంగా మారింది. ఎస్సై పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, ధరణి దంపతులకు ఇద్దరు కుమారులు అక్షయ్(7), చైతన్య (6)లు ఉన్నారు. సోమవారం తల్లిదండ్రులతో కలిసి చిన్నారులు ఇద్దరు తమ వ్యవసాయ పొలానికి వెళ్లారు. తల్లిదండ్రుల వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు అన్నదమ్ములు సరదా కోసం వ్యవసాయ పొలంలో ఉన్న నీటికుంట వద్ద ఆడుతూ ఉండగా ప్రమాద వశాత్తూ నీటికుంటలో పడి మృతి చెందారు. చాలాసేపటి తర్వాత తల్లి దండ్రులు తమ పిల్లలు కనిపించడం లేదని వెతకగా నీటి కుంటలో ఇద్దరు చిన్నారులు విగత జీవులుగా కనిపించడంతో ఆ తల్లిదండ్రుల రోదన మిన్నంటింది. ఇప్పటివరకు కళ్లముందే ఆడుతూ పాడుతూ తిరిగిన చిన్నారులు ఒక్కసారిగా విగత జీవులుగా కనిపించడంతో ఆ తల్లికి కడుపుకోత మిగిలింది. ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో బొమ్మనపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదన పలువురిని కంటతడి పెట్టించాయి.

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలిప్‌మాసింగర్

# అవినీతే అసలు సమస్య!

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలంటారు. అవినీతిని అరికట్టేందుకు ఎన్నోచట్టాలు చేస్తున్నారు. మరెన్నో చర్యలు తీసుకుంటున్నారు. ఉక్కుపాదంతో అణిచివేస్తామని పాలక పెద్దలు పదేపదే ప్రకటిస్తున్నారు. అయినా ఏదో ఒకరూపంలో అవినీతి పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. పాలకులు ఎంతగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే కొద్దీ అవినీతి అంతగా పెరిగిపోతోంది. అభివృద్ధి, అవినీతి కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు అడుగులు వేస్తుంటే అవినీతి వెనక్కి గుంజుకుంటుంది. దేశవ్యాప్తంగా కానీ, తెలుగు రాష్ట్రాల్లో కానీ అవినీతిని అదుపు చేసేందుకు తీసుకుంటున్న చర్యలు సఫలీకృతం కావడం లేదు. కిందిస్థాయిలో చిరు ఉద్యోగుల్లో ఉన్న అవినీతిని అదుపు చేసేందుకు దాడులు చేసి, వలపన్ని పట్టుకొని చర్యలు తీసుకుంటున్నా ఉన్నతస్థాయిలో చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారేమోననిపిస్తున్నది. చట్టంఅందరికి సమానం అనే ఉపన్యాసాలు ఇస్తున్నా అవినీతి చట్టం మాత్రం కింది ఉద్యోగులకు ఒక రకంగానూ, ఉన్నత స్థాయిలో ఉద్యోగులకు మరో రకంగా ఉంటున్నది. ఉన్నతస్థాయిలో అవినీతిని అరికట్టడానికి కొంతమేరకు వెనుకంజ వేస్తున్నారనే చెప్పొచ్చు. అంతేకాదు ఆ స్థాయిలో జరిగే అవినీతి అంత సులభంగా బయటకుపొక్కదు. సాక్ష్యాలులభించవు. రుజువు చేయడం కష్టతరమైన పనే. అవినీతి రెండు, మూడు రకాలుగా ఉంటుంది. అందులో ఒకరకం మూడో మనిషికి కనపడదు. ఇచ్చి పుచ్చుకునే చేతులు రెండూ అదృశ్యంగానే ఉంటాయి. ఆ అదృశ్యహస్తాలు మూడో నేత్రానికి దృశ్యమానమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు, ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణాలు, గత, ప్రస్తుత పరిస్థితులను బట్టి వనరుల తహతును బట్టి ఎవరికివారు ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే. అంతేకాని అది ఫొటోలతోనో, ప్రత్యేక్ష సాక్షులతో రుజువు చేయడం సాధ్యమయ్యే పనికాదు. లంచం ఇచ్చినవారు తాము ఇచ్చినట్లు చెప్పరు. తీసుకున్న వారు తాము తీసుకున్నట్లు చెప్పరు. ఎవరైనా ఆరోపించినా ఇద్దరు కలిసి ఖండిస్తారు. ఈ అవినీతిని అరికట్టడానికి కొంత కష్టపడాల్సి వస్తుంది. ఈ అవినీతే ఉన్నత స్థాయి లో అధికంగా ఉంటుంది. రాజకీయ అవినీతి కూడా ఏమాత్రం తక్కువస్థాయిలో లేదు. మరొక రకం అవినీతి బాహాటంగా, ప్రజల ముందు ఉగ్రరూపం ధరించి చేస్తు న్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఇదే ఏ ప్రభు త్వాన్ని అయినా అప్రతిష్టపాలు చేస్తుంది. గతంలో పాలించిన కొందరు నేతలు ఇలా అప్రతిష్టపాలైన విషయం అందరికి తెలిసిందే. ఇక ఏయే విభాగంలో బహిరంగ అవినీతి జరుగుతుందో పాలకులకు తెలియంది కాదు. ప్రజలను పీడించి బాహాటంగా తీసుకుంటున్న అవినీతే అసలు సమస్య. కొందరు అధికారులు బరితెగించిపోతున్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్న శాఖల్లో అవినీతి పెరగడం ప్రభుత్వానికి కచ్చితంగా అప్రతిష్ట తెచ్చిపెడుతుంది. కష్టపడకుండా వీలైనంత తొందరగా లక్ష్మీపతులు కావాలనే దురాశ ఉన్నతస్థాయిలో పెరిగిపోవడం కొందరు అధికారుల ఆశ మితిమీరడంతో ఈదుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. రాజకీయ అండదండలుంటే తమను ఏమీ చేయలేరనే ధైర్యం కొందరిలో పెరిగిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఇందులో పరువు, ప్రతిష్ట గురించి ఆలోచించడం లేదు. దానికి తగ్గట్లు పాలకులు మాటలు చెప్తున్నారే తప్పచేతల్లో నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం వల్ల అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. నిన్న మధ్యప్రదేశ్‌లో బయటపడిన కుంభకోణం విస్తుపోయేలా చేస్తున్నది. ఏకంగా యాభైవేల మంది బోగస్ ఉద్యోగుల పేరుతో 230కోట్లకుపైగా ప్రజాధనాన్ని భోంచేశారంటే ఒకరోఇద్దరో చేసే పనికాదు అది. కింది నుంచి పైవరకుఎందరో పాత్రఉంటుంది. వాస్తవంగా ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు గత ఆరు నెలలుగా జీతాలు అందకపోడంతో ఈ భారీ మోసం బయటపడింది. దర్యాప్తులో ఏమేరకు బయటకు వస్తుందో వేచిచూడాలి. దిగజారిపోతున్న మానవతా విలువల పట్ల నిజాయితీపరులైన అధికారుల వేదనమౌనరోదనగా మిగిలిపోతున్నది. రెవెన్యూ, పోలీసుశాఖతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి కూడా భిన్నంగాలేదు. ధర్మాస్పత్రిలో ఉచిత చికిత్స కరవై పోతున్నది. ప్రధానంగా భూముల ధరలు ఊహించనివిధంగా పెరగడంతో రెవెన్యూ శాఖలో లంచాలు లక్షలకోట్లల్లో జరుగుతున్నాయి. ప్రభుత్వం చేపట్టేసంక్షేమ కార్యక్రమాల్లో కూడా ఈ అవినీతి పరుల చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అవినీతిశాఖ అధికారులు కూడా చిరు ఉద్యోగులనే వలవేసి పట్టుకుంటున్నారు తప్ప పెద్దపెద్ద చేపల జోలికి వెళ్లడం లేదు. పెద్దపెద్ద పదవుల్లో కీలక స్థానాల్లో ఉన్న అవినీతిపరులపై చర్యలు తీసుకోగలిగితే కిందిస్థాయిలో కొంత భయభక్తులు ఏర్పడతాయి. గతంలో ఎన్టీరామా రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయ అవినీతిని అరికట్టేందుకు ప్రయత్నం జరిగింది. ఆ ప్రభావం కొంత కన్పించింది. ముఖ్యమంత్రికి తెలుస్తుందేమోనన్న భయం ఆనాటి నాయకుల్లో ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల ఆర్థికపరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. అప్పుల మీద అప్పులు తెచ్చుకుంటున్నారు. వేలాది రూపాయలు వడ్డీ రూపేణ చెల్లిస్తున్నారు. ఇందులోనూ ప్రతిపైసా ప్రజలే చెల్లిస్తున్నారనే వాస్తవాన్ని పాలకులు విస్మరించరాదు. ఇలా అప్పులు తెచ్చుకుంటున్న నిధులు అవినీతిపరులుకాకుండా చూడాల్సినబాధ్యత పాలకులపై ఉంది. అవినీతిని అదుపు చేయకుండా ఎన్ని అప్పులు చేసినా పన్నుల రూపేణా ముక్కుపిండిఎన్నివేల కోట్ల రూపాయలు వసూలు చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.

యుద్ధానికి ఎవరూ కారణాలను అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

తొందరపడి నిర్ణయాలకు రావడం అనే వ్యాయామాన్ని మాత్రమే మూర్ఖులు చేస్తుంటారు.



విలియం కాంటన్

# ప్రజావాక్కు



### భక్తుల పరిరక్షణే దేవ సేవ

మనదేశంలో పుణ్యక్షేత్రాలకు ఉన్న గౌరవం అంతులేనిది. ఈ దేవస్థానాలు ఆధ్యాత్మిక శాంతిని అందించడమేకాక, సమానత్వానికి ప్రతీకలుగా నిలవాలి. కానీ, ప్రస్తుత పరిస్థితిలో వాటిలో వి.ఐ.పి దర్శనాల పేరుతో కలుగుతున్న విభేదాలు భక్తుల మనసులను బాధిస్తున్నాయి. టికెట్లను కొనగలిగేవారికే సౌకర్యాలు, ప్రాధాన్యతలు కల్పించడం అన్యాయంగా మారుతోంది. పుణ్యక్షేత్రాల్లో ప్రోటోకాల్ పరంగా రాజకీయ నాయకులు, అధికారులు, ఇతర ప్రముఖులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం వల్ల సాధారణ భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా పండుగలసమయంలో, కల్యాణోత్స వాలు, బ్రహ్మోత్స వాలువంటి ప్రత్యేకతిథుల్లో భక్తుల సంఖ్య పెరిగే సమయంలో తగిన ఏర్పాట్లు లేకపోవడం వల్ల తొక్కిసలాటలు సంభవిస్తున్నాయి. భక్తుల పరిరక్షణే దేవ సేవగా గుర్తించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### గోశాలలో మృతి

ఒకట, రెండా ఏకంగా 31 కోడెలు వేములవాడ రాజన్న గోశాలలో మృతిచెందడం విషాదకరం, ఆశ్చర్యకరం, అనుమానస్పదకరం. కచ్చితంగా విషాహార ద్వారాసంభవించిన మరణాలనిపిస్తోంది. పశువుల డాక్టర్లు ఏమని నిర్ధారించారో తెలియదు. దీన్ని రాజకీయం చేయద్దని పాలకపక్షం అంటోంది. ప్రతిపక్షాలు ఈవిషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు. హిందువులకు ఆవు పవిత్రజంతువు. దీన్ని బ్రహ్మ సృష్టించలేదంటారు. క్షీరసాగర మథనంలో ఉద్భవించిన కామధేనువు సంతతే ఇవి. పూర్వులు ఆవుపాలు తాగే జీవించారు. ఈ సంతతి తరిగి పోయిన తరువాత బర్రె పాలను అలవాటు చేసుకున్నాం.

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి సికింద్రాబాద్

### ప్రజలు అన్నీ గమనిస్తున్నారు

భూమి అభివృద్ధి కార్యక్రామాలవల్ల భూమి చదును పనుల వల్ల రైతు కోణంలో ఉపాధి హామీపని రైతులకు ఉపయోగకరంగా మారుతుంది. బీడు భూమిని సాగులోకి తేవడం వల్ల రైతు భూమి పంటకు యోగ్యంగా మారడం వల్ల రైతు సంపద కూడా పెరుగుతుంది. ప్రభుత్వం ఇటువంటిపనినిప్రోత్స హించాలి. ఉపాధిహామీతో యువతకు ఉపాధి లభించేలా, రైతుకు సహాయపడేలా చేయాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### పాఠశాలలకు పత్రికల నిధులు

కేంద్రం ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీ ఎంశ్రీ) పథకంలో భాగంగా ఎంపిక చేయబడిన పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రత్యేకంగా పత్రికలు కొనుగోలు నిధులను ముందస్తుగా విడుదల చేసింది. ఒక్కో పాఠశాలకు ఏడాదికి రూ. 10వేలు మంజూరయ్యాయి. ఈ నిధులతో తెలుగు, ఇంగ్లీష్ , హిందీ దిన పత్రికలు, వార, మాస పత్రికలు, మ్యాగజైన్లు కొనుగోలు చేయవచ్చు. పాఠశాల దశ నుంచే పత్రికల పఠనం విద్యార్థులకు ప్రయోజనకరం కానుంది. విద్యార్థులు సమకాలీన అంశాలపై పట్టు సాధించగలుగుతారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని ఉన్నత పాఠశాలలకు ప్రత్యేకంగా పత్రికా నిధులు విడుదల చేయాలి.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### డిఏ బకాయిలు చెల్లించాలి

కరోనా సమయంలో నిలిపివేసిన 18 నెలల డిఏ బకాయిల చెల్లింపు విషయంలో నేషనల్ కౌన్సిల్ అఫ్ జాయింట్ కన్సల్టెటివ్ మెషినరీ స్టాండింగ్ కమిటీ 63 వ సమావేశంలో ప్రభుత్వంతిరిగి చెల్లించాలి అనివాక్కాణించడం కొంచెం సహృదయనతో ఆలోచించవలసిన విషయం. ఆ సమయములో చాలా కుదేలైన అర్థికవ్యవస్థ వల్ల ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అంతేకాని ఎవ్వరి జీతాలు ఆపలేదు కదా. సరిఅయిన పనులు లేకదుర్భరస్థితిలో ఉన్నజనాలను, వ్యవస్థలనుచూసాం. అందువల్ల 8వ వేతన సంఘం పూర్తిగా అమలు చేయడానికి అడిగే హక్కు తప్పకుండా ఉన్నా కష్ట సమయంలో ఒక ఔదర్యం చేసి దానికి తిరిగి వెల కట్టడం సమంజసమా ఆలోచించాలి.

- గార్లపాటి సీతారారామయ్య,హైదరాబాద్

### విద్యార్థుల విజ్ఞాన విహారయాత్రలు

జూన్ 12 నుండి తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంస్థలు పునః ప్రారంభం కాబోతున్నాయి. విద్యార్థుల విజ్ఞానఅభివృద్ధికి గాను వివిధ ప్రాంతాలలో విహారయాత్రలకు వెళ్లి ఆయా చారిత్రక ప్రదేశాలనుచూసేవిధంగా తెలంగాణ రాష్ట్రవిద్యాశాఖ బస్సులలో, రైళ్లలోరాయితీ ప్రయాణ సౌకర్యంకల్పించాలి. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో చూసిన చారిత్రాత్మక ప్రదేశాలు, కట్టడాలు, నదులు, పర్వతాలు, దేవాలయాలు వంటి ప్రదేశాలను చూడడానికి గాను ప్రభుత్వం 5వ తరగతి నుండి ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు కూడా విజ్ఞాన విహారయాత్రలకు రూపకల్పన చేసి ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మాజీ జడ్జిలు సమాజానికి దిక్సూచి కావాలి

**కోర్టులలో ఏర్పడిన ఖాళీలను ఎప్పటికప్పుడు వెంటనే భర్తీచేయడమే కాకుండా మిగులు ఉండేలా చూడాలి. ప్రభుత్వానికి అదొక చట్టబద్ధమైన బాధ్యతగా చేయాలి. ఆ మేరకు సకాలంలో న్యాయస్థానాల్లో ఖాళీలు భర్తీ చేయకపోవడం ఉద్దేశపూర్వక నేరంగా పరిగణిస్తూ అవకాశం ఉంటే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేయాలి. అలాగే మాజీ న్యాయమూర్తులు సైతం ఎలాంటి పదవులు ఆశించకుండా అవకాశం, ఆసక్తి ఉంటే అటు ప్రజలకి ఇటు ప్రభుత్వానికి తమ విశేష అనుభవాలతో మంచి సలహాలిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేయాలి. సలహా కమిటీలకు సైతం అధికార, ప్రతిపక్షాలు, స్వచ్ఛందసంస్థలు ఆహ్వానిస్తే తప్ప గౌరవ పదవులకు అంగీకరించకూడదు. న్యాయవ్యవస్థ పరువు ప్రతిష్టలకి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఇతరుల కంటే మాజీ న్యాయమూర్తులపై ఎక్కువగా ఉంటుంది.**

డి వి.లక్ష్మీనారాయణ

ఇటీవల పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్‌ఓక్ తన పదవీ విరమణ వీడ్కోలు సందర్భంగా ఇక తను ఎలాంటి పదవులు స్వీకరించనని పేర్కొన్నారు. అలాగే తను సైతం పదవీ విరమణ తదుపరి ఎలాంటి ప్రభుత్వ పదవులు చేపట్టకూడదని నిశ్చయించుకున్నానని ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ సైతం వెల్లడించారు. వీళ్లనిర్ణయాలు న్యాయవ్యవస్థలో ఒక మంచి సంప్రదాయాన్నినెలకొల్పాయి. వీళ్ల ఆలోచనలు తటస్థంగా ఉండే న్యాయమూర్తులకు ఒక మంచి జ్ఞానోపదేశంగా భావించవచ్చు. ఏదో ఒక పదవి పట్టుకొని వేలాడే ఆలోచన ఉన్నవారికి ఈ నిర్ణయం రుచించకపోవచ్చు. పదవి వ్యామోహంతో పదవుల కోసం అన్ని విలువలు, హుందాతనాన్ని పక్కన పెట్టి పరుగులు తీసే వారికి ఈ న్యాయమూర్తుల నిర్ణయం బాగా చేదుగానే ఉంటుంది. ఈ సందర్భంగా గతం పరిశీలిస్తే మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ పదవీ విరమణ చేసిన వెంటనే రాజ్యసభ సభ్యునిగా కేంద్ర ప్రభుత్వం నియమించడం పలు విమర్శలకు, ఎన్నో సందేహాలకు స్వాగతం పలికింది. అలాగే భారత ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా పదవీవిరమణ చేసిన సదాశివంను కేరళ గవర్నర్‌గా రాజకీయ నియామకంపై చెలరేగిన ఆరోపణలు న్యాయవ్యవస్థ ప్రతిష్టకి మసి బారింది. లోక్‌పాల్ , కేంద్ర, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లు, జాతీయ, రాష్ట్ర, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార సంస్థ చైర్మన్లు, ప్రెస్ కౌన్సిల్ చైర్మన్, రాష్ట్రాలలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారాల పోరాల చైర్మన్లు, విద్యుత్ అంబుడ్స్‌మన్లు ఇంకా ఇలాంటి అనేక విచారణ సంస్థలకు జిల్లా కోర్టులు, హైకోర్టులు, సుప్రీంకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను నియమిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆయా చట్టాలలో నిబంధనలు రూపొందించారు. ఇవన్నీ శాశ్వత పదవులు కావు. తాత్కాలిక గౌరవ పదవులు మాత్రమే. ఈ గౌరవ పదవులు అనేకం రాజకీయ నియామకాలుగానే ఎంపిక జరుగుతోందని అపవాదు ఉంది. పదవిలో ఉండగానే పాలకుల మనోగతానికి అనుగుణంగా మనసెరిగి మసులుకోవటానికి వీలుగా గౌరవ పదవులు పాలకులకు రాజబాటగా ఉన్నాయని గుసగుసలు పెద్దగానే వినబడుతున్నాయి. కేంద్ర స్థాయిలోనే కాదు రాష్ట్రాలలో, కొన్ని జిల్లాస్థాయిలో అనేక సంస్థలకు పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు వాటిలో గౌరవ పదవుల కోసం పరుగులు తీస్తున్నారు. మనల్ని ఏదైనా పదవివెతుక్కుంటూ వస్తే అందులో సంపూర్ణఆనందం ఉంటుంది. అలాకాకుండా యాచించి, కొనుగోలు చేసి, పైరవీలు చేసి పొందే పదవులు తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇస్తాయి. పైగా ఎన్నో విమర్శలను ఎదుర్కోవాలి. దేవుడు తెలివి తేటలు, సిరి సంపదలు, ఉన్నత పదవులు ఇచ్చినా గాని సంతృప్తి లేకుండా గౌరవ పదవుల కోసం, ఇతరత్రా ప్రయోజనాల కోసం ప్రాకులాడటం గౌరవ న్యాయమూర్తుల స్థాయికి తగిన పని కాదు. నిజానికి సమాజానికి ఏదైనా సేవ చేయాలనుకుంటే కేవలం పదవులే అవసరం లేదు. ఏ పదవులు లేకుండా ఎంతోమంది ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా నిశ్శబ్ద ఉచిత సేవలు అందిస్తున్న వారిని చూస్తున్నాము. లోగడ 40 సంవత్సరాల క్రితం ఏదైనా గౌరవ పదవికి ఎంపిక చేయాలంటే ఆయా రంగాలలో అనుభవం, నిజాయితీలను ప్రాతిపదికగా తీసుకుని ప్రభుత్వం ఆహ్వానించేది. ఆ రోజుల్లో అలా పదవులు అర్హులను వెతుకుంటూ వచ్చేవి. ఉదాహరణకు ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి లోకాయుక్తగా పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి స్వర్గీయ ఆవుల సాంబశివరావుని ప్రభుత్వం ఎంతగానో ఒప్పించి నియమించింది. ప్రభుత్వ ఆహ్వానాన్ని గౌరవించి



లోకాయుక్తగా బాధ్యతలు నిర్వహించి ఆ పదవికి వన్నెతెచ్చారు. తదుపరి కాలక్రమంలో పరిస్థితులు అన్నీ మారిపోయినాయి. న్యాయమూర్తులు పదవీ విరమణకి కొంతకాలం ముందుగానే తన హోదాకు తగిన గౌరవ పదవులు ఏమీ ఉన్నాయో వాకబుచేసి పాలకుల మనసెరిగి వారి ఆశీస్సులు పొంది పదవి విరమణ చేసిన వెంటనే గౌరవ పదవులు పొందటం అనేది ఒక రుజువు చేయలేని నిజం. అందువలన ఈ గౌరవ పదవులకు ఆ పదవులలో తిష్ట వేసిన పెద్దలపట్ల ప్రజలలో ఏమాత్రం గౌరవభావం లేదు. కొనుగోలు చేసి పదవులు పొందిన చోట న్యాయం సైతం సహజంగానే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కాగా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు కొందరు విశ్రాంతి తీసుకుంటూ ప్రశాంత శేషజీవితం కొనసాగిస్తుండగా మరి కొందరు తమ నిస్వార్థసేవలు మరికొంత కాలం సమాజానికి అందించాలనే సంకల్పంతో వృద్ధాప్యం కారణంగా శారీరక ఆరోగ్యం సహకరించకపోయినా గానీ పలువురు మాజీ న్యాయమూర్తులు గౌరవ పదవుల బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి మహోన్నత సేవలు అందిస్తున్నారు. తద్విరుద్ధంగా పలువురు గౌరవ పదవుల కోసం క్యూ కడుతూ పదవీ విరమణ అనంతరం గౌరవ పదవుల కోసం ప్రాకులాడుతూ ఏదో విధంగా పదవులు చేజిక్కించుకుంటున్నారు. జిల్లా న్యాయమూర్తి స్థాయి నుండి హైకోర్టు ,సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వరకు పదవీ విరమణ అనంతరం అనేక గౌరవ పదవులలో మాజీ న్యాయమూర్తులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతలు అప్పగిస్తున్నాయి. సుమారు 200 దాకా గౌరవ పదవులకు మాజీలతో భర్తీ చేస్తున్నారు. వివిధ న్యాయస్థానాలలో అవసరమైన మేరకు ఎప్పటికప్పుడుప్రభుత్వాలు న్యాయమూర్తులను నియమించకపోవడం కారణంగా రెగ్యులర్ కోర్టులకే పెద్దసంఖ్యలో ఖాళీలు ఏర్పడుతున్నాయి. దాంతో న్యాయస్థానాలుగా పరిగణించే పలు సంస్థలకుగౌరవ న్యాయమూర్తిగా పదవీవిరమణ చేసిన వారిని నియమించటం తప్పనిసరి అయింది. దాంతో ఈ గౌరవ పదవులకు గిరాకీ ఏర్పడింది. తదుపరి పోటీ అనివార్యమై ప్రభుత్వం మాజీలు పరస్పరం ఒకరికి ఒకరు సహకరించుకొనే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఫలితంగా ఆరోపణలకి ఆ మడ దూరంలో ఉండాల్సిన న్యాయవ్యవస్థ ఆరోపణల ఊబిలో కూరుకుపోతోంది. గౌరవపదవులు పొందినన్యాయమూర్తులు పలువురు న్యాయవ్యవస్థ విలువల పతనానికి ఇంధనంగా మారారు. సర్వీసులో ఉండగా ఎంతో నిక్కచ్చిగా నిజాయితీగా ఉండేవారు సైతం ఈ గౌరవపదవులు పొందాక స్థాయిమరిచి దిగజారిన వ్యవహారాలలో మునిగితేలుతున్నారు. అందుకు కారణం ఈ గౌరవ పదవులు నిర్దిష్ట కాలానికి పరిమితం. ఏమైనా ఆరోపణలొచ్చినా గాని కనీసచర్యలు సైతంఉండవు, సరికదా పదవి నుండి తొలగించాలన్న ఎంతో క్లిష్టమైన న్యాయ ప్రక్రియఉంటుంది. బాధిత సామాన్యుల వల్ల కాదు. ఒక్క అధికార పార్టీకి మాత్రమే సాధ్యపడుతుంది. అధికార పార్టీకి ఎలాంటి ఇబ్బంది లేనంతకాలం పదవీగండంభయం ఉండదు. కాలపరిమితి తీరిపోయేవరకు తిరుగులేదు. ఒకవేళ తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం కన్నెర్ర చేసిన గాని భయపడాల్సింది ఏమీలేదు. సంపాదించుకున్న సొమ్మంతా మూటకట్టుకొని ఇంటిదారి పట్టవచ్చు. ఎందుకంటే అదిశాశ్వత పదవికాదు కాబట్టి పెన్షన్ ఎలాగువస్తుంది. మరొకరాజకీయ నాయకుల ద్వారా ఇంకొక గౌరవ పదవి పొందే అవకాశం ఎలాగూ ఉంటుంది. ఏ స్థాయిలో అయినా న్యాయమూర్తులుగా పదవీ విరమణ చేసినవారిని కేవలం ఏదైనా సలహా కమిటీకి లేదాసంఘటన విచారణ కమిటీకి చైర్మన్‌గా గౌరవ పదవికి మాత్రమే నియమించాలి. రెండు నుండి ఐదు సం॥రాల కాలపరిమితికి ఉండే న్యాయస్థానాలకు రాజకీయపరమైన పదవులకు మాజీ న్యాయమూర్తులను నియమించకుండా చట్టసవరణ చేయాలి. ఇక న్యాయస్థానాలకు సర్వీసులో ఉన్న న్యాయమూర్తులను మాత్రమే నియమించాలి. అందుకు అనుగుణంగా కోర్టులలో ఏర్పడినఖాళీలను ఎప్పటికప్పుడు వెంటనే భర్తీచేయడమే కాకుండా మిగులు ఉండేలా చూడాలి. ప్రభుత్వానికి అదొక చట్టబద్ధమైన బాధ్యతగా చేయాలి. ఆ మేరకు సకాలంలో న్యాయస్థానాల్లో ఖాళీలు భర్తీ చేయకపోవడం ఉద్దేశపూర్వక నేరంగా పరిగణిస్తూ అవకాశం ఉంటే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేయాలి. అలాగే మాజీ న్యాయమూర్తులు సైతం ఎలాంటి పదవులు ఆశించకుండా అవకాశం ఆసక్తిఉంటే అటుప్రజలకి ఇటు ప్రభుత్వానికి తమ విశేషఅనుభవాలతో మంచిసలహాలిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేయాలి. సలహా కమిటీలకు సైతంఅధికార, ప్రతిపక్షాలు, స్వచ్ఛందసంస్థలు ఆహ్వానిస్తే తప్ప గౌరవ పదవులకు అంగీకరించకూడదు. న్యాయవ్యవస్థ పరువు ప్రతిష్టలకి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఇతరుల కంటే మాజీ న్యాయమూర్తులపై ఎక్కువగా ఉంటుంది. ●

# ప్రగతి ఉన్నా.. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు!

మహమ్మద్ ఆరిఫ్

సుమారు 4.2 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారతదేశం రూపాంతరం చెందింది. జపాన్‌ను వెనక్కి నెట్టి అమెరికా, చైనా, జర్మనీ తర్వాతి స్థానాన్ని ఆక్రమించింది. మరి కొన్నేళ్లలో జర్మనీని సైతం అధిగమించే అవకాశముంది. అయితే ఇది ఒకవైపు మాత్రమే. మరోవైపు నామినల్ పర్ క్యాపిటా జీడీపీలో మాత్రం భారత్ తీవ్రంగా వెనకబడి ఉంది. 196 దేశాలతో పోల్చుకుంటే 143వ స్థానంలోఉంది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం భారత దేశ తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. అంటే సుమారు రెండున్నర లక్షల రూపాయలు. జీడీపీలో టాప్5లోని దేశాల్లో ఉన్న తలసరి ఆదాయం కంటే ఇది ఎంతో తక్కువ. టాప్ 5జీడీపీ దేశాల్లో ఉన్న పర్ క్యాపిటా జీడీపీతో పోల్చుకుంటే భారతదేశం ఎంతో వెనకబడి ఉంది. 30.34 ట్రిలియన్ డాలర్లతో జీడీపీలో మొదటి స్థానంలో ఉన్న అమెరికా 89,108 డాలర్ల (సుమారు రూ.75 లక్షలు) పర్‌క్యాపిటా జీడీపీతో తలసరి ఆదాయంలో 12వ స్థానంలో ఉన్నది. 19.53 ట్రిలియన్ డాలర్లతో జీడీపీలో రెండో స్థానంలో ఉన్న చైనా 13,657 డాలర్ల (సుమారు రూ. 11.65 లక్షలు)తో తలసరి ఆదాయంలో 70వ స్థానంలో ఉన్నది. 4.92 ట్రిలియన్ డాలర్లతో జీడీపీలో మూడో స్థానంలో ఉన్న జర్మనీలో పర్ క్యాపిటా జీడీపీ 55,952 డాలర్లు (రూ.47.67 లక్షలు) కాగా, తలసరి ఆదాయంలో ఆ దేశం 19వ స్థానంలో ఉన్నది. అదే భారతదేశానికి వస్తే 4.187 ట్రిలియన్ డాలర్లతో జీడీపీలో నాలుగో స్థానంలో ఉండగా, పర్ క్యాపిటా జీడీపీ మాత్రం 2,897 డాలర్లు (రూ. 2.5 లక్షలు) మాత్రమే. ప్రపంచ ర్యాంకింగ్ లో 143వ స్థానంలో ఉంది. మరోవైపు ఇటీవల భారత్ అధిగమించిన జపాన్ 4.186 ట్రిలియన్ డాలర్లు కాగా, ఆ దేశం 34,146 డాలర్ల (సుమారు రూ. 28.92 లక్షలు)తో పర్ క్యాపిటా జీడీపీలో 28వ స్థానంలో ఉండడం గమనార్హం. దీంతో జీడీపీ ఆధారంగా దేశాలఆర్థిక వ్యవస్థలను పోల్చడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మొదటి నుంచి భారతదేశంలో ఆర్థిక అసమానతలు వెంటాడుతున్నాయి. హారూన్ ఇండియా రిచ్ లిస్ట్ అంచనా ప్రకారం భారతదేశంలో బిలియనీర్ల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉన్నది. అదే సమయంలో 50 శాతానికి పైగా దేశ జనాభా రోజుకు రూ.300 కంటే తక్కువ ఆదాయం పొందుతున్నది. భారతదేశంలో ఒక శాతం జనాభా వద్ద 40 శాతం సంపద పోగుబడి ఉంటే.. 50 శాతం జనాభా వద్ద ఆరు శాతం సంపద మాత్రమే ఉన్నది. జీడీపీ లెక్కింపు ప్రక్రియ ప్రామాణికతపై అనేక అనుమానాలు ఉన్నాయి. మార్కెటేతర కార్యకలాపాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల అమ్మకాలు, ఇంకా అనేక రకాల కార్యకలాపాలు జీడీపీలో ఉండవు. రిజిస్టర్డ్ మార్కెట్లకు రాని వ్యవసాయ ఉత్పత్తులు అందులోకిరావు. జీడీపీని లెక్కించాలంటే వినిమయవ్యయం, ప్రభుత్వ వ్యయం, పెట్టుబడి వ్యయం, నికరఎగుమతులను లెక్కలోకి తీసుకుంటారు. అత్యధిక శాతమున్న అసంఘటిత రంగాన్ని ఇందులో లెక్కలోకితీసుకోరు. ఇంకా చాలారంగాలు జీడీపీ గణాంకాల్లో ప్రతిఫలించవు. దీంతో జీడీపీ పెరిగినా.. ఖర్చుచేయగలిగే ఆదాయం పడిపోవచ్చు. ప్రజల జీవితాలతో సంబంధం లేకుండా సంపద సృష్టి జరగవచ్చు. జీడీపీ పెరుగుదలను కొన్నిదేశాలు సంపదసృష్టిగా ప్రచారం చేసుకున్నా సగటు జీడీపీ పెరుగుదల పురోగతి కాకుండా తిరోగమనం కూడా కావచ్చు. జీడీపీ అనేది ఉత్పత్తిద్వారా వస్తున్న సంపదను మాత్రమే లెక్కిస్తుంది. జీడీపీ లెక్కల ద్వారా సంపద సృష్టిజరిగి అందరూ లాభపడతారని భ్రమకలిగిస్తారు. దీంతో జీడీపీ దాస్తున్న విషయాలను తెలుసుకోవాలంటే ఇతర సూచికలపై ఆధారపడాల్సిందే. ఆకలి, శాంతి, పర్యావరణ పనితీరు, వాయు కాలుష్యం, లింగ అసమానత, మానవ అభివృద్ధి తదితర సూచికలను పరిగణనలోకి తీసుకుంటేనే ఆ దేశ నిజమైన అభివృద్ధిని లెక్కించవచ్చు. ●

# ఫీజుల నియంత్రణపై నిర్లక్ష్యమెందుకు?

డాక్టర్ మోటె చిరంజీవి

నేటి బాలలే రేపటి పౌరులు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది పాఠశాలలే. కానీ అలాంటి పాఠశాలలే అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నప్రైవేటు బడులు విద్యార్థుల చదువును సంతలో సరుకుగా మార్చేశాయి. స్కూల్‌లు ప్రారంభం కానున్నాయి. దోపిడి మొదలైంది. అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్ల, బుక్స్ సపరేట్ అని, యూనిఫామ్‌కు, ఐఐటి ఫౌండేషన్ అయితే సపరేట్, బస్సు ఫీజు సపరేటని ఇలా రకరకాల పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు పాఠశాలల యాజమాన్యాలు. తమ పిల్లలను ఉన్నతమైన, నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కోరిక కార్పొరేట్ మోజులో పడి ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు అవకాశంగా మారింది. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు తెరతీశారు. పట్టణాల్లో చదవాలంటే హాస్టలు వసతి కూడా వారికి అవసరమవుతుంది. దీంతో స్కూలు, హాస్టల్ పేరుతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.50 వేలవరకు, ఆ తర్వాత విద్యార్థులకు పాఠశాలను బట్టి రూ.60వేల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు తాము తక్కువ కాదంటూ కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఇదే సంప్రదాయానికి దిగాయి. సాధారణ చదువులతో ఐఐటీ ఫౌండేషన్ అంటూ మరికొంత నొక్కుతున్నాయి. దీంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్పించేందుకు వచ్చి వెనక్కి వెళ్లలేక, చేర్పించే సాహసం చేయలేక, తలిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. నేడు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ, దోపిడీచేస్తూ అక్షరాలను వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా కార్పొరేట్, సెమీ కార్పొరేట్ తరహా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాల దోపిడీకి అడ్డు అదుపు లేకుండాపోయింది. వీటిని నిరోధించాల్సిన అవసరం విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా నిబంధనలు పాతరవేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు చైతన్యమై ప్రభుత్వ నిబంధనలు, విద్యాహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిబంధనలు కనుక చూసినట్లయితే సెక్షన్ 6 ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ 11 ప్రైవేటు యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించే ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల



వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 1,2 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారివివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీస్ బోర్డ్‌లో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్ 12ప్రకారం టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20కి మించరాదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమాన్యం 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. పాఠశాల యాజమాన్యాలు నోట్‌బుక్స్, యూనిఫారాలు, స్కూల్ బ్యాగులు, ఇతర స్టేషనరీని అమ్మరాదు. ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా సూచించరాదు. డి.ఎడ్ లేదా బిఇడీ అర్హత ఉండాలి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు డీఎడ్ లేదా బీఇడీ అర్హత ఉండి టెట్‌లో అర్హత సాధించి ఉండాలి. విద్యార్థుల ఫీజు వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలి. జీవో నెంబర్ 42 ప్రకారం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయరాదు. ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలల్లో 1000 చదరపు మీటర్లు. గ్రామీణ ఇతర ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. పాఠశాల పక్కా భవనంలో నిర్వహించాలి. ప్రతి పాఠశాలలో సలహాలు, సూచనలకు ఫిర్యాదు బాక్సులు ఉండాలి. ఫీజు స్లిప్పులను చిన్నారుల చేతికి రాసి ఇస్తే జరిమానా ఉంటుంది. గతంలో చిన్నారి చేతికి రసీదు ఇచ్చిన ఓ ప్రైవేట్ స్కూలుకు చెందిన యాజమాన్యానికి భారీఎత్తున జరిమానా విధించింది విద్యాశాఖ. అనుమతులు లేకుండా స్కూళ్లనుప్రారంభించకూడదు. ప్రభుత్వ అనుమతితోనే ప్రారంభించాలి. ఆరు నెలల్లోపు అనుమతులు పొందాలి. 20 మంది చిన్నారులకు ఒక ఉపాధ్యాయుడు, ఒక సంరక్షకుడు ఉండాలి. రక్షణ భద్రతా పారిశుద్ధం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. భవనానికి ప్రహరీ ఉండి, గాలి వెలుతురు బాగా వచ్చేలా ఉండాలి. చిన్నారులు నిద్రపోవడానికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ఉండాలి. మరుగుదొడ్లు, స్నానాల గదిలో టవలు, సబ్బులు ఉంచి, పరి శుభ్రత చర్యలు పాటించాలి. సిసిటీవీలను అందుబాటులో ఉంచాలి. అగ్నిమాపక దళ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. ప్లే స్కూలు రోజుకు మూడు నుంచి నాలుగు గంటల్లోపు మాత్రమే నిర్వహించాలి. పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులతోనే బోధన ఉండాలి. చిన్నపిల్లలకు అవసరమైనటువంటి మందులు అందుబాటులో ఉండాలి. వైద్య నిపుణులతో ప్రతి మూడు నెలలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి. ప్రవేశ పత్రము, హాజరు, ఆరోగ్య రికార్డులు, స్టాకు ఫీజు, వగైరా రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలి. ప్రవేశాలు పూర్తయిన తర్వాత తల్లిదండ్రుల కమిటీని నెలలోపు నియమించాలి. ఇందులో 50శాతం తల్లులు, 25శాతం ఉపాధ్యాయులు, 25శాతం తండ్రులు ఉండేలా చూడాలి. ఈ కమిటీని ఏటా మారుస్తుండాలి. ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను నమోదు చేయాలి. ●

# ఆర్థికవృద్ధితోపాటు సామాజిక అభ్యున్నతి

## కేంద్రంలో 60% మంది ఎస్సీ, ఎస్టీ, ఓబిసి వర్గాలవారే

## వికసిత్ భారత్ లక్ష్యసాధనగా ముందుకు

## 11 యేళ్ల పాలనపై ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జూన్ 9:** ఎన్‌డిఎ పదకొండేళ్ల పాలనలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించిందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో ప్రపంచ గళంగానూ మారిందని పేర్కొన్నారు. తన నేతృత్వంలోని మూడోవిడత ఎన్‌డిఎ ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. సుపరిపాలన, పరివర్తనపై పూర్తిస్థాయిలో దృష్టిసారించామని ప్రధాని మోడీ అన్నారు. సామాజిక న్యాయానికి సైతం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేసిన ప్రధాని మోడీ, తమ మంత్రి మండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వారే ఉన్నట్లు తెలిపారు. ఈ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు మంత్రి పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఎన్‌డీఎ 11 ఏళ్ల ప్రస్థానంలో ఆర్థిక వృద్ధి నుంచి సామాజిక అభ్యున్నతి వరకూ ప్రజల కేంద్రంగానే పాలన సాగించినట్లు మోడీ వివరించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా తాము ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల పాల ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకిత భావాలకు ఒక స్వర్ణ యుగం అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు.

ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనలో భారత్ అభివృద్ధి, స్వావలంబన వైపు వేగంగా పురోగమిస్తోందని ఆయన అన్నారు. దేశ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశాన్ని ప్రతి రంగంలోనూ నంబర్‌వన్‌గా మార్చే ప్రయాణం కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. నాయకత్వం స్పష్టంగా ఉన్నప్పుడు, సంకల్పం దృఢంగా ఉన్నప్పుడు, ప్రజాసేవ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పుడు సేవ, భద్రత, సుపరిపాలనలో కొత్త రికార్డులు సృష్టించబడతాని మోడీ ప్రభుత్వం నిరూపించిందని అమిత్ షా పేర్కొన్నారు. 2014లో ప్రధానిగా మోడీ దేశ పగ్గాలు చేపట్టినప్పుడు భారత్ విధాన పరంగా అచేతనంగా ఉంది. గత ప్రభుత్వాలకు విధానాలు లేవు, నాయకత్వం లేదు. మోసాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. పాలనా వ్యవస్థ దిశానిర్దేశం లేకుండా ఉండేది. కానీ గత 11 ఏళ్లలో కనిష్ట ప్రభుత్వం, గరిష్ఠ పాలన ద్వారా దేశ అభివృద్ధి వేగం, స్థాయి రెండూ మారాయని అమిత్‌షా అన్నారు. మోడీ రైతులు, మహిళలు, వెనుకబడినవారు, దళితులు, అణగారిన వర్గాలను పాలనలో భాగంచేశారు. బుజ్జగింపులకు బదులుగా సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే పని సంస్కృతిని సృష్టించారని అమిత్‌షా పేర్కొన్నారు. మోడీ జాతీయ భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో నక్సలిజం చివరి దశలో ఉంది. జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంది. భారత్ ఇప్పుడు ఉగ్రవాదుల స్థావరాల్లోకి చొరబడి వారిని అంతమొందిస్తోంది. ఇది మోడీ ప్రభుత్వ హయాంలో మారుతున్న భారత చిత్రాన్ని చూపిస్తోందని అమిత్ షా అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించపడుతుందని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ సవరణ బిల్లు, మహిళా బిల్లు, పెద్దనోట్లరద్దు ఎన్‌డీఎ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లైనా సందర్భంగా నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు గురించి నడ్డా వివరించారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనేమంత్రంతో గత 11 ఏళ్లుగా ముందుకు సాగుతున్నామని నడ్డా తెలిపారు. 2014లో తాము అధికారంలో చేపట్టినప్పుడు భారత్ ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండగా, ప్రధాని మోడీ దార్శనికతతో ప్రస్తుతం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందనిఅన్నారు.

ఇకనుంచి ఉగ్ర దాడులను యుద్ధం గానే భావిస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతరాహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, దేవుడు ఆయనకు కాస్త బుద్ధిని ప్రసాదించాలని కోరారు. ఆపరేషన్ సిందూర్, విదేశాంగ మంత్రి జైశంకర్‌పై రాహుల్ ఆరోపణల నేపథ్యంలో నడ్డా రాహుల్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# జవాబుదారీతనం లేని 11 యేళ్ల పాలన

## ఎన్‌డిఎ పాలనపై రాహుల్, ఖర్గేల ధ్వజం

**న్యూఢిల్లీ,జూన్ 9:** కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోడీ సర్కార్ 11 యేళ్ల పాలనలో ఎటువంటి జవాబుదారీతనం లేదని, ప్రచారం మాత్రమే ఉందని ఆరోపించారు. ప్రస్తుతం గురించి మాట్లాడటం మానేసి, ఇప్పుడు 2047 కలలు కంటోందని ఆరోపించారు. మహారాష్ట్రలోని థాణెలో రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి జారిపడి నలుగురు మరణించడం, ఆరుగురు గాయపడడంపై రాహుల్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ క్రమంలో కేంద్రం తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు.

మోడీ ప్రభుత్వం 11ఏళ్ల పాలన సంబరాలు జరుపుకుంటుండగా, ముంబయి నుంచి వస్తున్న విషాద వార్త దేశ వాస్తవికత ప్రతిబింబిస్తుంది. రైలు నుండి పడి అనేక మంది మరణించారు. భారతీయ రైల్వేలు కోట్లాది మంది జీవితాలకు వెన్నెముక. కానీ నేడు అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారింది. మోడీ సర్కార్ 11 ఏళ్ల పాలనలో జవాబుదారీతనం, మార్పు లేదు. ప్రచారం మాత్రమే ఉంది. 2025 గురించి మాట్లాడటం మానేసి, 2047 గురించి మాట్లాడుతోంది. థాణె రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని రాహుల్ గాంధీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. గడచిన 11ఏళ్లలో మోడీ ప్రభుత్వం దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ కొట్టిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అలాగే రాజ్యాంగంలోని ప్రతి పేజీలో నియంతృత్వ సిరా మాత్రమే పూసిందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ పోస్ట్‌లో మోడ సర్కార్‌పై మండిపడ్డారు. దేశంలోని అన్ని రాజ్యాంగబద్ధమైన సంస్థలను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు బలహీనపరిచి, వాటి స్వయం ప్రతిపత్తిపై దాడి చేశాయి. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వెళ్లి ప్రభుత్వాలను కూల్చేసిన పార్టీ బిజెపి. గత 11 యేళ్లలో రాష్ట్రాల హక్కులను కాషాయ పార్టీ విస్మరించింది. అలాగే సమాఖ్య నిర్మాణం బలహీనపడింది. ద్వేషం, బెదిరింపులు, భయానక వాతావరణాన్ని వ్యాప్తి చేయడానికి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని వారి హక్కులను హరించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. గత 11 ఏళ్లలో దేశంలో ఎస్సి, ఎస్టి, ఓబీసీలు, మైనార్టీలు, బలహీన వర్గాలపై దోపిడీ పెరిగిందని ఖర్గే ఆరోపించారు. వారి రిజర్వేషన్లు, సమాన హక్కులను హరించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. మణిపుర్‌లో కొనసాగుతున్న హింస బిజెపి పరిపాలనా వైఫల్యానికి అతిపెద్ద సాక్ష్యమన్నారు. యుపిఎ హయాంలో సగటున 8 శాతంగా ఉన్న దేశ జిడిపి వృద్ధి రేటును 56 శాతం వద్ద ఉంచామని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు అలవాటుగా వల్లెవేస్తున్నాయని మండిపడ్డారు.

ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీని నెరవేర్చడానికి బదులుగా, యువత నుంచి ఏటా కోట్లాది ఉద్యోగాలు లాక్కుంటున్నారు. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజా పొదుపులు 50ఏళ్లలో అత్యల్ప స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక అసమానతలు గత 100 ఏళ్లలో అత్యధికంగా ఉన్నాయి. నోట్ల రద్దు, జీఎస్‌టీ, ప్రణాళిక లేని లాక్ డౌన్‌లు అసంఘటిత రంగాన్ని దెబ్బతీశాయన్నారు. కోట్లాది మంది ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయని, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, నమామి గంగే, 100 స్మార్ట్ సిటీలు వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయి. భారతీయ రైల్వే నాశనమైంది. యుపిఎ శ్రమించి నిర్మించిన మౌలిక సదుపాయాల వద్ద మోడీ రిబ్బన్లు మాత్రమే కత్తిరిస్తున్నారని ఖర్గే విమర్శించారు.





# కలహాండిలో అవినీతి ఐఎఎస్!

## రూ.10 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

**భువనేశ్వర్, జూన్ 9:** ఒడిశాలో ఒక యువ ఐఎఎస్ అధికారి లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. కలహాండి జిల్లా ధర్మగఢ్ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న 2021 బ్యాచ్‌కు చెందిన ధీమాన్ చక్మ, ఒక వ్యాపారి నుంచి రూ. 10 లక్షలు లంచం తీసుకుంటున్న సమయంలో విజిలెన్స్ అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ధీమాన్ చక్మ స్థానిక వ్యాపారిని ప్రభుత్వపరమైన చర్యలు తీసుకుంటానని బెదిరించి, మొత్తం రూ. 20 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆ వ్యాపారవేత్త ముందుగా రూ.10 లక్షలు చెల్లించినప్పటికీ, ఆ తర్వాత విజిలెన్స్ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. ధీమాన్ ప్రభుత్వ నివాసంలో వ్యాపారి నుంచి మిగిలిన రూ. 10 లక్షల లంచం తీసుకుని, ఆ డబ్బును టేబుల్ డ్రాయర్‌లో పెడుతుండగా విజిలెన్స్ అధికారులు ఆయనను పట్టుకు న్నారు. లంచంగా స్వీకరించిన రూ. 10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో ఆయన నివాసం నుంచి వివిధ డినామినేషన్లలో ఉన్న 26 కట్టల కరెన్సీ నోట్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే విజిలెన్స్ అధికారులు ధీమాన్ అధికారిక నివాసంలో ఇంకా లోతుగా సోదాలు నిర్వహించగా, అదనంగా మరో రూ. 47 లక్షల నగదు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ మొత్తంలో నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై అవినీతి నిరోధక చట్టం 2018, సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ధీమాన్ చక్మ వాస్తవానికి త్రిపురలోని కాంచన్‌పూర్‌కు చెందినవారు. ఆయన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్) అధికారిగా కూడా పనిచేశారు. 2020 యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో 482వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

# హింసాత్మకంగా మారిన లాస్‌ఏంజెల్స్

## వలసదారులు, నేషనల్ గార్డుల మధ్య తీవ్ర ఘర్షణ





**లాస్‌ఏంజెల్స్, జూన్ 9:** అమెరికాలోని లాస్ ఏంజిల్స్ నగరం వారాంతంలో ఉద్రిక్తతలు, హింసకు కేంద్రంగా మారింది. ఫెడరల్ ప్రభుత్వం నగరవ్యాప్తంగా చేపట్టిన ఇమ్మిగ్రేషన్ దాడులకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ప్రదర్శనకారులకు, నేషనల్ గార్డ్ దళాలు, పోలీసులకుమధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నగరంలోని డౌన్‌టౌన్ లాస్ ఏంజిల్స్, బోయల్ హైట్స్ ప్రాంతాలు నిరసనలకు ప్రధాన వేదికలుగా మారాయి. వందలాది మంది ఆందోళనకారులు మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌తో పాటు ఇతర ఫెడరల్ భవనాల వైపు దూసుకెళ్లారు. కొందరు నిరసనకారులు రద్దీగా ఉండే 101 ఫ్రీవేపైకి ప్రవేశించి, ఇరువైపులా ట్రాఫిక్‌ను పూర్తిగా స్తంభింపజేశారు. దీంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రంగంలోకి దిగారు. అధికారులపై వస్తువులు విసిరే వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేస్తామని లాఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుహెచ్చరించారు. గుంపులను చెదరగొట్టడానికి ఫ్లాష్ బ్యాంగ్‌లు, టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘర్షణల సమయంలో పలువురు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గాయపడినట్లు ఫెడరల్ అధికారులు తెలియజేశారు. ఒక్క శుక్రవారం రాత్రే కనీసం 29 మంది నిరసనకారులను అరెస్టు చేసినట్లు సమాచారం. ఫెడరల్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆపరేషన్లకు వ్యతిరేకంగా ప్రదర్శనకారులు, వలసదారుల హక్కుల సంఘాలు ఈ నిరసనలకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ చర్యలు స్థానిక సమాజాలలో భయాందోళనలు, ఆగ్రహాన్ని రేకెత్తించాయని వారు ఆరోపించారు.

కాలిఫోర్నియాకు 2వేల మంది నేషనల్ గార్డ్ దళాలను మోహరించడాన్ని అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సమర్థించుకున్నారు. నిరసనకారులను హింసాత్మక గుంపులుగా అభివర్ణించిన ఆయన, ఫెడరల్ ఆస్తులను కాపాడతామని, నగరంలో శాంతిభద్రతలను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. అయితే, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ మాత్రం ట్రంప్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇది ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్య అని, ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తుందని ఆయన అన్నారు. అంతేకాకుండా ఇది రాష్ట్ర సార్వభౌమాధికారానికి తీవ్ర భంగం అని న్యూసమ్ పేర్కొన్నారు. వెస్ట్‌లేక్, పారామౌంట్ వంటి ఇతర ప్రాంతాలకు కూడా ఈ నిరసనలు వ్యాపించాయి. ఈ వారాంతపు ఘటనలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న నగరానికి, ఫెడరల్ అధికారులకు మధ్య సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి. శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమాజ పెద్దలు, అధికారులు పిలుపునిస్తున్నారు.

# నా కొడుకుతో గొడవలో ట్రంప్‌దే విజయం

## మస్క్ తండ్రి ఎరాల్ మస్క్ స్పందన



**వాషింగ్టన్, జూన్ 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య విభేదాలు తీవ్రంగా మారిన సంగతి తెలిసిందే. వీరిద్దరూ బహిరంగంగానే పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. దీనిపై తాజాగా మస్క్ తండ్రి ఎరాల్ మస్క్ స్పందించారు. గత కొన్ని నెలలుగా పరిపాలనకు సంబంధించిన విషయాల్లో మస్క్, ట్రంప్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. అయితే ట్రంప్ తీసుకువచ్చిన బిల్లు నేపథ్యంలో మస్క్ తీవ్ర అసహనానికి గురయ్యాడని.. అందుకే అధ్యక్షుడిపై ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయంలో వారిద్దరి మధ్య గొడవ వచ్చిందని పేర్కొన్నారు. అందమైన భారీ బిల్లును ట్రంప్ తీసుకురావడాన్ని మస్క్ వ్యతిరేకించారని ఎరాల్‌అన్నారు. కాంగ్రెస్, సెనెట్‌లలో ఓట్లు పొందాలంటే ట్రంప్ అటువంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని విషయాన్ని మస్క్ అర్థం చేసుకోవట్లేదని పేర్కొన్నారు. ట్రంప్ దేశానికి అధ్యక్ష స్థానంలో ఉన్నాడు కాబట్టి ఈ వివాదంలో తన కుమారుడిపై ఆయనే గెలిచే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికయినా ఇద్దరు వివాదాలను పక్కనపెట్టి కలిసి పని చేయాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.మే నెలలో అమెరికా ప్రభుత్వం తీసుకొచ్చిన రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడంతో ట్రంప్‌తో దూరం పెరిగింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి తాను కారణమని మస్క్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తోసిపుచ్చారు. తానెవరి సాయంలేకుండా నెగ్గానని సమాధానమిచ్చారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డోజ్) నుంచి తప్పించి నందుకే మస్క్‌కు అంత ఆక్రోశమని అధ్యక్షుడు పేర్కొన్నారు. ఇదే సమయంలో టెస్లా అధినేత కూడా సంచలన ఆరోపణలు చేశారు. లైంగిక వేధింపుల నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టయిన్ కేసులో ట్రంప్ పాత్ర ఉందని, అందుకే ఆ కేసు ఫైళ్లను పూర్తి స్థాయిలో ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. తర్వాత ఈ పరిణామాలపై అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రశ్నించగా.. తానుబిజీగా ఉన్నానంటూదాటవేశారు. అంతేకాదు.. మస్క్ గురించి తాను ఆలోచించడం లేదన్నారు.



# ఉక్రెయిన్‌పై 479 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా

## యుద్ధంలో అతిపెద్ద డ్రోన్ దాడి ఇదే..

**మాస్కో, జూన్ 9:** తమ వాయుసేన స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేసిన నాటి నుంచి రష్యా మరింత కఠినంగా స్పందిస్తోంది. తాజాగా ఈ మూడేళ్ల యుద్ధంలో ఎన్నడూ లేనంతగా.. 479 డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. ఈ విషయాన్ని కీవ్ వాయుసేన ధ్రువీకరించింది. దీంతోపాటు 20 క్షిపణులను కూడా తమ దేశంపై ప్రయోగించినట్లు పేర్కొంది. మధ్య, పశ్చిమ ఉక్రెయిన్‌లో ప్రదేశాలను ఇవి లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించింది. మాస్కో ప్రయోగించిన వాటిల్లో 277 డ్రోన్లు, 19 క్షిపణలను మార్గమధ్యంలోనే తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మొత్తంలో కేవలం 10 డ్రోన్లు లేదా క్షిపణులు మాత్రమే లక్ష్యాలను తాకినట్లు వెల్లడించింది. సాధారణంగా రష్యా డ్రోన్ దాడులు సాయంత్రం మొదలై.. తెల్లవారే వరకు కొనసాగుతాయి. చీకట్లో చాలా వరకు యుఎవిలను గుర్తించడం కష్టం కావడంతో.. ఈ వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఇటీవల మాస్కో పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకొంటున్నట్లు విమర్శిలున్నాయి. ఇప్పటివరకు రష్యా దాడుల్లో 12,000 మంది ఉక్రెయిన్ వాసులు ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు రష్యా మాత్రం తాము కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతోంది.

**రష్యా నేవీ సరికొత్త వ్యూహం..**

రష్యా నౌకాదళం కోసం సరికొత్త వ్యూహాన్ని ఆ దేశాధ్యక్షుడు పుతిన్ ఆమోదించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ దళంగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యమని క్రెమ్లిన్ ప్రతినిధి నికోలాయ్ పత్రుషేవ్ వెల్లడించారు.

ఈ ప్లాన్ గురించి మరే వివరా లను ఆయన వెల్లడించలేదు. చైనా, అమెరికా తర్వాత మూడో అతిపెద్ద నేవీ రష్యా వద్దే ఉంది. కానీ, ఇటీవల ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో దానికి తీవ్ర స్థాయిలో ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రస్తుతం మాస్కో వద్ద 79 జలాంతర్గాము లున్నాయి. వీటిల్లో 14 అణుశక్తితో పనిచేస్తాయి. ఇక 222 యుద్ధనౌకలు కూడా ఆ దేశ అమ్ముల పొదిలో ఉన్నాయి. తాజాగా పుతిన్ ఆమోదించిన వ్యూహం ప్రకారం 2050 నాటికి రష్యా నౌకాదళాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఇక మరోవైపు చైనా నౌకాదళం వేగంగా ఎదుగుతోందని అమెరికా రక్షణ శాఖ నివేదిక పేర్కొంది. 2030 నాటికి దాని వద్ద 460 నౌకలు ఉంటాయని పేర్కొంది.

# ట్రంప్‌కూ తప్పని తడబాట్లు!

## విమానం ఎక్కుతూ మెట్లపై తూలి పడబోయిన అమెరికా అధ్యక్షుడు



**న్యూజెర్సీ, జూన్ 9:** రెండోసారి అధ్యక్ష పీఠం అధిరోహించిన డొనాల్డ్ ట్రంప్ టైమ్ అస్సలు బాగులేదు. ఎన్నికల్లో తన వెన్నంటి నిలిచి విజయంలో కీలకంగా వ్యవహరించిన మిత్రుడు ఎలాన్ మస్క్ ఆయనకు శత్రువయ్యాడు. ట్రంప్ విధానాలు, నిర్ణయాలను బాహటంగా వ్యతిరేకిస్తూ కంట్లో నలుసుగా మారిపోయాడు మస్క్. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు సమాచారం. ఇంకో వైపు పని ఒత్తిడితో అల్లాడిపోతున్నారు. దీంతో ఆయన తాజాగా, విమానం ఎక్కుతూ తుళ్లిపడబోయారు. త్రుటిలో ఆయన మెట్ల మీద నుంచి కిందపడిపోయేవారు.అదృష్టం బాగుండి ట్రంప్‌కి పెద్దప్రమాదంతప్పింది. డొనాల్డ్ ట్రంప్ న్యూజెర్సీలోని మారీస్‌టౌన్ మున్సిపల్ విమానాశ్రయంలో విమానం ఎక్కుతూ తూలిపడ్డారు. మెట్లపై నుంచి ఎక్కుతూ కుడిచేత్తో రెయిలింగ్ పట్టుకున్నారు. ఈ క్రమంలో ఓ మెట్టు చివరన కాలు పెట్టడంతో జారిపడ్డారు. ఆ వెంటనే నిలదొక్కుని రెయిలింగ్‌ను పట్టుకుని ఉండటం వల్ల మోకాళ్లపై కింద పడపోకుండా నియంత్రించుకున్నారు. అనంతరం పైకి లేచి, చకచకా అక్కడినుంచి పైకివెళ్లి విమానం ఎక్కారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ క్రమంలో ఆయన తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయినట్టుతెలుస్తోంది. అటు, మిత్రుడు ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌నకు షాకిచ్చిన విషయం తెలిసిందే. తడబాటుకు ముందు ట్రంప్ ముఖంలో ఏదో తెలియని బాధ స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన దీర్ఘంగా ఆలోచిస్తూ మెట్లు ఎక్కడంతో తడబడ్డారు. కేవలం ట్రంప్ మాత్రమే కాదు, ఆయన పక్కనే ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా తడబడటం గమనార్హం. దీనిపై సోషల్ మీడియాలో నెటిజన్లు వ్యంగ్యంగా కామెంట్ చేస్తున్నారు.గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో డెమొక్రాట్ నేత జో బైడెన్ మానసిక స్థితి గురించి కామెంట్లు చేసిన ట్రంప్.. ఇప్పుడు తన పరిస్థితి గురించి ఏమంటారు? అని ప్రశ్నిస్తున్నారు.

# దక్షిణాదిపై బలవంతంగా హిందీ అమలు!

## నటుడు, ఎంఎన్‌ఎం అధినేత కమల్‌హాసన్

**చెన్నై,జూన్ 9:** దేశంలో భాషా విధానంపై చర్చలు కొనసాగుతున్న వేళ, ప్రముఖ నటుడు కమల్ హాసన్ దక్షిణాది రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. తన తాజా చిత్రం థగ్ లైఫ్ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, భాష అనేది స్వచ్ఛందంగా నేర్చుకోవాల్సిన విషయమని, విద్య అనేది అడ్డంకులు లేని అభ్యాసంగా ఉండాలని తెలిపారు. భాష ఏకరూపతను అమలుచేసే సాధనంగా మారకూడదని అన్నారు. విద్యను అభ్యసించడానికి అడ్డంకులు సృష్టించకుండా సులువైన మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఒకే జాతీయ భాషను బలవంతంగా రుద్దడం కంటే ఇంగ్లిష్, స్పానిష్ లేదా చైనీస్ వంటి అంతర్జాతీయ భాషలపై దృష్టి సారించడం ద్వారా ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు పొందవచ్చని కమల్ సూచించారు. జాతీయ విద్యా విధానంలోని త్రిభాషా సూత్రాన్ని తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ భాషలను పక్కనపెట్టి హిందీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తోందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండించింది. ఇటీవల కమల్ హాసన్ మరో దక్షిణాది భాష అయిన కన్నడ మూలాలపై చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడానికి ఆయన నిరాకరించడంతో ఆయన నటిస్తున్న థగ్ లైఫ్ చిత్రం కర్ణాటకలో విడుదల కాలేదు.

# పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ అపహరణ?



**టెల్‌అవీవ్, జూన్ 9:** మానవతా సాయంతో గాజాకు బయల్దేరిన పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌ను ఇజ్రాయెల్ దళాలు అడ్డుకున్నాయి. ఆమెతోపాటు మరికొందరు హక్కుల కార్యకర్తలు ప్రయాణిస్తున్న నౌకను ఐడిఎఫ్ కమాండోలు చుట్టుముట్టారు. తమను ఇజ్రాయెల్ దళాలు కిడ్నాప్ చేశాయంటూ గ్రెటా థన్‌బర్గ్ ఆరోపించారు. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ విడియో విడుదల చేశారు. ఫ్రీడం ఫ్లోటిల్లా సభ్యులతో కలిసి గాజా వెళ్తుండగా తమను అడ్డుకొని బంధించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమాజం తమకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్రిటిష్ జెండాతో ఉన్న ఈ నౌక పేరు మద్లీన్. పాలస్తీనా అనుకూల ఫ్రీడయ్ ఫ్లోటిల్లా కొయలేషన్ అనే సంస్థ చేపట్టిన మిషన్‌లో భాగంగా దీన్ని నిర్వహిస్తోంది. ఈ నౌకలో గ్రెటా థన్‌బర్గ్, మెంబర్ ఆఫ్ యూరోపియన్ పార్లమెంట్ రీమా హసన్‌తో పాటు మొత్తం 12 మంది ఉన్నారు. వీరంతా గాజా పౌరుల కోసం ఆహారం, బేబీ ఫార్ములా తీసుకొని జూన్ 6న సిసిలీ ప్రాంతం నుంచి బయల్దేరారు. ఈ సాయంత్రానికి గాజా స్ట్రిప్ చేరుకోవాల్సి ఉండగా.. సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ ఆర్మీ అంతర్జాతీయ జలాల్లో వీరిని అడ్డుకుంది. అనంతరం నౌకను ఇజ్రాయెల్ పోర్టుకు మళ్లించాయి.

అయితే, గాజా నలువైపులా ఆంక్షలు ఉండటంతో వీరి నౌకనను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. దీనిపై ఇజ్రాయెల్ విదేశీ మంత్రిత్వ శాఖ స్పందించింది. అది మానవతా సాయం అందించడం కోసం వస్తోన్న నౌక కాదని, కేవలం సెలబ్రిటీల 'సెల్ఫీ' యాత్ర అని ఆరోపించింది. అందులో ఆహార పదార్థాలు కూడా చాలా తక్కువ మొత్తంలోనే ఉన్నాయని పేర్కొంది.

# మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్ జూన్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ రైజింగ్ 2047 సాకారం కావా లంటే మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె సచివాలయంలో కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో కలెక్టర్లు పని చేయా లని, తెలంగాణ రైజింగ్ 2047 సాకారం కావాలంటే మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు, పెట్రెల్ బంకులు ఏర్పాటు చేయించేలా కలెక్టర్లు కృషి చేయాలని, వాటికి అవసరమైన స్థలాలను తక్షణం గుర్తించి పనులు ప్రారం భించాలన్నారు.
అక్టోబర్ 2న సోలర్ ప్లాంట్లు ప్రారంభించే లక్ష్యంతో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇప్పటికే జిల్లాల వారిగా సోలార్ ఇనస్టాలేషన్ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయని, వారితో సమన్వయం చేసుకుని సోలార్ ప్లాంట్ల పనులు ప్రారంభించాలన్నారు. అంతేకాకుండా 22 జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి భవనాల నిర్మాణ పనులను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పేద పిల్లలు వస్తున్న నేపథ్యంలో ప్రాముఖ్యతను గుర్తించి కలెక్టర్లు పనిచేయాలన్నారు.
అంగన్‌డీలు, ప్రభుత్వ బడులు బాగుంటేనే తెలంగాణ బాగుంటుందని, వాటి ప్రభావం తెలంగాణ భవిష్యత్తుపై పడుతున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేకదృష్టి పెట్టాల న్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యునిఫాంలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టిస్తున్నామని, ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి 90శాతం యునిఫాం కుట్టుపనులు పూర్తయినట్లు చెప్పారు. పాఠశాలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యునిఫాంలు పంపిణీచేస్తామన్నారు.
గతంలో పాఠశాలలు ప్రారంభమైన 6 నెలల తర్వాత యునిఫాంలు అందేవని, ఇప్పుడు మహిళా సంఘాలకు యునిఫాంబాధ్యతలు అప్పగించామన్నారు. అంగన్ వాడీలు ఈ నెల 11న తెరుచుకోనున్నాయని, అప్పటి లోపు కలెక్టర్లంతా వాటినిర్వహణ ఏలా ఉందో చెక్ చేయాలన్నారు.
మొదటి సారి అంగన్వాడీలకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో అంగన్వాడీ భవనాలను క్షేత్ర స్థాయి సిబ్బందితో పరిశీలించి, అంగన్వాడీల్లో చిన్నారులు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు ప్లే స్కూల్లకు దీటుగా అంగన్వాడీలను తీర్చిదిద్దండి. అంగన్వాడీల్లో అన్ని తాగు నీరు,కరెంటు, టాయిలెట్ వంటి వసతులు కల్పించండి. ఈ నెల 11 నుంచి చేపట్టే అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రయాన్ని విజయవంతం చేయాలన్నారు. శిథిలా వస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సమీపంలోని ఖాళీ ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలన్నారు. కొత్తగా 100 అంగన్వాడీ భవనాలు నిర్మించబోతున్నామని, వాటికి కావాల్సిన స్థలాలను సేకరించాలన్నారు. మహిళా స్వయం సహాయకబృందాల్లో కొత్త సభ్యులను చేర్చాలని, అత్యంత పేదరికంలో ఉన్నవాళ్లే, మారుమూల ప్రాంతా మహి ళలు, ఎస్టీ మహిళలుఇంకా ఎస్‌హెచ్‌జీల్లో తక్కువగా ఉన్నారన్నారు.
ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతిలో పేదల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే అర్హులైన ప్రతి మహిళా ఎస్‌హెచ్ జీలో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామ పంచాయతీ వారిగా సమీక్షచేసి కొత్త సభ్యులగా చేర్పించండివారిని గ్రూపులుగా చేసివడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో ఆర్థిక సాధికారతకు కృషి చేయాలన్నారు. దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల కోసం 38 ఆసుపత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, సకాలంలో దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. బాల భరోసా పేరుతో కొత్త స్కీంను తీసుకొస్తున్నామని, 5 వయసులోపు చిన్నా రులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఏదైనా సమస్య ఉంటే అవస రమైన సర్జరీలు ఉచితం చేయి స్తామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్‌శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సిఇఒ దివ్యాదేవరాజన్, పిఆర్‌ఆర్‌డి డైరెక్టర్ సృజన, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లీ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ పర్సన్ సాధికార శాఖ డైరెక్టర్ శైలజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చురుగ్గా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### లబ్ధిదారులే నిర్మాణకర్తలు

### ఇప్పటి వరకు రూ.99 కోట్లు చెల్లింపులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని వి పైలెట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసుకొని గృహ ప్రవేశాలకు కూడా సిద్ధమవుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి సోమవారం వరకు ఈ వారానికి సంబంధించి లబ్ధిదారులకు 22.64 కోట్ల రూపాయిలను విడుదల చేసినట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి గడచిన రోజుల్లో ఇప్పటి వరకు 1549 ఇండ్లు బేస్‌మెంట్, 481ఇండ్లు గోడల నిర్మాణం వరకు మరో 117 ఇండ్లు శ్లాబ్ ల వరకు పూర్తయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూడా పేదవానికి ఇచ్చిన మాట ప్రకారం తల తాకట్టుపెట్టయినా సరే ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులను విడుదల చేసేటట్టున్నాము.ఒక్క రోజుకూడా ఇందిరమ్మ లబ్ధిదారుడు నిధుల కోసం ఎదురు చూడకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమచేస్తున్నామన్నారు.రాష్ట్రంలో ఇంతవరకు బేస్మెంట్ పూర్తయినవి 9,877 కాగా,గోడలవరకు పూర్తయినవి 1839,స్లాబు పూర్తయిన 388 ఇండ్లకు మొత్తం రూ .98.64 కోట్లు విడుదల చేశామన్నారు.ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో ప్రభుత్వ పర్యవేక్షణ మాత్రమే ఉంటుందని నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం చేపట్టడం లేదని,లబ్ధిదారులు తమ స్థలానికి అనుగుణంగా తమకు ఇష్టమైన రీతిలో 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకునే సౌలభ్యాన్ని కల్పించామనామ్నరు.రాష్ట్రంలో దాదాపు 250 మండలాల్లో ఇందిరమ్మఇండ్ల నిర్మాణ జరుగుతోందని, లబ్ధిదారులకు ఇంజనీర్లు నిర్మాణ పనుల్లో తగు సహకారాన్ని అందించాలని, వర్షాకాలంలో ఇబ్బంది పడకుండా లబ్ధిదారులను ప్రోత్స హించాలని మంత్రి పొంగులేటి సూచించారు.

# ఒయు పిహెచ్‌డి ఎంట్రన్స్‌లో 62.60 శాతం ఉత్తీర్ణత

### 23 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

### 7,907 మంది హాజరు కాగా.. 4,950 మంది అర్హత

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 62.60 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఓయూ పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష ఫలితాలను ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సోమవారం విడుదల చేశారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్‌డి ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, అడ్మిషన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి, అడ్మిషన్స్ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ జలపతి, డాక్టర్ అక్తర్ అలీ, డాక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఓయూలోని కేటగిరి 2 ద్వారా పిహెచ్‌డిల్లో ప్రవేశాలకుగాను ఏప్రిల్ 25 నుంచి 27 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ ఆధారిత ప్రవేశపరీక్ష(సిబిటి)ను నిర్వహించింది. 49 విభాగాల్లో ప్రవేశాలు పొందేందుకు 9,747 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 7,907 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీ క్షలకు హాజరైన వారిలో 62.60 శాతం ఉత్తీర్ణతతో 4,950 మంది విద్యా ర్థులు అర్హత సాధించారని విసి కుమార్ తెలిపారు. అత్యధికంగా ఆంగ్లం (ఇంగ్లీష్) నుంచి అర్హత సాధించిన వారు ఉండగా.. అతి తక్కువగా పర్షి యన్, కన్నడ, ఇంజినీరింగ్ బయోటెక్నాలజీ విభాగాల్లో ఉన్నారని తెలిపారు. వివిధ విభాగాల వారీగా విద్యార్థుల ర్యాంకు కార్డులు ఆన్‌లైన్ లో అందు బాటులో ఉంటాయన్నారు. ఈ నెల 23 నుంచి పిహెచ్‌డి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

# మనిషి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి

### 20న లాల్‌బహదూర్ స్టేడియంలో యోగా డే

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



యోగా ప్రిపరేటరీ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), జూన్ 9, ప్రభాతవార్త:** మనిషి దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం కవాడిగూడ సీజీవో టవర్స్‌లో యోగాడే ప్రిపరేటరీ మీటింగ్ నిర్వహించారు. వివిధ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలతో కలసి ఏర్పాటుచేసిన ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరై కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 20వ తేదీన లాల్‌బహదూర్ స్టేడియంలో యోగాడేను నిర్వహిస్తున్నామని తెలి పారు. హైదరా బాద్‌లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి ప్రము ఖులు హాజరవుతారని, అదే విధంగా వైజాగ్‌లో నిర్వహించే యోగాడేలో ప్రధాని మోదీ పాల్గొంటారని అన్నారు. నేడు మనం పెస్టిసైడ్‌లతో కూడిన కలుషిత ఆహారం తీసుకుంటున్నామని, గాలి కూడా కలుషితం అవుతోందని, కాబట్టి నేడు వాహనాల మధ్య వాకింగ్ చేయటం కన్నా యోగా చేయటం ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. నేటి సమాజంలో మనిషి శారీరక శ్రమ తగ్గి, శరీరానికి అవసరమైన కష్టాన్ని ఇవ్వటం లేదని, అనారోగ్యం పాలై, లక్షల రూపాయలు హాస్పటల్స్‌కు ఖర్చు చేస్తున్నాం కానీ హాస్పటల్స్ నయం చేయలేని రోగాలను సైతం యోగా ద్వారా తగ్గించు కోవచ్చునని అన్నారు. అధిక బరువు ఉన్న జనాభా లో మన దేశం కూడా ఉంది కాబట్టి దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రధాని మోదీ ప్రయత్నం చేస్తున్నారని, మానవ వనరుల మేధస్సుతో ప్రపంచాన్ని శాసిస్తున్న మనం వయస్సుతో సంబంధం లేకుండా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సైతం యోగాను తప్పనిసరి చేయాలని, ప్రతి ఉపాధ్యాయుడు యోగాకు అంబాసిడర్ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కొమరయ్య, ఏ.వి.ఎస్.రెడ్డి, ట్రస్మా నాయకులు మధుసూదన్, యాదగిరి, శ్రీనివాసరెడ్డి మరియు వివిధ కళాశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్స్‌పాల్స్ పాల్గొన్నారు.

# పెంచిన బస్‌పాస్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

### లేదా డిపోల ముందు ఆందోళనలు: ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ పెంచిన బస్‌పాస్ ఛార్జీలతోపాటు, స్టూడెంట్ బస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆర్‌టిసి యాజమాన్యం విద్యార్థుల బస్‌పాస్ ఛార్జీలను 20 పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గతంలో పెంచిన బస్ ఛార్జీలు, స్టూడెంట్స్ పాస్ ఛార్జీలు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. మళ్లీ 20 శాతం ఛార్జీలు పెంచి అమలు చేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు.. ప్రధానంగా ఉన్నత విద్య కోసం బస్సునే నమ్ముకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లలో విద్యార్థులు కోసం బస్సు లు నడపడం లేదని.. ఒక ప్రక్క బస్సులు సంఖ్య పెంచి, ఉచిత బస్ సౌక ర్యం కల్పించాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో.. ఛార్జీలు, బస్ పాసులు పెంచే ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే బస్‌పాసుల ఛార్జీల పెంపు ఆలోచనలు విరమించుకోవాలి. లేకుంటే అన్ని డిపోల ఎదుట ఎస్ ఎఫ్ఐ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు.


# ఆజామాబాద్ హిందుస్థాన్ స్టీల్ వరల్డ్‌లో భారీ అగ్నిప్రమాదం

### రూ.15 లక్షల మేర ఆస్తినష్టం

### ఘటనాస్థలానికి చేరుకున్న ఫైరింజన్‌లు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 9, ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.15లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా. సమాయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడంతో మరింత భారీగా నష్టం జరగకుండా చూశారు. సోమవారం తెల్లవారుజామున అజామబాద్ పారిశ్రామిక వాడలో హిందుస్తాన్ స్టీల్ వరల్డ్‌లో షార్ట్‌సర్క్యూట్ సంభవించి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులతో పాటు ముషీరాబాద్ అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది సంఘటనాస్థలానికి చేరకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఫాల్ సీలింగ్, ఫ్యాన్లు, లైట్లు, స్టీల్ సామాన్లు కొన్ని పాక్షి కంగా మరికొన్ని పూర్తిగా కాలిపోయాయి. ముషీరాబాద్ ఫైర్ ఆఫీసర్ బి.నర్సింహా నేతృత్వంలో ముషీరాబాద్ ఫైర్ మెన్‌లు సిబ్బంది ముషీరాబాద్ అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్‌లతోపాటు సెక్రటేరియట్ నుంచి, ఫైర్‌ఫైటింగ్ రోబో, గాంధీనగర్ అగ్నిమాపక కేంద్రం నుంచి వచ్చి మంటలను ఆర్పివేసి పెద్దఎత్తున ఆస్తిష్టం సంభవించకుండా చూశారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ టి.వెంకన్న, చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ సంఘట నాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని బాధితుడు పోలీసులకు, అగ్నిమాపక కేంద్రం అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా మరోవైపు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎపి ఎప్‌సెట్ 2025 ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మాలో శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి




### టాప్ 10లోపు 80 ర్యాంకులు 100లోపు 85 ర్యాంకులు శ్రీచైతన్యవే

**హైదరాబాద్ జూన్ 9 ప్రభాతవార్త:** ఎపిలో సోమవారం విడుదల చేసిన ఏప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధిం చి రికార్డు సృష్టించారు. ఏప్‌సెట్ ఫలితాల్లో 2వ ర్యాంక్‌ను ఏ.శణ్ముక నిశాంత్ (హెచ్‌టి నెం: 951497010012 అగ్రి, ఫార్మా)3వ ర్యాంక్‌ను డి.అకిరానందన్ వినయ్ మల్లేష్ కుమార్ (హెచ్‌టి నెం: 951175010709 అగ్రి,ఫార్మా),4వ ర్యాం క్‌ను యండ్రపాటి శణ్ముక్ (హెట్‌టి నెం : 951397010001 అగ్రి,ఫార్మా), 7వ ర్యాంక్ గిరిదా లక్ష్మీచరణ్ (హెచ్‌టి నెం: 951389010586 అగ్రి,ఫార్మా),8వ ర్యాంక్ శాగంటి త్రిశూల్ (హెచ్‌టి నెం: 550798010039 ఇంజనీరింగ్)9వ ర్యాంకర్ జ్ఞానరిత్విక్‌సాయి (హెచ్‌టినెం 550175050014 ఇంజనీరింగ్),10వర్యాంక్ బి.వెంకట మణి ప్రీతమ్ (హెచ్‌టి నెం 550198010924 ఇజనీరింగ్)వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధిం చింది శ్రీచైతన్య విద్యార్థులే. టాప్ 10లోపు 8ర్యాంకులు,100 లోపు 85ర్యాంకులు శ్రీచైతన్య విద్యార్థులే సాధించి అటు ఇంజనీరింగ్ లోనైనా ఇటు అగ్రి/ఫార్మాలో నైనా శ్రీచైతన్యకు పోటీలేదని నిరూపించారు.టాప్ ర్యాంకులు సాధించిన వారిలో అత్యధికమంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు కావడం విశేషం.గత 40 ఏళ్ళుగా ఇంజనీరింగ్ లోనైనా, మెడికల్ లోనైనా అత్యధిక టాప్ ర్యాం కులు/మార్కులు సాధించిన ఘనత ఒక్క శ్రీచైత న్యదే.ఈ అత్యుత్తమ ఫలితాల వెనుక శ్రీచైతన్య సృష్టించిన అనితర సాధ్యమైన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాములు, ఇంటర్నల్ టెస్ట్ పేపర్లు, స్టూడెంట్ టీచర్ 1 టు 1 అడాప్షన్ సిస్టమ్‌తో నిపుణులైన అధ్యాపక బృందం శిక్షణ కీలకంగా నిలిచాయని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఈసందర్భంగా తెలియజేశారు.పోటీ పరీక్ష ఏదైనా, పరీక్షా విధానాలు ఎలా మారినా నెం.1గా నిలిచేది తమ విద్యార్థులేనని,ఈ ఏడాది విడుదలైన జేఈఈ మెయిన్,జేఈఈ అడ్వాన్స్‌డలో సైతం టాప్ ర్యాం కులు సాధించిన ఘనత ఒక్క శ్రీ చైతన్యదేనని, రాబోయే నీట్-2025లో కూడా అగ్రస్థానం మా విద్యార్థులదేనని ధీమా వ్యక్తం చేశారు. తమ విద్యార్థుల విజయపరంపర ఎప్పటికీ ఇలానే కొన సాగిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, మాపై నమ్మ కం ఉంచిన తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి ఈ సందర్భంగా సుష్మ అభినందనలు తెలిపారు.



దివంగత మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ

# మాగంటి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 9, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాలమృతి బాధాకరమని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాదాపూర్‌లోని జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ నివాసానికి మాజీ హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గోపీనాథ్ సతిమణి సునీతను, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాడ సంతాపం,సానుభూతిని తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని మాగంటి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లా డుతూ. 1992 నుంచి మాగంటి గోపీనాథ్, తాను ఒక సోదరుడిగా, మంచి మిత్రులుగా కలిసి రాజకీయాలలో ఉన్నామని ఆయన గుర్తుచేసు కున్నారు. గత నెల 26 వ తేదిన కుటుంబ సభ్యులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లామని, వెళ్లేముందు కూడా గోపీనాథ్‌ను కలుసుకున్నామన్నారు. ఇంతలోనే ఇలా జరగటం బాధాకరమన్నారు. గోపీ నాథ్ మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు.
భౌతికంగా గోపీనాథ్ దూరమైనప్పటికీ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా జూబ్లిహిల్స్ నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. జూబ్లిహిల్స్ నియోజక వర్గం పరిధిలోని పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని ఆయన కోరారు. తలసాని వెంట మలక్‌పేట్ నియోజక వర్గ బీఆర్ఎస్ ఇంచార్జి ఆజాం,అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు హన్మంతరావు, నాయకులు నామన సంతోష్‌కుమార్, ఆశోక్‌యాదవ్, శ్రీహరి, ఆరీఫ్, హరిసింగ్, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



సహకార సంఘాల ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

# వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హామీ

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 9, ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) ఉద్యోగుల సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారు.సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పడిన పిఎసిఎస్‌లో ఉద్యోగులు రైతులతో చాలా దగ్గరిగా సంబంధాలు కలిగిఉంటారని, రైతు సంఘాలను క్రెడిట్, ఇన్‌పుట్‌లు, మార్కెట్, విలువల జోడింపులకు దగ్గరగా తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం నారాయణగూడలోని ఐఎన్‌టియుసి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రైతులకు, గ్రామీణ వ్యవసాయ వర్గాలకు క్రెడిట్, ఆర్థిక సేవలతోపాటు బహుళ సేవలను అందిస్తూ పేదరికం తగ్గింపు, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడుతున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కాక గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో తీవ్రంగా నష్టపోయారిని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కారించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకులు వై.నాగన్నగౌడ్, ఆర్.డి.చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌యాదవ్, అనంతుల నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సర్వతోముఖాభివృద్ధికి కవులు, రచయితలు కృషి చేయాలి

### సదస్సులో మంత్రి జూపల్లి

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చడానికి ప్రభుత్వ, సంక్షేమ పథకాలు మాత్రమే సరిపోవని,సామాజిక రుగ్మతలను రూపుమాపినప్పుడే.. నవ సమాజం నిర్మితమవుతుందని, సమాజ సర్వతో ముఖాభి వృద్ధికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు, మేధావులు కృషి చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. బేగంపేట టూరిజం ప్లాజాలో ప్రభుత్వ పథకాలు సమాజాభివృద్ధి, సాంస్కృతిక అంశాలపై నిర్వహించిన సదస్సుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ. సంస్కృతి అంటే కేవలం ఆటపాటలు, నాట్యం, సంగీతం, సాహిత్యం, కవిత్వం, భాషకే పరిమితం కాదని, సంస్కృతి అంటే మన అస్తిత్వం. ప్రజల జీవన విధానయని అన్నారు. అయితే ప్రజల జీవన విధానం ద్వంసమైందని, ప్రజల ఆలోచన ధోరణి మారిందని, ప్రజల జీవన విధానం గతి తప్పడం వల్లే అనేక పెడ ధోరణులు చోటు చేసుకుం టున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తున్నప్పటికీ గుడ్డెద్దు చేలో పడ్డట్లు.. కొంత మంది విద్యా, విద్యా, వైద్యం, వేడుకలు అడంబ రాలకు పోయి స్థాయికి మించి ఖర్చులు చేస్తూ... అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజంలో ఒక సామాజిక చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత కవులు, రచయితలు, సాహితీవేత్తలు, మేధావులు, కళాకారులపై ఉంద న్నారు. రచయితలు తమ రచనలు రాయాలని, కళాకారులు ఆట పాటలు, విధి నాటకాలు, నాట్యం వంటి ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించడానికి కృషి చేయాలని, వీటికి రూ. 10 కోట్లు కేటాయిస్తామన్నారు.

# జెఇఇ అడ్వాన్స్‌డ్-2025 విజేతలతో వైభవంగా నారాయణ విజయోత్సవాలు!

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నారాయణ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్- 2025లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో విజయోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్- 2025లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 3, 4, 6, 7, 10 వంటి టాప్ 10లో 5 ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించిన నేపథ్యంలో నారాయణ పెద్ద ఎత్తున విజయోత్సవ వేడుకలు నిర్వహించింది. విద్యార్థులు దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటి క్యాంపస్‌లలో అడ్మిషన్లు సాధించినందుకు విద్యార్థులను నారాయణ యాజమాన్యం సన్మానించింది. నారాయణ క్యాంపస్‌లలో అందించిన అద్భుతమైన శిక్షణ, ప్రోగ్రామ్స్, గైడెన్స్ కారణంగానే విద్యార్థులందరూ విజయం సాధించినట్లు తెలిపారు. తమ విజయంలో నారాయణ పాత్ర మరపురానిదని కొనియాడారు. నారాయణ అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిబీఐ మాజీ జేడి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప జేడి లక్ష్మీనారాయణతో చిట్‌చాట్ నిర్వహించారు. జేడి మాట్లాడుతూ విద్యార్థులు కలలు గనటమే కాదు, దానిని చేరుకునేందుకు ప్రణాళిక కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఆశయాలను నేరవేర్చుకునేందుకు సరైన మార్గదర్శిని ఎంచుకోవటం కూడా ముఖ్యమేనని.. అదే సమయంలో అదృష్టవశాత్తు మీకు నారాయణ మార్గనిర్దేశనం చేయటంతో మీ పని సులభం అయ్యిందని పేర్కొన్నారు. ఇక ముందు కూడా ఇలానే విజయాలు సాధిస్తూ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ పిల్లలిద్దరూ నారాయణలోనే చదివి, ఉన్నతస్థానానికి చేరుకున్నారన్నారు. ఈ సంవత్సరమే 4311 మంది ఐఐటిల్లో చోటు సంపాదించటం అంత సులువైన విషయం కాదన్నారు. నారాయణ సంస్థల కృషి అనిర్వచనీయని కొనియాడారు. ఒక్క నారాయణ




వందలాది మంది విద్యార్థుల ఐఐటి కలలను సాకారం చేయటం ఒక రికార్డుగా నిలిచిపోతుందన్నారు. ఐఐటీ శిక్షణలో నారాయణ తిరుగులేని లాండ్ మార్క్‌గా నిలిచిపోతుందన్నారు. గౌరవ అతిథులుగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ, శరణి నారాయణ, పునీత్ కొత్తప, గంటా రవితేజ, రమా నారాయణ, గ్రూప్ అకడమిక్ హెడ్ పి ప్రమీల పాల్గొన్ని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

## విషాదంగా ముగిసిన నవదంపతుల విహార యాత్ర!



**లక్నో, జూన్ 9:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన నూతన దంపతుల హనీమూన్ యాత్ర తీవ్ర విషాదంగా ముగిసింది. హనీమూన్ కోసం సిక్కిం వెళ్లిన ఆ జంట అక్కడ జరిగిన ఘోర ప్రమాదంలో గల్లంతైంది. ఈ దుర్ఘటన వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. పోలీసుల కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన కౌశలేంద్ర ప్రతాప్‌సింగ్‌కు, అంకితా సింగ్ అనే యువతితో మే 5వ తేదీన వివాహం జరిగింది. అనంతరం, వీరు తమ హనీమూన్ కోసం మే 24న సిక్కింకు బయలుదేరారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న వారి ప్రయాణంలో మే 29న ఊహించని ప్రమాదం జరిగింది. వారు పర్యటనలో భాగంగా ప్రయాణిస్తున్న కారుపై అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనం అదుపుతప్పి దాదాపు 1,000 అడుగుల కిందనున్న తీస్తా నదిలో పడిపోయింది. ప్రమాద సమయంలో కారులో నవ దంపతులతో పాటు మరో తొమ్మిది మంది ఉన్నట్లు తెలిసింది. ఈ ఘోర ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. వారి ప్రయత్నంతో ఇద్దరు వ్యక్తులను సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. అయితే, కారు డ్రైవర్ మృతి చెందాడు. నవ దంపతులు కౌశలేంద్ర, అంకితతో పాటు మరో ఆరుగురు పర్యాటకుల ఆచూకీ ఇంకా తెలియరాలేదు. గల్లంతైన ఈ ఎనిమిది మంది కోసం ఎన్డీఆర్ఎఫ్ దళం అగ్నిమాపక శాఖ, అటవీ శాఖకు చెందిన బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఎదురవుతోందని అధికారులు వెల్లడించారు. గల్లంతైన ఇతర పర్యాటకుల్లో నలుగురు ఒడిశా రాష్ట్రానికి చెందినవారు కాగా, ఇద్దరు త్రిపుర వాసులుగా గుర్తించారు. ప్రమాదం జరిగి 12 రోజులు గడిచినా తన కుమారుడు, కోడలి ఆచూకీ లభించకపోవడంతో కౌశలేంద్ర తండ్రి షేర్ బహదూర్ సింగ్ కన్నీరుమున్నీరవుతున్నారు. గాలింపు చర్యలను వేగవంతం చేయాలని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను, సిక్కిం ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.



## అర్చక, ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ 8 లక్షలకు పెంపు

### పోస్టర్ రిలీజ్ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాయాలయాల్లో పని చేస్తున్న అర్చకుల చిరకాల కోరికను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగసంక్షేమ నిధి పోస్టరును రిలీజ్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అర్చక, ఉద్యోగుల కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమీషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పనిచేసే సుమారు 13,700 మంది అర్చకులు,ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అర్చకులు,ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి ఇవ్వనున్నట్లు చెప్పారు. ధూపదీప నైవేద్య అర్చకులకు మరణానంతరం చెల్లించే గ్రాట్యూటి నిర్ధారించినట్టు చెప్పారు. గతంలో చెల్లించిన గ్రాట్యుటీ రూ 4 లక్షల నుండి రూ 8 లక్షలకు ఎంచినట్టు చెప్పారు. ఈ నిర్ణయంతో అర్చకులు, దేవాదాయశాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున ప్రయోజనం లభిస్తుందన్నారు.

## గోదావరి జలాల దోపిడీ కుట్రలను సమష్టిగా అడ్డుకుందాం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**హైదరాబాద్,జూన్ 9,ప్రభాతవార్త:** తెలంగాణకు అన్యాయం చేసే విధంగా గోదావరి జలాలను దోపిడీ చేసే కుట్రలను అడ్డుకుందామని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు తీర్మానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గోదావరి జల దోపిడీ కుట్రలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ నేత జలవనరుల నిపుణులు వి ప్రకాష్, మాజీ ఎంపీ హనుమంతరావు, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి, న్యాయవాది శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు, నదుల అనుసంధానం పేరుతో తెలంగాణకు శాశ్వతంగా అన్యాయం జరగబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రాజెక్టులు పూర్తికాకుండా బనకచర్ల పూర్తి అయితే గోదావరి జలాలపై ఆంధ్రకు పూర్తి అధికారం లభిస్తుందని అన్నారు.

## బిజెపి తెలంగాణ - బిజెపి భరోసాకు అనూహ్య స్పందన

### ఫిర్యాదులపై మంత్రి పొన్నం, అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** భారతీయ జనతాపార్టీ చేపట్టిన బిజెపి తెలంగాణ-బిజెపి భరోసాకు అనూహ్య స్పందన వచ్చింది. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల బిజెపి తెలంగాణ, బిజెపి భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ గోడును ఎంపి ముందు వెళ్లబోసుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వీరు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, నలుగురు జిల్లాకలెక్టర్లకు, వాటర్ వర్క్ ఎండి, జిహెచ్ఎంసి అధికారులకు తదితరులకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో కష్టాలను ఎదుర్కొంటున్న ప్రజలకు భరోసానిచ్చేందుకు తెలంగాణ బిజెపి భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా రోజూ ఒక ప్రజాప్రతినిధి ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను తెలుసుకున్న పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు.

## హైదరాబాద్‌లో పోలీస్ గన్ మిస్‌ఫైర్

### తృటిలో తప్పిన ప్రాణపాయం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని పోలీస్ ఆఫీసర్స్ మెస్‌లో సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్ బెటాలియన్ కానిస్టేబుల్ వేణు తుపాకీ సోమవారం మిస్‌ఫైర్ అయ్యింది. అక్కడే ఉన్న పోలీసులు ఉలికిపడి అప్రమత్తమయ్యారు. గన్‌ను సరిచేసుకుంటుండగా పొరబాటున గన్‌బటన్‌కు చేతి తగలడంతో భారీ శబ్ధంతో గాల్లోకి ఒక బుల్లెట్ దూసుకపోయింది. సదరు కానిస్టేబుల్ గన్‌ను ఆకాశంవైపు పెట్టడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసులకు సమాచారం తెలియడంతో ఘటన స్థలానికి వచ్చి ఆరా తీసారు. మాసాబ్‌ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# కాళేశ్వరమే తెలంగాణకు జీవధార

### ఘోష్ కమిషన్‌కు అన్ని సాక్ష్యాధారాలతో సమర్పించా: మీడియాతో హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 9:** కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించడం జరిగిందని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బీఆర్కే భవన్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని, ఆధారాలతో సమాధానాలను కమిషన్‌కు అందించామని తెలిపారు. కమిషన్ విచారణకు హాజరై రాజకీయాలు మాట్లాడటం సరికాదు. లోపట ఒకటి చెప్పి బయట ఒకటి చెప్పడం తప్పు అవుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మొట్ట మొదలు తమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు బ్యారేజ్‌ను ఎందుకు మార్చారు అనేదానిపై చాలాసేపు డిస్కషన్ జరిగిందని, కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తమ్మిడిహట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశామని, మహారాష్ట్ర కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నెలకే వెళ్లి కలిశామని, తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వండని అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రిని కోరామని, దానికి ఆ మంత్రి చాలా రోజులుగా ముంపు గ్రామాల ప్రజలు మా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మేము ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని కూడా కమిషన్ దృష్టికి తీసుకు వెళ్ళామని హరీశ్‌రావు తెలిపారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్స్ జరిగాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి మళ్లీ తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని, తెలంగాణకు నీటి అవసరం ఉందని కోరడం జరిగింది. స్వయంగా కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి అప్పటి గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిశారు. తెలంగాణ ప్రాంతం నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పట్టించుకోలేదు. సెంట్రల్ వాటర్ కమిషన్ తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదు అని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖ రాసింది. అదేవిధంగా తమ్మిడిహట్టి ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్ల సామర్థం కూడా సరిపోదని సామర్థ్యానికి సరిపోయే రిజర్వాయర్లను పెంచుకోవాలని ఉత్తరం రాసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌ని బ్యారేజ్ నిర్మాణ స్థల ఎంపిక చేయాలని కేసీఆర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడేండ్లుగా పొరుగు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించలేదు.



అదేవిధంగా మహారాష్ట్రలో ముంపుకు గురవుతున్న చోట చాప్రాల్ వైల్డ్ లైఫ్ ఉంది. వైల్డ్ లైఫ్ అనుమతులు లభించాలంటే కనీసం 10 సంవత్సరాలు సుప్రీంకోర్టులో కొట్లాడాల్సి వస్తుందన్నారు. అన్ని రకాల ఆధారాలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాసిన ఉత్తరాలు, జీవోలు అన్నీ కమిషన్‌కు సమర్పించామని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్‌కు స్పష్టంగా అనుమతి ఉన్న విషయాన్ని అన్ని ఆధారాలతో సమర్పించాం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోకేషన్ మార్పుల గురించి అడిగారు. అది పూర్తిగా టెక్నికల్ నిర్ణయం. ఇంజనీర్ల డీటెయిల్ సర్వే ఆధారంగా బ్యారేజ్ లొకేషన్ మారింది. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు తీసుకునే నిర్ణయమని చెప్పాను.

# మహిళా సాధికారత చేతల్లో చేసి చూపిస్తాం

### కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చుతాం

### 'సీత' యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళా సాధికారతను మాటల్లో కాదు, చేతల్లో చేసి చూపిస్తామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని, ఇప్పటికే ఆ దిశగా ప్రయాణం మొదలు పెట్టామని వివరించారు. సోమవారం హైటెక్ సిటీలోని ఒక హోటల్‌లో షీ జాబ్స్ ఆధ్వర్యంలో రూపొందించిన సీత(సీత షీ ఈజ్ ది హీరో ఆల్వేస్) యాప్‌ను ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. కుటుంబాల్లో తమ హక్కులను మహిళలు స్వేచ్ఛగా వినియోగించుకుని నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతంది. ఆ దిశగా ఇంటి నుంచే మొదటి అడుగు పడాలని అన్నారు. కేంద్ర గణాంకాల శాఖ భారత్‌లో పురుషులు, మహిళలు - 2024 పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణలో కుటుంబ నిర్ణయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 86 శాతం, పట్టణాల్లో 89 శాతం మంది మహిళలు భాగస్వామ్యమవుతున్నారు. ఇవి అంకెలు కావు మహిళా సాధికారతను సాకారం చేసేందుకు అడుగులు వేస్తున్న తెలంగాణ విజయగాథ ఇది అని పేర్కొన్నారు. కోటి మంది తెలంగాణ ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతోనే ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025కు శ్రీకారం చుట్టామని అన్నారు. సీత యాప్ నైపుణ్య మహిళల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి శ్రీలీలా, ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఝాన్సీ రెడ్డి, షీ జాబ్స్ నిర్వాహకురాలు సీత తదితరులు పాల్గొన్నారు.

# 230 పని దినాలతో పాఠశాల విద్య అకడమిక్ క్యాలెండర్

### ప్రతిరోజూ 5 నిమిషాలు యోగ, మెడిటేషన్

### అక్టోబర్ 24 నుంచి ఎస్ఎ-1 పరీక్షలు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజూ 5 నిమిషాల పాటు విద్యార్థులతో యోగ, మెడిటేషన్‌ను చేయించనున్నారు. అక్టోబర్‌లో ఎస్ఏ-1 పరీక్షలను నిర్వహించనుండగా.. జనవరి 10లోపుగానే 10వ తరగతి సిలబస్‌ను పూర్తి చేయాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. మార్చిలో ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు. 230 పనిదినాలతో 2025-26 విద్యా సంవత్సరాన్ని కొనసాగించాలని అందుకు సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను పాఠశాల విద్య శాఖ ప్రకటించింది. ఈ నెల 12న 2025-26 విద్యా సంవత్సరాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే బడిబాట కొనసాగుతుండగా.. ఈ నెల 19తో బడిబాట కార్యక్రమాన్ని ముగించనున్నారు. ఫార్మేటీవ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1ను జులై 31న, ఎఫ్ఏ-2ను సెప్టెంబర్ 30న నిర్వహించనున్నారు.

సమ్మేటీవ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-1 పరీక్షలను అక్టోబర్ 24 నుంచి 31 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఎఫ్ఏ-3ని డిసెంబర్ 23న , ఎఫ్ఏ-4ను 10వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 7, 2026లో నిర్వహించనుండగా.. 1 నుంచి 9వ తరగతి వరకు ఫిబ్రవరి 28న నిర్వహించనున్నారు.

1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలను ఏప్రిల్ 10 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు జనవరి 10లోపు సిలబస్‌ను పూర్తి చేసి.. ప్రీ ఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 28లోపు నిర్వహించాలని నిర్ణయించారు. ఇక ఎస్ఎస్‌సి విద్యార్థులకు మార్చిలో వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు.

# రాష్ట్రంలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

### ఆయిల్‌పామ్ రూ.25 వేలు నిర్ణయించాలి

### కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌కు వినతిపత్రం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ భారత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ ప్రాంగణంలో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆన్ మిల్లెట్స్‌కు సోమవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయమంత్రి భగీరథ్‌చౌదరి శంకుస్థాపన చేశారు. ఇందులో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి పలు ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. గతంలో హైదరాబాద్ కార్యాలయంగా కొబ్బరి బోర్డు కార్యాలయం ఉండేదని, కాని విభజన అనంతరం అది విజయవాడకు తరలించబడిందని తెలిపారు. దీంతో రాష్ట్ర రైతులు సకాలంలో సేవలు అందుకోలేకపోతున్నారని అందువల్ల కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగుకు నాణ్యమైన విత్తనాల ఎంపెనెల్‌మెంట్ కోసం కేంద్రం తక్షణ చర్యలు తీసుకో వాలన్నా రు. అంతే కాకుండా ఆయిల్ పామ్ గెలల టన్ను కనిష్ఠ మద్దతు ధర రూ.25 వేలుగా నిర్ణ యించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, నీటి మోటార్లు, కార్మికుల వేతనాలు, యంత్రాల వినియోగం, నిర్వహణ తదితర వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో ధరలను స్థిరీకరించాలని చెప్పారు. ఇర ఆయిల్ పామ్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షి ంచాలని సూచించారు. ఇక హార్టికల్చర్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు, పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం హామీ



ఇచ్చిందని మంత్రి గుర్తుచేశారు. దీనికోసం రూ.1,823.20 కోట్లతో ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పించామని, అయితే ఇప్పటివరకు కేవలం రూ.135 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, మిగిలిన సొమ్మును మంజూరు చేయాలని వినతిపత్రంలో కేంద్ర మంత్రిని కోరారు.

# బిజెపి కార్యాలయంలో మోడీ పాలనపై ఫోటో ఎగ్జిబిషన్

### ప్రారంభించనున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తదితర విషయాలపై ఫోటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ అమృత్ కాల్ (సేవ సుశాసన్ గరీబ్ కళ్యాణ్) పేరుతో ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నేతృత్వంలో 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. జూన్ 11, 12 తేదీలలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, రాష్ట్ర బిజెపి పదాధికారులు వివిధ జిల్లాల్లో పర్యటించి వికసిత్ భారత్ అమృత్ కాల్ (సేవ సుశాసన్ గరీబ్ కళ్యాణ్) పేరుతో ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమంలను ప్రారంభిస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ వారితో సూచనలను సలహాలను తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాల్లో, అభివృద్ధి సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా వారిని ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్లాలన్న దృఢ సంకల్పంతో కార్యక్రమాలను నిర్వహిస్తారు.

# వర్షాకాలంలో విద్యుత్ ఇబ్బందులు రానీయొద్దు

### అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలి

### టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ



**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** వచ్చే వర్షాకాలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మింట్ కాంపౌండ్ లోని ప్రధాన కార్యలయం నుండి డిస్కం పరిధిలోని చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండీ మాట్లాడుతూ, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు తమ పరిధిలోని ఫీడర్లలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి వారానికొకసారి సంబంధిత అధికారులతో సమీక్ష చేయాలన్నారు. అత్యధికంగా అంతరాయాలు నమోదైన ఫీడర్ల పై ప్రత్యేక దృష్టి సారించి, లైన్ల, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల, ఎబి స్విచ్‌లను తనిఖీలు చేపట్టి, సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఫీడర్ల అంతరాయా లకు గల కారణాలను విశ్లేషించగా, ఎక్కువ శాతం చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడట వల్లనే ట్రిప్ అవుతున్నాయని గుర్తించామన్నారు. కావున, క్షేత్ర స్థాయి సిబ్బంది గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చెట్లు అధికంగా వుండే ప్రాంతాల్లో విధిగా పెట్రోలింగ్ చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, వర్షాలు కురిసేటప్పుడు, వాతావరణ శాఖ హెచ్చరికల సమయంలో సిబ్బంది తమ తమ కార్యాలయాల్లో 24 గంటలపాటు అందు బాటులో వుండే విధంగా చర్యలు తీసుకోకుని వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణంగా స్పందించి సమస్య పరి ష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీఎండీతో పాటు, సంస్థ ఇంచార్జి డైరెక్టర్ లు డా. నర్సింహులు,క సాయి బాబా, చీఫ్ ఇంజినీర్లు చక్రపాణి,పాండ్య, కామేష్, బాల స్వామి సూపరిండెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## తొక్కిసలాటపై హైకోర్టుకు ఆర్సీబి!




**బెంగళూరు, జూన్ 9:** చిన్నస్వామి స్టేడియం వెలుపల జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై ఐపీఎల్ టీమ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓనర్ రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్, ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లుసోమవారం కర్ణాటక హైకోర్టును ఆశ్రయించాయి. తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరాయి. తొక్కిసలాటకు దారితీసిన క్రౌడ్ మేనేజ్మెంట్‌లో తమ పాత్ర ఏమీ లేదని ఆర్సీఎస్ఎల్ తమ పిటిషన్‌లో పేర్కొంది. విక్టరీ సెలబ్రేషన్స్‌కు పరిమితంగానే పాస్‌లు ఉన్నాయని, ఉచిత రిజిస్ట్రేషన్ పాసుల కోసం ముందుగానే రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని సోషల్ మీడియా ద్వారా తాము చాలా స్పష్టమైన ప్రకటనలు చేసినట్టు తెలిపింది. స్టేడియం గేట్లు తెరవడంలో ఆలస్యం జరిగిందనీ ఆరోపించింది. షెడ్యూల్ ప్రకారం 1:45 గంటలకు గేట్లు తెరవాల్సి ఉండగా 3.00 గంటలకు తెరిచారని, దీంతో ఒక్కసారిగా జనం అక్కడకు చేరుకున్నారని తెలిపింది. డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ మరో పిటిషన్‌లో పోలీసులు, రాష్ట్ర అధికారుల వైఫల్యమే తొక్కిసలాటకు కారణమని ఆరోపించింది. నేరుగా తమ తప్పిదం ఉన్నట్టు ఎలాంటి సాక్ష్యాలూ లేనందున తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని ఆర్సీఎస్ఎల్, డీఎన్ఏలు తమ పిటిషన్లలో హైకోర్టును కోరాయి.

## మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో విద్యార్థులకు అనుమతి

### స్టూడెంట్ బస్‌పాస్, టోల్ ప్లాజా యూజర్ ఛార్జీలపై ఆర్‌టిసి సవరణ

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** స్టూడెంట్ బస్‌పాస్‌ల పెంపుతో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆర్‌టిసి దిద్దుబాటు చర్యలకు దిగి సవరణ ప్రకటనను జారీ చేసింది. హైదరాబాద్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా విద్యార్థులకు అనుమతిస్తున్నట్టు ప్రకటించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ప్రతి ఏటా టోల్ పన్నును సవరిస్తుందని.. టోల్ పన్నును సవరించినప్పుడల్లా.. ప్రయాణికుల యూజర్ ఛార్జీలను పెంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో 24 ప్రకారం టిజిఎస్‌ఆర్‌టిసికి అనుమతి ఇచ్చిందని.. ఈ మేరకు టోల్‌ప్లాజా యూజర్ ఛార్జీని సంస్థ జూన్ 9 నుంచి సవరించిందని పేర్కొంది. టోల్ ప్లాజా మీదుగా ప్రయాణించకపోతే ఎలాంటి యూజర్ చార్జీ ఉండదని తెలిపింది. ప్రజా రవాణా వ్యవస్థపై ఆదరాభిమానాలు చూపిస్తోన్న వారందరికీ పేరుపేరునా యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేస్తోందని పేర్కొంది.

## వైద్య మంత్రి దామోదర రాజనర్సింహాతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భేటీ

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కొత్త మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ అడ్లూరిని అభినందించి, ఆశీర్వదించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్ అని పేర్కొన్న దామోదర ఎస్సీ వర్గీకరణ, కుల గుణన, బిసిల రిజర్వేషన్ల పెంపు, మంత్రి వర్గంలో నలుగురు ఎస్సీలకు స్థానం కల్పించడం, స్పీకర్‌గా అవకాశం ఇవ్వడం వంటి అంశాలను ఇద్దరు మంత్రులు గుర్తుచేసుకున్నారు.

## నేటి నుంచి గాంధీభవన్‌లో అందుబాటులో ప్రజా ప్రతినిధులు కార్యక్రమం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి టిపిసిసి మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు అందుబాటులో ప్రజా ప్రతినిధుల ఉండేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతి రోజు ప్రజా ఇద్దరు ప్రజా ప్రతినిధుల అందుబాటులో ఉండేలా కార్యక్రమాలు మొదలు పెట్టారు. మొదటగా రోజుకు ఇద్దరు కార్పొరేషన్ చైర్మన్‌లు గాంధీ భవన్‌లో జూన్ 10వ తేది నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉండనున్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ప్రజా వినియోగ కార్యక్రమానికి హాజరుకానున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అందుబాటులో ఉండనున్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని అరెస్టు, ఎపికి తరలింపు



**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును ఎపి పోలీసులు సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలో ఆయన ఇంటి వద్ద అరెస్టు చేశారు. ఎపి రాజధాని అమరావతిపై సాక్షి టివిలో ఇటీవల జరిగిన చర్చావేదిక సందర్భంగా మరో జర్నలిస్టు కృష్ణం రాజు చేసిన అ నుచిత వ్యాఖ్యలు ఎపిలో దుమారం రేపడం తెలిసిందే. దీనిపై ఎపి మాదిగ కార్పొరేషన్ డైరక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు జర్నలిస్టు కృష్ణంరాజుతో పాటు కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి యాజమాన్యంపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో 79, 196 (1), 353 (2), 299, 356 (2), 61 (1), బి ఎన్ ఎస్ 3(1), ఎస్సీ, ఎస్టీ పీఓఓ చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ ఉదంతంలో అమరావతి రాజధాని గురించి మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు విజయవాడలోగల తనఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో అజ్ఞాతంలో వెళ్లగా పోలీ సులు గాలిస్తున్నారు. ఈ చర్చా వేదికకు యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాస రావును ఎపి పోలీసులు సోమవారం ఉదయం ఆయన ఇంటి వద్ద అరెస్టు చేశారు. కాగా తన అరెస్టు సందర్భంగా కొమ్మినేని పోలీసులను కొన్ని ప్రశ్నలు అడిగారు. అయితే వీటికి వారు ఎలాంటి సమాధానాలు ఇవ్వకుండా మీపై తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోద య్యింది. ఈకేసులో మీరునిందితులుగా వున్నం దున అరెస్టు చేస్తున్నాం.. దయచేసి సహకరిం చండి...అని చెప్పి తమవెంట ఎపికి తీసుకు వెళ్లారు. ఆయన్ను నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం రాత్రిఇక్కడే ఉంచారు. మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టులో హాజరుపరచనున్నారు.

# 'వార్ 2' కాస్ట్యూమ్ డిజైనర్ అనైతా ష్రాఫ్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో వార్ 2 చిత్రం రానున్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా రిలీజ్ చేసిన టీజర్‌తో ఒక్కసారిగా అంచనాలు అమాంతం పెరిగాయి. ఇక ఈ టీజర్‌లో ఎన్టీఆర్ లుక్స్, స్టైలింగ్ గురించి అందరూ మాట్లాడుకున్నారు. ఇక తన కాస్ట్యూమ్స్‌కి, తన పనితనానికి వచ్చిన ప్రశంసలు, అభిమానుల నుంచి వచ్చిన ప్రేమను చూసి వార్ 2 కాస్ట్యూమ్ డిజైనర్ అనైతా ష్రాఫ్ అడజానియా ఆశ్చర్యపోయారు. దేశంలోనే అత్యుత్తమ స్టైలిస్ట్‌గా గౌరవించబడే అనైతా ఈ మేరకు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వార్ 2లో మొదటిసారి ఎన్టీఆర్‌తో కలిసి పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనతో పని చేయడం పూర్తిగా సంతోషాన్ని ఇచ్చింది. ఆయన సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తే ఆ ఎనర్జీ అంతా అందరిలోకి వచ్చేస్తుంటుంది. ఆయనలో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉందనిపిస్తుంది. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఎంతో ఉల్లాసంగా ఉంచుతారు. ఆపై అతను పోషిస్తున్న పాత్రలో ఎన్నో రకాల లేయర్స్ ఉంటాయి. అందుకే ఎన్టీఆర్ కోసం చాలా లుక్స్ డిజైన్ చేశాం. ఆయన పాత్రలోని స్వభావాన్ని ప్రతిబిం బించేలా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాం. ఓ లక్ష్యంతో, ఉద్దేశ్యంతో పనిచేసే మానవ యంత్రంలా చూపించే ప్రయత్నం చేశామని అన్నారు. ఆదిత్య చోప్రా నిర్మాణంలో అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన చిత్రం వార్2. కియారా అద్వానీ ఈ చిత్రం లో ప్రధాన పాత్రను పోషించారు. ఆగస్టు 14న హిందీ, తమిళం, తెలుగు భాషలలో వార్ 2 భారీ ఎత్తున విడుదల కానుంది.



# '8 వసంతాలు' సెకండ్ టీజర్ రిలీజ్

ఫస్ట్ టీజర్‌తో ఒక సంచలనం సృష్టించిన తర్వాత 8 వసంతాలు చిత్ర నిర్మాతలు ఇప్పుడు సెకండ్ టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్ మంచి ఎమోషనల్ ఎక్స్ పీరియన్స్ అందించింది. ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించారు. అనంతిక సనీల్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించారు. టీజర్ విజువల్‌గా కవితాత్మక సన్నివేశంతో ప్రారంభమవుతుంది. వర్షంలో తడిసిన అనంతిక, ఊటీకి వచ్చిన కొత్త తెలుగు రచయిత సంజయ్‌ను గమనిస్తుంది. అతను పదాలని ప్రేమతో రాస్తే తడిసిన గులాబీ పువ్వుల్లా వుంటాయి. అదే కసితో రాస్తే పిన్ తీసిన గ్రెనేడ్ లా ఉంటాయి అనే వాయిస్ సంజయ్ పాత్రని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. అమ్మాయిలకి కత్తి పట్టుకుని రౌద్ర రసం చూపేవాడు కంటే కన్నీళ్లు తుడుస్తూ కరుణ రసం చూపించేవాడు అంటేనే ఇష్టం అనే డైలాగ్ యూనివర్సల్ గా కనెక్ట్ అవుతోంది. ప్రేమ చేరుకోవడానికి ఒక గమ్యం కాదు, మనం చేయాల్సిన ప్రయాణం అనే హార్ట్ టచ్చింగ్ లైన్‌తో టీజర్ ముగుస్తుంది. ఇది సినిమా ఎమోషనల్ డెప్త్‌ని తెలియజేస్తోంది. విజువల్‌గా, ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్ లా వుంది. విశ్వనాథ్ రెడ్డి అద్భుతమైన సినిమాటోగ్రఫీ, హేషమ్ అబ్దుల్ వహాబ్ మనసుని కదిలించే స్కోర్‌తో ఫణీంద్ర నర్సెట్టి అద్భుతమైన సంభాషణలు ప్రాణం పోసుకున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు ఫస్ట్ క్లాస్. అరవింద్ మూలే ప్రొడక్షన్ డిజైన్ సినిమా లీనమయ్యే అనుభూతిని పంచాయి. శశాంక్ మాలి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. అనంతిక సనిల్ కుమార్ అద్భుతంగా కనిపించారు. తన పెర్ఫార్మెన్స్ హార్ట్ టచ్చింగ్‌గా వుంది. అద్భుతమైన కథనంతో, 8 వసంతాలు ఈ మాన్సూన్‌లో పర్ఫెక్ట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఈ చిత్రం జూన్ 20న థియేటర్లలో విడుదల కానుంది. తారాగణం: అనంతిక సనిల్‌కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా, స్వరాజ్ రెబ్బాప్రగడ, సమీరా కిషోర్ సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి.



# 'బ్రోకోడ్' చిత్రంలో హీరో, నిర్మాతగా రవి మోహన్

కోలీవుడ్‌లో రవి మోహన్‌కు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ఇన్నేళ్లు హీరోగా అందరినీ మెప్పించిన రవి మోహన్ ఇకపై నిర్మాతగానూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఆయన హీరోగా, నిర్మాతగా రానున్న బ్రోకోడ్ చిత్రానికి సంబంధించిన అప్డేట్ ప్రకటించారు. డిక్కిలూనా, వడక్కుపట్టి రామసామి వంటి చిత్రాలతో ప్రసిద్ధి చెందిన కార్తీక్ యోగి దర్శకత్వంలో ఈ బ్రోకోడ్ రానుంది. నలుగురు ప్రముఖ మహిళా నటులతో పాటు ప్రముఖ నటుడు ఎస్.జె. సూర్య కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషించనున్నారు. పోర్ తోజిల్ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన కలైసెల్వన్ శివాజీ, యానిమల్, అర్జున్ రెడ్డి వంటి విజయాలను అందించిన హర్షవర్ధన్ ఈ ప్రాజెక్ట్ కోసం పని చేయనున్నారు. ఎడిటర్‌గా ప్రదీప్ ఇ. రాఘవ్, ఆర్ట్ డైరెక్టర్‌గా ఎ. రాజేష్ వ్యవహరించనున్నారు. స్లాప్ స్టిక్ కామెడీ అంశాలతో కూడిన వినోదాత్మక ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని నటుడు రవి మోహన్ స్వయంగా రవి మోహన్ స్టూడియోస్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి దర్శకుడు కార్తీక్ యోగి మాట్లాడుతూ.. నేను రవి మోహన్‌కి కథ చెప్పినప్పుడు ఆయన చాలా హ్యాపీగా ఫీల్ అయ్యారు. ఆయన ఈ కథను పూర్తిగా ఆస్వాదించారు. కథ విన్న వెంటనే దానిని నిర్మించడానికి ముందుకు వచ్చారు. ఈ చిత్రంలో స్లాప్ స్టిక్ హాస్యం అధికంగా ఉంటుంది. ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ అందించేలా రూపొందిస్తున్నామని అన్నారు. నలుగురు ప్రముఖ మహిళా నటీనటుల గురించి అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.



# నేను దెయ్యంలా ఉన్నాను: జానీ లీవర్

బాలీవుడ్ ప్రముఖ హాస్య నటుడు జానీ లీవర్ కుమార్తెగా జేమీ లీవర్‌కి మంచి ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఆమె సినీ ఇండస్ట్రీలోనే కాకుండా వ్యక్తిగతంగానూ తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. నేను ఒకింత నల్లగా ఉంటాను. శరీర రంగు విషయంలో నేనెప్పుడూ బాధపడలేదు. కానీ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాను. నువ్వు అందహీనంగా ఉన్నావు. దెయ్యంలా ఉన్నావు. ఇండస్ట్రీలో నీకు పని దొరకడం కష్టం



అంటూ నా మొహం మీదే చెప్పారు. జేమీ లీవర్ ఇంకా మాట్లాడుతూ, ఎంతోమంది నన్ను ఎన్నో రకాలుగా మాటలన్నారు. చిన్నతనం నుంచి నా రంగు విషయంలో ఇలాంటి మాటలే వింటున్నా. ఓ దశలో జీవితంలో నేను విజయం సాధించాలంటే ముందు తెల్లగా మారాలని అనుకున్నాను. కానీ ఆ బావన తప్పు అని ఆ తర్వాత అర్థం అయింది. నిజం చెప్పాలంటే ఎంతోమంది ఇలాంటి విమర్శలు ఎదుర్కొంటున్నారు. శరీర రంగు అనేది మన సమాజంలో ఉన్న సమస్య అని జేమీ లీవర్ తెలిపింది.




# తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంలో సునీల్ స్పెషల్ రోల్

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ రఫ్ నోట్ ప్రొడక్షన్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు మరియు సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తమిళ, తెలుగు ద్విభాషా చిత్రంలో ప్రముఖ నటుడు సునీల్ ముఖ్య పాత్రలో నటించనుండటం గర్వకారణంగా ఉంది. తెలుగు చిత్రసీమలో విభిన్న శైలులలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సునీల్, మర్యాద రామన్న, అందాల రాముడు, పుష్ప వంటి విజయవంతమైన చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన చేరికతో ఈ చిత్రానికి కొత్త ఉత్సాహం మరియు విస్తృత ప్రజా ప్రాచుర్యం లభించనున్నది. ఈ చిత్రంలో సునీల్ పోషించనున్న పాత్ర చాలా ప్రత్యేకమైనది. హాస్యం, హృద్యత, భావోద్వేగాలు మిళితమైన ఈ పాత్ర ఆయన నటనకు మరో కొత్త కోణాన్ని పరిచయం చేయనుంది. ఇది ఆయన సినీ ప్రయాణంలో ఒక విభిన్నమైన మలుపు అని చెప్పవచ్చు. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ, సునీల్ ప్రేక్షకుల్లోకి దగ్గరయ్యే నటుడు మాత్రమే కాదు, ఒక సహజ నటనకు నిలువెత్తు ఉదాహరణ. ఈ సినిమాలో ఆయన చేయబోయే పాత్ర ఆయన ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నమైనది. ఇది హృదయానికి హత్తుకునే, చాలా సహజమైన పాత్ర అని తెలిపారు. చిత్రానికి సంబంధించిన అధికారిక టైటిల్‌ను జూన్ 15న విడు దల చేయనున్నారు. అలాగే, ఇంకెంతో మంది ప్రముఖ నటీనటుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.



# 'ప్రియా ప్రకాష్' భలే ఉంది రా బాబు ఈ బ్యూటీ

అందాల గేట్లు అమాంతం ఎత్తేసి రచ్చ చేసింది ప్రియా ప్రకాష్ వారియర్. ఇన్నర్ టాటూ ఫోకస్ చేస్తూ గతంలో కెమెరా ముందు గ్లామర్ డోస్ దట్టించింది. దీంతో ఈ స్టైలిష్ ఫొటోస్ చూసి రొమాంటిక్ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. అమ్మడి గ్లామర్ డోస్ చూస్తుంటే వెండితెరపై రెచ్చిపోవడానికి అమ్మడు సిద్ధంగా ఉన్నట్లు హింట్స్ ఇస్తోందని చెప్పుకోవచ్చు. అయితే అవకాశాల కోసం ఇంతలా రెచ్చిపోవాలా? అంటూ కొందరు కామెంట్స్ చేయడం చూడొచ్చు. ఒకే ఒక్క కన్ను గీటుతో దేశ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది ప్రియా ప్రకాష్ వారియర్. ఆమె నటించిన ఒరు అదార్ లవ్ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ఆకట్టుకోలేక పోయినా కన్నుగీటి కుర్రకారుకు వల వేసింది. కేరీర్ ప్రారంభంలోనే ప్రియాకు ఊహించని రేంజ్ క్రేజ్ దక్కడంతోయూత్‌లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. దీనికితోడు ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఆమె షేర్‌చేస్తున్న ఫొటోస్ అమ్మడిక్రేజ్ పెంచుతున్నాయి.



# బ్లాక్ డ్రెస్‌లో రాశి ఖన్నా అదుర్స్

బ్లాక్ డ్రెస్‌లో మతి పోగొడుతున్న టాలీవుడ్ హీరోయిన్.. వావ్ సూపర్ అంటున్న నెటిజన్ల ఊహాలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా మనందరికీ సుపరిచితమే. తన ఫస్ట్ మూవీతోనే ఈ బ్యూటీ యూత్ క్రష్‌గా మారిపోయింది. తన అందం, అభినయంతో కుర్రాళ్లను ఫిదా చేసింది. దీంతో ఈ భామకు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా వరుస సినిమాల్లో నటించి మంచి పాపులారిటీ సంపాదించుకున్నది. ప్రజెంట్ ఈ అమ్మడు తెలుగులో స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ సరసన తెలుసు కదా మూవీలో నటిస్తోంది. అలాగే బాలీవుడ్‌లోనూ వెబ్ సిరీస్, ఐటెం సాంగ్స్‌లో చిందులేస్తూ ఉంది. ఓ పక్క సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ మరో పక్క నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ తన గ్లామర్‌తో హీట్ పుట్టించడంతో పాటు ఫ్యాన్స్ ఫాలోయింగ్ కూడా పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా రాశి ఖన్నా తన ఇన్‌స్టాగ్రామ్వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లాక్ కలర్ డ్రెస్సులో దర్శనమిచ్చింది. కళ్లకు కాటుక పెట్టుకోవడంతో ఈ ముద్దుగుమ్మ మరింత అందంగా కనిపించింది. అలాగే వైట్ తెర వెనుక నిలబడి ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. అంతేకాకుండా వాటికి.. బయట అంతా మంచు, లెక్కించదగ్గ చోటంతా నిప్పు అనే క్యాప్షన్ జోడించింది.



# 'చండీ దుర్గమా' చిత్రం షురూ

మంచి ప్యాడింగ్ ఆర్టిస్టులతో పాటు నూతన నటీనటులను పరిచయం చేస్తూ హెచ్ బి జె క్రియేషన్స్, మదర్ అండ్ ఫాదర్ పిక్చర్స్ నిర్మిస్తున్న సినిమా చండీ దుర్గమా. ఈ సినిమాకు జయశ్రీ వెల్ది నిర్మాత. ఒలి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మైను ఖాన్ ఎండీ దర్శకత్వం వహిస్తున్నారు. చండీ దుర్గమా సినిమా పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ కమెడియన్ అలీ ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. కెమెరా స్విచ్ ఆన్ నటుడు చిట్టి చేయగా, ముహూర్తపు సన్నివేశానికి రఘు కారుమంచి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా, ప్రముఖ కమెడియన్ అలీ మాట్లాడుతూ, చండీ దుర్గమా సినిమా ప్రారంభోత్సవానికి అతిథిగా రావడం సంతోషంగా ఉంది. అమ్మవారి కథతో వస్తున్న సినిమా కాబట్టి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. సినిమా కూడా ప్రేక్షకుల ఆదరణ పొందాలి. ప్రొడ్యూసర్ జయశ్రీకి, డైరెక్టర్ మైను ఖాన్‌తో సహా టీమ్ అందరికీ మంచిపేరు తీసుకువస్తుందని ఆశిస్తున్నా. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు. డైరెక్టర్ మైను ఖాన్. ఎండీ. మాట్లాడుతూ, మా చండీ దుర్గమా చిత్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చి క్లాప్ కొట్టిన అలీకి థ్యాంక్స్ చెబుతున్నాం. రఘు కారుమంచి, చిట్టి కూడా మాకు సపోర్ట్ చేసేందుకు ఇక్కడికి రావడం సంతోషంగాఉంది. ఇటీవల అమ్మవారి నేపథ్యంగా సినిమాలు రూపొందడం లేదు. సౌందర్య అమ్మోరు, విజయశాంతి చండీ సినిమా తర్వాత అమ్మవారి కథతో సినిమా రాలేదు. ఇప్పటి ట్రెండ్‌కు అనుగుణంగా, ఈతరం ప్రేక్షకులకు నచ్చేలా డార్క్ థీమ్‌లో సరికొత్త స్క్రీన్ ప్లే, కాన్సెప్ట్‌తో చండీ దుర్గమా చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం థియేటర్స్ కు ప్రేక్షకులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో థియేటర్స్‌కు ఆడియెన్స్‌ను రప్పించేలా చండీ దుర్గమా సినిమా మేకింగ్‌ను డిజైన్ చేస్తున్నాం. కో ప్రొడ్యూసర్ ఒలీ చెప్పిన ఒక పాయింట్ ఆధారంగా ఈ చిత్ర కథను నేను రాశాను. ఇటీవల కాలంలో ఇలాంటి కాన్సెప్ట్ రాలేదు. చండీ దుర్గమా సినిమా ఒక మాస్టర్ పీస్ అవ్వాలని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత జయశ్రీ వెల్ది మాట్లాడుతూ, అమ్మవారి నేపథ్యంతో ఒక మంచి కథతో చండీ దుర్గమా సినిమాను నిర్మించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. మన తెలుగు ఆడియెన్స్ అమ్మవారి నేపథ్యంగా వచ్చిన చిత్రాలను ఎంతో ఆదరించారు. మా సినిమాకు కూడా అలాంటి సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాం. హై క్వాలిటీ మేకింగ్‌తో మంచి ప్యాడింగ్ ఆర్టిస్టులు, ప్రతిభ గల కొత్త నటీనటులతో చండీ దుర్గమా సినిమాను మీ ముందుకు తీసుకొస్తాం. అన్నారు. సినిమాటోగ్రాఫర్ వైఎస్ కృష్ణ మాట్లాడుతూ, చండీ దుర్గమా సినిమా ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మా మూవీని విజువల్స్ పరంగా కొత్తగా స్క్రీన్ మీద ప్రెజెంట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మీ అందరి సపోర్ట్ ఉంటుందని నమ్ముతున్నాం.



# ఆహా ! ఏమి రుచి !

**✦ టేస్ట్ అట్లాస్ జాబితాలో మహారాష్ట్ర మిసల్ పావ్కు 18వ ర్యాంక్పరోటాకు 23వ స్థానం ✦ఢిల్లీ చోలే బటూరేకు 32వ స్థానం ✦ టాప్ 100లో నిహారి, శ్రీఖండ్, పాలక్ పనీర్లకు కూడా చోటు భారతీయ వంటల సంస్కృతికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు.**

భారతీయ పాకశాస్త్ర వారసత్వానికి, అల్పాహారాల విశిష్టతకు దక్కిన గౌరవమిది .ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఫుడ్ అండ్ ట్రావెల్ గైడ్ 'టేస్ట్ అట్లాస్' విడుదల చేసిన 50 అత్యుత్తమ అల్పాహారాల జాబితాలో మూడు ప్రఖ్యాత భారతీయ వంటకాలు స్థానం సంపాదించు కున్నాయి. ఈ జూన్ 2025 నాటి ర్యాంకింగ్స్లో ఈ ఘనత దక్కడం విశేషం.





ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో మహారాష్ట్రకు చెందిన మిసల్ పావ్ 18వ స్థానంలో నిలిచింది. పరోటా 23వ స్థానాన్ని దక్కించుకోగా, ఢిల్లీ వాసుల ఆల్ టైమ్ ఫేవరెట్ అయిన చోలే బటూరే 32వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ వంటకాలు కేవలం ఉదయం పూట ఆకలి తీర్చే పదార్థాలు మాత్రమే కావని, అవి మన దేశంలోని కమ్యూనిటీలతో లోతుగా పెనవేసుకుపోయిన అంశాలని, ప్రజలు వీటితోనే తమ దినచర్యను ప్రారంభిస్తారని టేస్ట్ అట్లాస్ తన నివేదికలో ప్రశంసించింది. "అసలైన మిసల్ పావ్ ఘాటుగా ఉండాలి. దాని బేస్ (అడుగుభాగం) కరకరలాడుతూ ఉండాలి. చూడటానికి ఎరుపు, గోధుమ, నారింజ, ఆకుపచ్చ వంటి అనేక రంగులతో ఒక కళాఖండంలా కనిపించాలి "అని టేస్ట్ అట్లాస్ పేర్కొంది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న పరోటా, చోలే బటూరే సాంప్రదాయకంగా ఉత్తర భారత వంటకాలు అయినప్పటికీ, దేశవ్యాప్తంగా ఇవి ఎంతో ప్రాచుర్యం పొందాయి. వివిధ ప్రాంతాల్లో అక్కడి స్థానిక రుచులకు అనుగుణంగా వీటి తయారీ విధానంలో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఢిల్లీలో చోలే బటూరే అత్యంత ప్రజాదరణ పొందిన స్ట్రీట్ ఫుడ్ కాంబినేషన్లలో ఒకటి. కేవలం టాప్ 50 అల్పాహారాల పేర్లను మాత్రమే కాకుండా 51 నుంచి 100 వరకు ఉన్న ర్యాంకులను కూడా టేస్ట్ అట్లాస్ అధికారిక వెబ్సైట్లో వెల్లడించింది.

ఈ జాబితాలో నిహారి, శ్రీఖండ్, పాలక్ పనీర్ వంటి మరిన్ని భారతీయ వంటకాలు కూడా స్థానం సంపాదించుకోవడం విశేషం. ఈ వంటకాలకు టేస్ట్ అట్లాస్ నుంచి అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఇది మొదటిసారి కాదు.గతంలో ప్రపంచంలోని ఉత్తమ బ్రెడ్ల (రొట్టెల) జాబితాలో పలు భారతీయ రొట్టెలు స్థానం సంపాదించాయి. అంతకుముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో భారతదేశానికి చెందిన 'మసాలా ఆమ్లెట్' ప్రపంచంలోని ఉత్తమ గుడ్డు వంటకాల జాబితాలో 22వ స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. ర్యాంకింగ్ల కోసం టేస్ట్ అట్లాస్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్ల నుంచి రేటింగ్లను సేకరిస్తుంది. అల్పాహార ర్యాంకింగ్ల కోసం 2025 మే 15 నాటికి 41వేలకు పైగా రేటింగ్లను ప్రాసెస్ చేయగా, వాటిలో సుమారు 24,000 రేటింగ్లను సరైనవిగా, విశ్వసనీయమైనవిగా నిర్ధారించినట్లు సంస్థ తెలిపింది. వాటిని ఫిల్టర్ చేయడానికి తమ వద్ద అధునాతన యంత్రాంగాలు ఉన్నాయని కూడా టేస్ట్ అట్లాస్ పేర్కొంది. ◻



## చెలి చిట్కా

◆ దుస్తులు ఖరీదుకన్నా వాటి వెరైటీ అవి సరిగా సరి పోయినట్లు వున్నాయో లేదో అనేదానిమీద మీ అందం ఆకర్షణ ఆధారపడు తుంది. ◆ దుస్తులు నలుగురు మెచ్చుకునేలా ధరించడం ఒక కళ.

# సవాళ్లు ఎదురైనా ధైర్యంగా..



**వైద్యం మెరుగైంది, వ్యాధులపైన అవగాహన పెరిగింది... అయినా ప్రాణాంతక క్షయపైన పోరాటంలో ఇంకా వెనకబాటే పోషకాహార లోపం వల్ల గిరిజనుల్లో క్షయ కేసులు ఎక్కువ. వ్యాధి తీవ్రతను తగ్గించాలంటే వారి చెంతకు వెళ్లాల్సిందే అనుకున్నారు విశాఖలోని గీతం వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చేపూరు రాజ్యలక్ష్మి ి. ఈ ఎదురు సవాళ్లు ఎదురైనా... ధైర్యంగా ముందుడుగు వేస్తున్నారు.**

భారత వైద్య పరిశోధన (ఐసీఎంఆర్) మండలి దేశవ్యాప్తంగా చేపడుతున్న 'గిరిజన ప్రాంతాల్లో టిబి అధ్యయనం నిర్మూలన' ప్రాజెక్టులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్నారు. గిరిజనులతో సులభంగా మమేకమయ్యేందుకు ఏడుగురు స్థానికులను వాలంటీర్లుగా నియమించుకున్నా. హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల్లో దాదాపు 600 గ్రామాల్లో ప్రతి ఇంటికీ క్షయ లక్షణాలున్నాయేమోనని స్క్రీనింగ్ చేశాం. దీనికోసం ఎక్స్రే తీసే ఒక చిన్న పరికరాన్ని పట్టుకుని వెళ్లేదాన్ని. దాన్ని ఇంటర్నెట్ ద్వారా ల్యాప్టాప్కు అనుసంధానించి, దగ్గరలోని వైద్యులకు డిజిటల్ స్కాన్ పంపేవాళ్లం. అనుమానితుల్ని గుర్తించి, తర్వాత దశలో కఫ పరీక్షకు పంపేవారు వ్యాధి నిర్ధారణ అయినవాళ్లకి స్థానిక వైద్యుల సహకారంతో చికిత్స అందించాం. వైద్యులను సంప్రదించేలా అనుశీలన చేస్తున్నాం. అవసరమైన వారికి పౌష్టికాహారం అందజేస్తున్నాం. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజనుల్లో అవగాహన పెరిగిందని జిల్లా అధికారులు మెచ్చుకున్నారు.

**ఆచారంతో ప్రాణం పోయింది!** ఆరోగ్యం బాగోలేకపోతే ముందుగా నాటువైద్యులనే సంప్రదిస్తుంటారు గిరిజనులు. అలా కాకుండా టిబి లక్షణాలుంటే ఆరోగ్య కార్యకర్తల దృష్టికి తీసుకురావాలని సూచించాం. అనుమానితులను గుర్తించడం నేర్పించాం. కొద్దిరోజులకు నాటువైద్యుల వద్దకు వెళ్లేవారి సంఖ్య తగ్గింది. వ్యాధి లక్షణాలు, చికిత్సపై గిరిజనులకు అవగాహనపెరిగింది. ఒకప్పుడు స్క్రీనింగ్ కోసం ఇంటింటికి వెళ్లి 'ఎవరికైనా టిబి లక్షణాలున్నాయా' అని అడిగితే గొడవ పడేవారు. మా వాళ్లకి వ్యాధి తగ్గిపోయిందని, కావాలనే చెడుగా ప్రచారం చేసి కోప్పడేవారు. ఇలాంటి ఘటనలు ఎన్నో. గ్రామ సర్పంచుల సహకారంతో వారికి వివరాలు చెప్పడంతో పరిస్థితి మెరుగుపడింది. మేం గుర్తించిన ఓ బాధితుడికి విశాఖలోని టీబీ ఆసుపత్రికి వెళ్లేందుకు డబ్బుల్లే వంటే ఇచ్చాం. ఆసుపత్రికి వెళ్లాల్సిన రోజు గ్రామంలో ఎవరో చనిపోయారని... ఊరి కట్టుబాట్ల కారణంగా పదిరోజులు బయటకు వెళ్లలేదు. ఆ తర్వాత ఇచ్చిన డబ్బులు ఖర్చయిపోయాయని చెప్పారు. మేమే తీసుకెళ్తామన్నాం. అంతలో ఆనారోగ్యం కారణంగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చని పోయారు. ఆ ఘటన చాలా బాధ కలిగించింది. గత రెండేళ్లలో దాదాపు 200లకు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు. చాలా మందికి ఆధార్ లేక పోవడంతో చికిత్సకు నమోదులో ఇబ్బందులు ఎదురయ్యాయి. వారికి ఆధార్ కార్డులు చేయించాం. మెరుగైన ఫలితాలు రావడంతో ఈ ప్రాజెక్టును ఐసీఎంఆర్ మరో ఏడాది పొడిగించింది.



**నాన్న కల నిజం చేశా!** నాన్న సీతారామయ్య ప్రభుత్వాధికారి. అమ్మ రత్నమ్మ గృహిణి. మాది గుంటూరు. ఇంటర్ వరకూ అక్కడే చదువుకున్నా. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల నుంచి ఎంబీబీఎస్, విశాఖలోని ఆంధ్రా వైద్య కళాశాల నుంచి పిజి పూర్తి చేశా. ఆరేళ్లుగా గీతంలో పనిచేస్తున్నా. డాక్టర్ అవ్వాలనుకున్నా ఆర్థిక కారణాలతో ముందుకు వెళ్లలేకపోయారు నాన్న. మాద్వారా ఆయన కలలను నిజం చేసుకున్నారు. మా వారు సుబ్బరాయుడు వైద్యులే. ప్రజా సేవకు ప్రాధాన్యత అందించే కమ్యూనిటీ మెడిసిన్ విభాగం తీసుకున్నా. ఈ ప్రాజెక్టు ప్రారంభమయ్యే సమయానికి మా పాపకు ఏడాదిన్నర. తనను ఇంట్లోనే వదిలి వెళ్లేదాన్ని. మండల కేంద్రాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లడానికి చాలా సమయం పట్టేది కారు వెళ్లని ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై లిఫ్ట్ అడిగి వెళ్లేదాన్ని. కొన్నిచోట్ల కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. రాత్రి ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయేది. అప్పటికి పాప ఏడుస్తుంది. కానీ, ఈ ప్రాజెక్టుద్వారా వస్తున్న మార్పు చూసి కొన్ని ఇబ్బందులూ, త్యాగాలకు సిద్ధమయ్యా! ◻

# కుచ్చులో ఉపయోగం..



**మొక్కజొన్నపొత్తును** ఇష్టపడనివాళ్లు దాదాపుగా ఉండరు. వాటి తొక్క తీస్తుంటే పట్టుకుచ్చులా మెరిసే మెత్తటి పీచు కనిపిస్తుంది. దాన్ని తీసేసి కండెను కాల్చుకుంటాం లేదా ఉడక బెట్టుకుంటాం. కానీ ఆ పీచు రంగులోనే కాదు, ఔషధపరంగా కూడా బంగారం అంటున్నారు ఆహార నిపుణులు.

- మొక్కజొన్న పీచులో క్యాల్షియం, ఐరన్, సోడియం, పొటాషియం, జింక్, క్లోరైడ్, ఇలా మనకు అవసరమయ్యే ఖనిజాలు, విటమిన్లు, ప్రొటీన్లు ఉన్నాయి. దీనితో తయారయ్యే టీపొడర్, సప్లిమెంట్లు అమెరికా, చైనా, టర్కీ వంటి దేశాల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. 2 రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వాపు, నొప్పి వంటి ఇబ్బందుల నుంచి ఉపశమనంకలిగి స్తుంది. 3కొలెస్ట్రాల్ స్థాయిని క్రమబద్ధం చేస్తుంది.
- మూత్రాశయం, మూత్రనాళాల్లో ఇన్ఫెక్షన్లను, కిడ్నీలో రాళ్లు ఏర్పడటం, పిల్లల్లో పక్క తడపటం లాంటి సమస్యలను నిరోధిస్తుంది. 5.మూలిక నివారణలో, కూరగాయల పునరుత్పత్తిలో మొక్కజొన్న పీచును వినియోగించారు. దీనితో మధుమేహం, క్యాన్సర్ వంటి జబ్బులకు మందులు తయారవుతున్నాయి.
- మొక్కజొన్న పీచును నీడలో ఎండబెట్టి, పొడిచేసి భద్రంచేసు కుంటే. ఉడక బెట్టిన గుడ్లు, సలాడ్స్, స్మూతీస్లో కాస్త చల్లుకుని సేవించవచ్చు. కానీ దీన్ని అతి కొద్ది మోతాదు లోనే తీసుకోవాలి. ఏం చేయలేం. మరో క్రమంగా తీపి తినాలన్న కోరికను కోరిక తగ్గు తుంది. ◻

# లక్ష్యం దిశగా అడుగులు..

**ఆడపిల్లలుగా పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే ఎన్నో అవాంతరాలు ఎదురుకావొచ్చు. అలాగని ప్రతి చిన్నదానికి నిరాశపడితే మీరు మరింత బలహీనంగా మారొచ్చు. లక్ష్యం దిశగా నడవాలన్నా, శక్తిని పుంజుకోవాలన్నా.. మీ అలవాట్లను, ఆలోచనా శైలినీ ఇలా మార్చుకుని చూడండి.**

◆ చాలామంది తమలో లేనివి ఏంటో గమనించుకోవడం వదిలేసి.. ఇతరులతో పోటీపడుతుంటారు. ఇలాంటి పోలిక, పోటీ మీకు మేలు చేయకపోగా అది దక్కనప్పుడు ప్రతికూల ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఫలితంగా మిమ్మల్ని మరింత నిరాశలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. ఎదుటివారి విజయాన్నీ మనస్ఫూర్తిగా స్వీకరించండి. మీలోని లోపాల్ని బేరీజు వేసుకోండి. మీ బలహీనతల్ని సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.



◆ పురుషాధిక్యత, ఇతర సామాజిక పరిస్థితులు మీకెన్నో ఆంక్షల్ని అడ్డుపెట్టొచ్చు. అంత మాత్రాన మీ ప్రయాణాన్ని ఆపేయాల్సిన అవసరం లేదు. దానికోసం మనలోని శక్తిని వందశాతం వినియోగించుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే మీ శక్తి సామర్థ్యాల మీద వాస్తవిక అంచనా రావడంతోపాటు, లోటు పాట్లను సరిదిద్దుకునే అవకాశమూ దక్కుతుంది.

◆ విశాల ప్రపంచంలో అవకాశాలు అపారం. వాటిని అందుకోవాలంటే.. ముందు మనపై మనకు నమ్మకం ఉండాలి. ఏదైనా లక్ష్యం చేరుకోవాలను కున్నప్పుడు మాట్లాడాల్సిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యం. దానికోసం ఎప్పటి కప్పుడు మిమ్మల్ని మీరు అప్డేట్ చేసుకోవడానికి ప్రయత్నించండి మీరు చేరుకునే మార్గంలో మీకు ఇదెంతో తోడ్పడు తుంది. ◻

# వాడకంలో జాగ్రత్తలు

మారిన జీవనశైలి వల్ల ఇంట్లో పనులు త్వరగా పూర్తవ్వాలంటే... ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం తప్పనిసరి. మరి వీటిని మన్నికగా, అనుకూలంగా ఉపయోగించాలంటే ఆయా వస్తువులు కొనడానికి ఇచ్చే



నిబంధనలు పాటించడమే కాదు... జాగ్రత్తలూ పాటించాలి. అవేంటంటారా?

- అన్నం త్వరగా వంటే ఎలక్ట్రిక్ కుక్కర్ ఉంటే సౌకర్యమే... మరి ఏమాత్రం అజాగ్రత్తగా వాడినా ప్రమాదం ముంచుకు రావొచ్చు. ముఖ్యంగా దీన్ని వాడే ముందు గిన్నె అడుగు భాగంలో తడి లేకుండా చూసుకోవడం తప్పనిసరి. అన్నం పొంగినా, మరకలు పడినా... నీటితో ఎట్టి పరిస్థితిలోనూ కడగొద్దు. కుక్కర్ గిన్నెలను నేరుగా పొయ్యిమీద పెట్టొద్దు.
- మిక్సీ గిన్నెలు వాడాక అందులో నీళ్లు పోసి సింకులోనే వదిలేస్తారు కొందరు. దీన్ని వల్ల బ్లేడ్లు పదును పోతాయి. పని పూర్తయ్యాక త్వరగా కడిగి ఆరబెట్టేయండి. లేదంటే కాస్త ఉప్పు వేసి మిక్సీ తిప్పితే మళ్లీ పదునుగా మార తాయి.
- ఇప్పుడు మనం ఫ్రిజ్పై ఆధారపడినట్లుగా ఒకప్పటి తరం ఉపయోగించ కపోయి ఉండొచ్చు. అలాగని కనిపించి నవన్నీ ఇందులో నింపేయొద్దు. ముఖ్యంగా వేడి వేడి పదార్థా లను, మూతల్లేని గిన్నెలను ఇందులో ఉంచొద్దు. వాటి తాలూకు వాసనలు మిగిలిన ఆహారానికి పట్టేస్తాయి. ఎప్పుడైనా ఓ నెల రోజులు ఊరెళ్లాల్సి వస్తే... దాన్ని ఆఫ్ చేయొద్దు. అంతకు మించి ఉండాల్సి వస్తే మాత్రం... ఫ్రిజ్లోపల తడి, తేమ లేకుండా ఆరనిచ్చి డోర్ వేయండి. లేదంటే ఫంగస్ చేరి కొత్త సమస్యలకు దాకితీస్తుంది.
- . అవెన్ని ఎలా ఉపయోగించాలో ముందు తెలుసుకోండి ముఖ్యంగా అవెన్ సేఫ్ పాత్రల్ని కొనేటప్పుడు తగిన జాగ్రత్త వహించండి. ఆహారపదార్థాల తాలూకు వ్యర్థాలను ఎప్పుడు శుభ్రం చేయండి. ఉప్పు, కాస్త బేకింగ్ సోడా చల్లి కాసేపు వదిలేయండి. ఆపై తడి స్పాంజితో తుడిస్తే సరి. లేదా బౌల్లో కాస్త వంటసోడా వేసి నీళ్లను మరిగిస్తే... ఆ ఆవిరి గోడలకంతా పట్టి త్వరగా వదిలిపోతుంది.
- ఏరోజుకారోజు పోగయ్యే దుస్తులను ఉతకడానికి వాషింగ్ మెషీన్ లేకపోతే.... ఇల్లాళ్ల బోలెడంత ఒత్తిడి. అయితే, ఇది సరిగా పనిచేయాలంటే దీన్ని ఉపయోగించే విధానం తెలిసి ఉండాలి. వాడిన ప్రతిసారీ లోపలి రబ్బరు మురికి చేరకుండా శుభ్రం చేసుకోవటం తప్పనిసరి. ప్రతి పది వాష్లకు ఒక్కసారైనా కాస్త బేకింగ్ సోడా వేసి డ్రమ్ క్లీన్ చేయాలి. ఏళ్ల తరబడి ఇబ్బంది లేకుండా వాడుకోవచ్చు. ◻

# నలబైలో అధిక బరువు తగ్గాలంటే ఇలా..

**అధికబరువు. ఏ వయసు వారైన సరే. చాలామంది అంగీకరించలేని విషయమిది! అయితే ఎంత వద్దనుకున్నా.. 40 దాటాక చాలామంది మహిళలు క్రమంగా బరువు పెరుగుతారంటున్నారు నిపుణులు. ఇందుకు మన శరీరంలో జరిగే మార్పులతో పాటు జీవనశైలి విషయంలో నిర్లక్ష్యంగా ఎలా కారణమని చెబుతున్నారు. మరి, ఈ సమస్యను అధిగమించి ఈ వయసులో ఫిట్ ఉండడం సాధ్యపడదా అంటే.. అదీ మన చేతుల్లోనే ఉంది. ఇందుకోసంకొన్ని నియమాలుపాటించాల్సి ఉంటుంది. అవేంటో తెలుసుకుందాం..**

ఆరోగ్యంగా, ఫిట్గా ఉండాలంటే బరువు అదుపులో ఉండాలి. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ శక్తి క్షీణించడం వల్ల ఏ పని పైనా దృష్టి పెట్టలేం. వ్యాయామమూ చేయలేం. మరోవైపు జీవక్రియల పనితీరు నెమ్మదిస్తుంది. ఇది క్రమంగా తీపి తినాలన్న కోరికను పెంచుతుంది. ఇలా అటు శరీరానికి శ్రమ



లేక, ఇటు అనారోగ్యపూరిత ఆహారానికి అలవాటు పడడం వల్ల క్రమంగా బరువు పెరుగుతాం.

◆ జీవక్రియల పనితీరు నెమ్మదించడం వల్ల శరీరంలోకి చేరిన కొవ్వులు, క్యాలరీలు కరగడానికి చాలా సమయం పడుతుంది. ఇది క్రమంగా అధిక బరువుకు దారితీస్తుంది.

◆ 40 దాటిన చాలామంది బరువు పెరగడానికి మెనోపాజ్ కూడా ఓ కారణమంటున్నారు నిపుణులు. ఈ వయసులో మెనోపాజ్కు చేరువవ్వడం,లేదంటే అప్పటికే ఈ దశలోకి ప్రవేశించడం వల్ల ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్, టెస్టోస్టిరాన్.. వంటి హార్మోన్ల స్థాయుల్లో మార్పులు చోటుచేసు కుంటాయి. ఈ హార్మోన్ల అసమతుల్యత అధిక బరువుకు దారితీస్తుంది.

◆. వయసు పెరిగే కొద్దీ ఎముక, కండరాల సామర్థ్యం తగ్గడం వల్ల వ్యాయామం చేయడానికి శరీరం సహకరించదు. ఒకవేళ బలవంతంగా చేసినా గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఇలా శారీరక శ్రమ లేకపోవడం వల్ల కూడా శారీరక బరువు పెరుగుతాం.

◆ మెనోపాజ్కు చేరువయ్యే కొద్దీ వేడి ఆవిర్లు, అర్ధరాత్రి ఉన్నట్లుండి చెమటలు పట్టడం. వంటి సమస్యలొస్తాయి. తద్వారా రాత్రుళ్లు సుఖ నిద్రకు దూరమవుతారు. దీనివల్ల ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోవడం.. జీవనశైలి అదుపు తప్పడం. ఆఖరికి ఇవి అధిక బరువుకు కారణమవుతాయి.అయినా **ఫిట్గా ఉండవచ్చు!......** ◆ బాదం పప్పులు, వాల్నట్స్, గుమ్మడి గింజలు, పొద్దుతిరుగుడు గింజలు వంటి నట్స్ని సాయంత్రం స్నాక్గా తరచూ తీసుకోవడం మంచిది. తద్వారా ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉండి, ఆకలేయకుండా, ఇతర పదార్థాల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చు.

◆ తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలో పాలు-పాలపదార్థాలు, మాంసం, గుడ్లు, వంటివి ముఖ్యమైనవి.



◆ ఫైబర్ అధికంగా ఉండే కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటూ.. ప్రాసెస్డ్, నూనె సంబంధిత పదార్థాలను పూర్తి పక్కన పెట్టాలి.

◆ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలంటే వ్యాయామం కీలకం. కాబట్టి వయసు పెరుగుతున్నా వర్కవుట్ చేయడం మానకూడదు. ఈ క్రమంలో స్కాట్స్, లాంజెస్, పుషప్స్, కెటిల్బెల్తో ఎక్సర్సైజ్.. వంటివి రోజూ సాధన చేయాలి ఒకవేళ ఒంటరిగా చేయడం ఇబ్బంది అనుకుంటే జిమ్లో చేరచ్చు.


5.సుఖ నిద్ర వల్ల ఒత్తిడి, ఆందోళనలు తగ్గడంతో పాటు హార్మోన్ల సమతుల్యత పెరుగుతుంది. తద్వారా బరువు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. కాబట్టి రోజూ రాత్రుళ్లు 7-8 గంటలపాటు నిద్ర పోవడం మంచిది.

◆ విటమిన్లలోపాలు కూడా శారీరక సత్తువను కోల్పోయేలా చేస్తాయి. కాబట్టి పోషకాహారం తీసుకోవడంతో పాటు అత్యవసరమైతే నిపుణుల సలహా మేరకు ఆయా విటమిన్ సప్లిమెంట్స్ వాడడం వల్ల ఫలితం ఉంటుంది. ◻

# అందరికీ ఆరాధ్యుడు



ద్వాపర యుగంలో భీమునికి తన విశ్వ రూపాన్ని చూపించి, అధిక బలసంపన్నుడయ్యేలా అనుగ్రహించాడు. అర్జునుడు ధ్వజంపై నిలిచి పాండవుల విజయానికి తోడనపడ్డాడు. అందువల్లే అర్జునుడికి కపిధ్వజుడు అనే పేరు వచ్చింది. శివరూపం, విష్ణునామం, బ్రహ్మశక్తి, వాయుతేజం కలగలసిన శక్తిస్వరూపుడు హనుమంతుడు. హనుమ-పంచముఖుడు, ఆ ముఖాలన్నీ మహోజ్వలమైనవే ఆంజనేయుడు, నరసింహుడు, గరుడుడు, వరాహస్వామి, హయగ్రీవుడు.. ఇవే హనుమంతుని పంచముఖాలు. ఆంజనేయుని ముఖం రుద్రాంశ. తక్కిన నాలుగూ విష్ణ్వంశలే. శైవులు, వైష్ణవులు, అద్వైతులు.. అనే భేదం లేకుండా అందరికీ ఆరాధ్యుడయ్యాడు పవనతనయుడు. అశ్వత్థామ, బలిచక్రవర్తి, వ్యాస మహర్షి హనుమంతుడు, విభీషణుడు, కృపుడు (ద్రోణుడి కంటే ముందు కౌరవుల అస్త్ర గురువు), పరశురాముడు ఈ ఏడుగురూ చిరంజీవులు. వీరిని తలచుకుంటే చాలు సర్వవ్యాధులూ నశిస్తాయి. ముఖ్యంగా నిద్రించే ముందు ఎలాంటి భయాలకూ లోనవకుండా, పీడకలలు రాకుండా ఉండటానికి ఆంజనేయుని స్మరించుకుంటాం. భయం కలిగినా, ఉలిక్కిపడినా, కలవరపాటు చెందినా వెంటనే ఆంజనేయుని తలచుకోమని పెద్దలు చెబుతుంటారు.



సర్పదోష, గ్రహదోష, విశేషించి శనిదోష నివారణకు ఆంజనేయుని స్తుతిస్తాం. సకల భూత ప్రేత పిశాచ మండలోచ్చాట అని తలచుకుని ధైర్యంగా ఉంటాం. అంటే ఎలాంటి భయాలనైనా హనుమ సమూలంగా పోగొడతాడన్నమాట. ◻

ఆధ్యాత్మికం

# పిల్లలతో కబుర్లు

**ఇల్లు, ఆఫీసు, పిల్లల స్కూల్ పనులతో రోజంతా బిజీగా ఉంటాం.** అయితే రాత్రి నిద్రపోయే ముందు పిల్లల కోసం కేటాయించిన సమయంలో ఆ రోజు గురించి ప్రశ్నించాలంటున్నారు నిపుణులు. దాంతో వాళ్ల ఆలోచనాతీరును గుర్తించొచ్చు అని చెబుతున్నారు.

✦ పిల్లలు జీవితంపై ఆ రోజు ఎటువంటి ప్రభావాన్ని చూపిందో అడగాలి. ఇది వాళ్ల ఆలోచనలు, భావోద్వేగాలను బయటపడేలా చేస్తుంది. వాళ్ల అవసరాలూ గుర్తించొచ్చు. అలాగే ఆ రోజుల్లో ప్రత్యేకంగా అనిపించిన విషయమేదో అడగాలి. సానుకూల అంశాలతో పాటు ప్రతికూలంగా అనిపించినవీ చెప్పమనాలి వీటినిబట్టి పిల్లల పిల్లలను ప్రశ్నిస్తున్నారా ? మానసికస్థితిని అంచనా వేయొచ్చు. 1 వారిని బాధపెట్టిన విషయాన్ని అడగాలి. ఎదుటి వారివల్ల వారు పడుతున్న ఇబ్బందులతోపాటు వాళ్లలోని భావోద్వేగ మేధస్సునూ గుర్తించొచ్చు. చుట్టూ ఉన్న వ్యక్తులను వారెలా అర్థం చేసుకోగలుగుతున్నారో తెలుసుకోవచ్చు. అలాగే పిల్లల సమస్యలను పరిష్కరిస్తే, తమకంటూ తల్లిదండ్రులు తోడున్నారనే భరోసా, నమ్మకం వాళ్లలో కలుగుతుంది. మనసులోని విషయాలను అమ్మానాన్నతో స్వేచ్ఛగా చెప్పడం అలవరుచుకుంటారు.

✦ ఏదైనా కొత్త విషయం నేర్చుకున్నారేమో అడగాలి. వాళ్లు చెప్పేది పూర్తిగా వినాలి. నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నందుకు ప్రశంసించాలి. ఇది వారిని మరిన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంచుతుంది. ✦ఏదైనా విషయం ఆ రోజు పిల్లలకు ఛాలెంజ్గా అనిపించిందేఎలా ప్రశ్నించాలి. దాన్ని సవాల్గా తీసుకొని ఎలా దాచోచ్చనేది సలహా ఇవ్వాలి. సమస్య ఎదురైతే ధైర్యంగా నిలబడగలుగుతారు. ✦ కొత్త స్నేహితులతో పరిచయాలు చదివిన పుస్తకం గురించి లేదా వాళ్లకు ఆ రోజు నచ్చిన సంభాషణ వంటివన్నీ పిల్లలతోకబురు చెబుతూనే తెలుసుకోవచ్చు. స్నేహం విలువ, ప్రముఖ వ్యక్తుల గురించి తెలుసుకోవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలుసుకుంటారు. ◻

ఆట

## మహిళల హాకీలో బెల్జియంపై
# భారత్ విజయం



**న్యూఢిల్లీ:** భారత జూనియర్ మహిళా హాకీ జట్టు బెల్జియంపై అద్భుతమైన విజయంతో యూరప్ పర్యటనను ప్రారంభించింది. బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లోని హాకీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, విల్రిజ్క్సే ప్లీన్‌లో జరిగిన ఆటలో భారత జట్టు 3-2 తేడాతో విజయం సాధించింది. ఈ పోరులో బలమైన బెల్జియం జట్టును భారత్ చిత్తుగా ఓడించింది. తద్వారా ఈ లీగ్‌లో గోల్ కీపర్ నిధి నేతృత్వంలోని టీమిండియా అదిరే బోణీ కొట్టింది. ఈ పోటీలో, గీతా యాదవ్ (11వ నిముషం) ద్వారా భారత్ గోల్‌ను ప్రారంభించింది. అయితే, రెండవ క్వార్టర్‌లో, ఆతిథ్య బెల్జియం మేరీ గోయెన్స్ (25వ నిముషం) ద్వారా స్కోరును సమం చేసింది. ఆ వెంటనే లూయిస్ వాన్ హెక్కే (34వ నిముషం) గోల్ చేయడంతో బెల్జియం ఆధిక్యంలోకి వెళ్లింది. భారత్ తిరిగి పోరాడుతూ వచ్చింది, సోనమ్ (40వ నిముషం) స్కోరును సమం చేసింది. భారత్ దాడిని కొనసాగించడంతో ఆ ఒత్తిడి ఫలించింది, ఆ తర్వాత లాల్తాంట్లు వాంగి (45వ నిముషం) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చింది. ఆ తర్వాత, భారత జూనియర్ మహిళల హాకీ జట్టు బెల్జియంకు మరో గోల్‌ను సమం చేయనివ్వకుండా విజయంతో నిష్క్రమించింది. ఇక ఈ నెల 10న జరిగే యూరోపియన్ పర్యటనలో భారత్ తన రెండవ మ్యాచ్‌లో బెల్జియంతో తలపడనుంది.

## నేషన్స్ లీగ్
# ఛాంపియన్‌గా పోర్చుగల్




**న్యూఢిల్లీ:** స్పెయిన్‌పై నాటకీయ షూటౌట్ విజయం తర్వాత పోర్చుగల్ నేషన్స్ లీగ్ ఛాంపియన్‌గా నిలిచింది. 2024-2025 యుఇఎఫ్ఎ నేషన్స్ లీగ్ ఫైనల్ పోర్చుగల్ మరియు స్పెయిన్ మధ్య సోమవారం ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ట్రోఫీని జోడించాలని లక్ష్యంగా క్రిస్టియానో రొనాల్డో నేతృత్వంలోని పోర్చు గల్, స్పెయిన్ పోటీ పడ్డాయి, పెడ్రి మరియు నికో విలియమ్స్ ద్వారా స్పెయిన్ పోర్చుగల్‌తో తలపడటంతో ఈ ఉత్కంఠభరితమైన పోరు ప్రారంభమైంది. ఈ జంట గోల్‌తో పోర్చుగల్‌కు దగ్గరగా వచ్చారు. కానీ ప్రతిష్టంభనను ఛేదించలేకపోయారు. తొలి అర్ధభాగంలో 21వ నిమిషంలో జుబిమెండి గోల్ చేయడంతో స్పెయిన్ ఆధిక్యంలోకి వెళ్లింది. కేవలం ఐదు నిమిషాల తర్వాత, 26వ నిమిషంలో, నునో మెండిస్ అద్భుతమైన గోల్ చేసి పోర్చుగల్ స్కోరును సమం చేశాడు. తొలి అర్ధభాగం చేయడంతో స్పెయిన్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. రెండవ అర్ధభాగంలో, స్పెయిన్ పెద్దగా అవకాశాలను సృష్టించలేకపోయింది. క్రిస్టియానో రొనాల్డో గోల్ చేసి పోర్చుగల్‌ను 2-2తో తిరిగి తీసుకువచ్చాడు. ఆట చివరి క్షణాల్లో, రొనాల్డో గాయపడ్డాడు. అతనికి ప్రత్యామ్నాయంగా ఆడాల్సి వచ్చింది. 90 నిమిషాల తర్వాత కూడా ఆట టైగానే ఉంది. దీంతో అదనపు సమయంలో మొదటి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. అదనపు సమయంలో రెండవ అర్ధభాగంలో, యమల్‌ను ప్రత్యామ్నాయంగా ఆటలోకి తీసుకున్నారు. అదనపు సమయంలో కూడా గోల్స్ నమోదు కాకపోవడంతో, మ్యాచ్ పెనాల్టీలకు దారితీసింది. దీంతో డియోగో కోస్టా అల్వారో మొరాటా నుండి షూటౌట్ సేవ్ చేయడం ద్వారా 5-3 షూటౌట్ విజయాన్ని సాధించింది.

## ఆర్చరీ ప్రపంచ కప్..
## తొలిసారి ఒక్క పతకం లేకుండా
# భారత్ ఆర్చర్ల రిటర్న్

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025, స్టేజ్ 3లో భారత ఆర్చర్లు ఘోర వైఫల్యం చెందారు. చెత్త ప్రదర్శనతో వారు పోటీ నుండి ఒక్క పతకం కూడా గెలుచుకోకుండానే తిరిగి వచ్చారు. మహిళ, పురుషుల ఆర్చరీ జట్లు తొలిసారి ఒక్క పతకాన్ని కూడా సాంధించకపోవడం గమనార్హం. టర్కీలోని అంటాల్యాలో ముగిసిన ఈ ఈవెంట్‌లో ధీరజ్ బొమ్మదేవర, అతాను దాస్, పార్థ్ సలుంఖేలతో కూడిన పురుషుల రికర్వ్ జట్టు, మధుర ధమన్‌గోంకర్, చికిత తనిపర్తి, జ్యోతి సురేఖ వెన్నంలతో కూడిన మహిళల కాంపౌండ్ త్రయం ఈ పోటీలో పేలవ ప్రదర్శన ఇచ్చిన భారతీయులుగా నిలిచారు. కనీసం వారు కాంస్య పతక పోటీల్లో కూడా విజయం సాధించ లేక ఓటమిపాలయ్యారు. వ్యక్తిగత ఈవెంట్లలో చూస్తే, సిమ్రాన్‌జీత్ కౌర్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న ఏకైక రికర్వ్ ఆర్చర్, అక్కడ ఆమె 2020 టోక్యో ఒలింపిక్స్ ఛాంపియన్ దక్షిణ కొరియాకు చెందిన అన్ సాన్ చేతిలో 5-6 తేడాతో ఘోరంగా ఓడిపోయింది. కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్లలో మధుర ధమన్‌గోంకర్, అదితి స్వామి, రిషబ్ యాదవ్ అందరూ క్వార్టర్ ఫైనల్స్‌లోనే ఓడిపోయారు. 2022లో కొలంబియాలోని మెడెల్లిన్‌లో జరిగిన స్టేజ్ 4 తర్వాత భారతదేశం ఆర్చరీ ప్రపంచ కప్ నుండి పతకం లేకుండా తిరిగి రావడం అంటాల్యలో జరిగిన ప్రపంచ కప్‌లో మొదటిసారి. అప్పటి నుండి భారత్ 2023లో నాలుగు ప్రపంచ కప్ దశల్లో, 2024లో మూడు దశల్లో మరియు ఈ సంవత్సరం ప్రారంభంలో అంటాల్యకు ముందు రెండు దశల్లో పోడియంపై ఎల్లప్పుడూ ఒక ఆర్చర్‌ను సాధించింది, పోడియం ముగింపుతో వరుసగా తొమ్మిది ప్రపంచ కప్‌లను సాధించింది. ప్రపంచ కప్ ఫైనల్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే, భారత్ వరుసగా 11 పోడియం ఫినిషింగ్‌లను సాధించింది. 2022లో మెడెలిన్ స్టేజ్ 4 తర్వాత, మెక్సికోలోని త్లాక్స్‌కాలాలో జరిగిన 2022 ప్రపంచ కప్ ఫైనల్‌లో కూడా భారత్ ఆర్చర్లు పతకం గెలవలేదు.




# పివిఎల్ వేలంలో కాసుల వర్షం

### అత్యంత ఖరీదైన ప్లేయర్లుగా వినీత్
### రూ.22.5 లక్షలకు చెన్నై సొంతం
### శిఖర్‌ను రూ.16 లక్షలకు కొన్న హైదరాబాద్

**న్యూఢిల్లీ:** ప్రైమ్ వాలీబాల్ (పీవీఎల్) నాలుగో సీజన్ వేలంలో ఆటగాళ్లపై కాసుల వర్షం కురిసింది. ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు పోటీలు పడ్డాయి. కాలికట్ వేదికగా జరిగిన ఈ వేలంలో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు ప్లాటినం కేటగిరీ నుంచి శిఖర్ సింగ్‌ను రూ.16 లక్షలకు దక్కించుకుంది. అలాగే, అమన్ కుమార్, దీపు వేణుగోపాల్‌ను వరుసగా రూ.11.5 లక్షలు, రూ.5.75 లక్షలకు కొనుగోలు చేసింది. వేలంలో జెరోమ్ వినీత్ సి అందరి దృష్టిని ఆకర్షించాడు. ప్లాటినం కేటగిరీలో అతడిని రూ. 22.5 లక్షలకు చెన్నై బ్లిట్జ్ కొనుగోలు చేసింది. దాంతో లీగ్‌లో తను అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. కాలికట్ హీరోస్ స్థానిక ఆటగాడు షమీముద్దీన్‌ను రూ.22.5 లక్షలకు దక్కించుకుంది. కొచ్చి బ్లూ స్పైకర్స్ వినీత్ కుమార్‌ను అదే మొత్తానికి కొనుగోలు చేసింది. వేలంలోకి ఆలస్యంగా వచ్చిన బెంగళూరు టార్పెడోస్ గోల్డ్ కేటగిరీ నుంచి జిష్ణు పీవీని రూ.14 లక్షల భారీ మొత్తానికి దక్కించుకుంది. అలాగే, జోయెల్ బెంజమిన్. జె ని రూ.6.5 లక్షలకు కొనుగోలు చేసింది. ఇబిన్ జోస్, రోహిత్ కుమార్ చెరో రూ.5 లక్షలతో అదే జట్టులో చేరారు. చెన్నై బ్లిట్జ్, బెంగళూరు టార్పెడోస్, కోల్‌కతా థండర్ బోల్ట్స్ మధ్య జరిగిన బిడ్డింగ్ వార్ తర్వాత గతంలో కాలికట్ హీరోస్ తరపున ఆడిన వినీత్‌ను చెన్నై రూ.22.5 లక్షలకు దక్కించుకుంది. ప్లాటినం కేటగిరీ నుంచి చెన్నై ఎం. అశ్విన్ రాజ్, సమీర్ చౌదరి (రైట్ టు మ్యాచ్) ఒక్కొక్కరిని రూ.8 లక్షలకు తమ జట్టులో చేర్చుకుంది. అమల్ కె థామస్ రూ.6.5 లక్షలకు కొచ్చి బ్లూ స్పైకర్స్ జట్టులో చేరగా, జస్‌జోధ్ సింగ్‌ను గోల్డ్ కేటగిరీ నుంచి రూ.14.75 లక్షలు పలికాడు. అహ్మదాబాద్ డిఫెండర్స్ షాన్ టి జాన్‌ను (రైట్ టు మ్యాచ్) అట్టిపెట్టుకోవడానికి రూ.11.5 లక్షలు వెచ్చించగా, అంగముత్తు, అఖిన్ జీఎస్ వరుసగా రూ.11 లక్షలు, రూ.10.5 లక్షలకు అదే జట్టులో చేరారు. ఢిల్లీ తూఫాన్స్ జట్టు ప్లాటినం కేటగిరీలో రూ.9 లక్షలకు ఆయుష్‌ను దక్కించుకుంది. గోల్డ్ కేటగిరీలో జార్జ్ ఆంటోనీ రూ.5 లక్షలకు ఢిల్లీ జట్టులో చేరగా, మన్నత్ చౌదరి రూ.6.5 లక్షలకు ఆ టీమ్ సొంతమయ్యాడు. కార్తీక్.ఎ, ల్యాడ్ ఓం వసంత్‌ను ప్లాటినం కేటగిరీలో ముంబై మెటియోర్స్ చెరో రూ.8 లక్షలకు దక్కించుకోగా, గోల్డ్ కేటగిరీలో విపుల్ కుమార్‌ను ముంబై (రైట్ టు మ్యాచ్) రూ.6.25 లక్షలు, సోను, నిఖిల్‌ను ఒక్కొక్కరిని రూ.5 లక్షలకు కొనుగోలు చేసింది. ప్రిన్స్, రామానథన్ ప్లాటినం కేటగిరీ నుంచి రూ.8 లక్షలకు గోవా గార్డియన్స్ జట్టులో చేరారు. అమిత్ ఛోకర్ (రూ.5 లక్షలు) కూడా ఆ జట్టు సొంతమయ్యాడు. పంకజ్ శర్మను కోల్‌కతా థండర్ బోల్ట్స్ గోల్డ్ కేటగిరీలో రూ.6 లక్షలకు కొనుగోలు చేసింది. సృజన్ శెట్టి రూ.5 లక్షలకు కోల్‌కతా టీమ్‌లో చేరాడు.


## ఎటిపి ర్యాంకింగ్స్‌లో
# వరల్డ్ నంబర్ వన్‌గా సిన్నర్
### దిగజారిన భారత్ డబుల్స్ రోహన్ బోపన్న

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ 2025 ఫైనల్‌లో కార్లోస్ అల్కరాజ్ తన టైటిల్‌ను నిలబెట్టుకున్న తర్వాత, స్పెయిన్ ఆటగాడు అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఎటిపి) ర్యాంకింగ్స్‌లో రెండవ స్థానంలో కొనసాగగా, రన్నరప్ జానిక్ సిన్నర్ ప్రపంచ నంబర్ 1గా నిలిచాడు. దీంతో కార్లోస్ అల్కరాజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక భారత్ టెన్నిస్ ప్లేయర్లు గతంలో కంటే ఈ సారి కిందికి పడిపోయారు. భారత్ డబుల్స్ యూకీబాంబ్రీ 6 స్థానాలు ఎగబాకగా, రోహన్ బోపన్న 20 స్థానాలు దిగజారాడు. ఈ మేరకు (ఎటిపి) సోమవారం ర్యాంకింగ్‌ల జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారం జాక్ డ్రేపర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ కంటే నాల్గవ స్థానానికి ఎగబాకగా, మూడుసార్లు రోలాండ్ గారోస్ విజేత అయిన నోవాక్ జొకోవిచ్ ఐదవ స్థానానికి చేరుకున్నాడు. ఎపిటి ర్యాంకింగ్స్ టాప్ 10లో జన్నిక్ సిన్నర్ 10880 పాయింట్లతో ప్రపంచ నెంబర్ వన్ స్థానానికి చేరుకోగా, కార్లోస్ అల్కరాజ్ 8850 పాయింట్లతో రెండో స్థానంలోను, 6385 పాయింట్లతో మూడో స్థానంలో అలెగ్జాండర్ జ్వెరెవ్, 4800 పాయింట్లతో జాక్ డ్రేపర్, 4630 పాయింట్లతో నోవాక్ జకోవిచ్ 5వ స్థానంలో, 4560 పాయింట్లతో టేలర్ ఫ్రిట్జ్ 6వ స్థానం, 4485 పాయింట్లతో లోరెంజో ముసెట్టి 7వ స్థానం, 3510 పాయింట్లతో టామీ పాల్ 8వ ర్యాంక్‌లో, 3440 పాయింట్లతో హోల్గర్ రూన్ 9వ ర్యాంక్, 3285 పాయింట్లతో అలెక్స్ డి మినార్ 10వ స్థానంలో ఉన్నాడు. ఇక భారత్ విషయానికి వస్తే డబుల్స్‌ప్లేయర్‌యుకీ బాంబ్రీ 6 స్థానాలు ఎగబాకి 35వ ర్యాంక్‌లో, రోహన్ బోపన్న 20 స్థానాలు పడిపోయి 53వ ర్యాంక్, నాలుగు స్థానాలు దిగజారి 72 ర్యాంక్‌లో ఎన్ శ్రీరామ్, రెండు స్థానాలు జారుకుని 77వ ర్యాంక్‌తో బొల్లిపల్లి రిత్విక్, మూడు స్థానాలు దిగజారి 100వ స్థానంలో విజయ్ సుందర్ ప్రశాంత్, సింగిల్స్‌లో 63 స్థానాలు దిగజారిన సుమిత్ నాగల్ 233వ ర్యాంకు, 8 స్థానాలు ఎగబాకిన ముకుంద్ శశికుమార్ 430వ ర్యాంక్, 15 స్థానాలు ఎగబాకిన కరణ్ సింగ్ 445వ ర్యాంక్‌లోను, 21 స్థానాలు దిగజారిన అర్యన్ షా 483వ ర్యాంక్‌లో ఉన్నారు.



# జెఎస్‌డబ్ల్యూ నుంచి ఎల్‌అండ్‌టి ఆర్డర్

**ముంబై, జూన్ 9:** లార్సెన్ టూబ్రో(ఎల్‌టీ)కు సంబంధించిన హెవీ సివిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈ రోజు (సోమవారం) మహారాష్ట్రలో భవాలీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనుల కోసం జెఎస్ డబ్ల్యూ ఎనర్జీ నుంచి భారీ వర్క్ ఆర్డర్‌ను పొందింది. 1500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్ట్‌లో రిజర్వాయర్లు, సొరంగాలు, భూగర్భ పవర్‌హౌస్‌తో సహా విస్తృతమైన సివిల్ వర్క్స్ ఉంటాయి. ఈ ప్రాజెక్ట్ మహారాష్ట్రలోని నాసిక్, థానే జిల్లాల్లో ఉంది. వివిధ చిన్న యూనిట్లను కలిగి ఉన్న ఈ ప్రాజెక్ట్ మొత్తం 1500 మెగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉండేలా రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ పనిలో అప్రోచ్ రోడ్లు, జలాశయాలు, వాటర్ కండక్టర్ సిస్టం, ప్రెషర్ టన్నెల్స్, భూగర్భ పవర్ హౌస్ యూనిట్ నిర్మాణంతో సహా ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని సివిల్ వర్క్స్ ఉంటాయి.




# నాలుగో రోజూ స్టాక్ సూచీలకు లాభాలే..

**ముంబై, జూన్ 9:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం సూచీలకు బూస్ట్ ఇచ్చింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ రాణించాయి. దీనికితోడు భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగోతి, అమెరికాలో మెరుగైన జాబ్ డేటా, అమెరికా చైనా మధ్య జరగబోయే వాణిజ్య చర్చల్లో సానుకూల నిర్ణయం వెలువడవచ్చన్న అంచనాలు ఇందుకు తోడయ్యాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ 25,100 ఎగువన స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం 82,574.55 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 82,669 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 256.22 పాయింట్ల లాభంతో 82,445.21 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 100 పాయింట్లు లాభంతో 25,103.20 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది. కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. ఔన్సు బంగారం ధర 3340 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## వాణిజ్యం

# సిఇఒకు సహాయకారిగా ఎఐ

**ముంబై, జూన్ 9:** గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ కంపెనీ భవిష్యత్తు నాయకత్వం పనితీరుపై ఆసక్తికర ప్రకటన చేశారు. బ్లూమ్‌బర్గ్ కాన్ఫరెన్స్‌లో పిచాయ్ పాల్గొని మాట్లాడారు. సంస్థ సిఇఒ తదుపరి నిర్ణయాలు తీసుకోవడానికి రోజువారీ కార్యకలాపాల్లో సహాయపడడానికి కృత్రిమమేధ తోడుంటుందని చెప్పారు. ఈ ప్రకటన కృత్రిమ మేధ ఆధారిత ఉత్పాదకత పట్ల గూగుల్ నిబద్ధతను నొక్కి



చెబుతుంది. కృత్రిమ మేధ మానవ నాయకత్వాన్ని భర్తీ చేయడానికి బదులుగా దాన్ని మెరుగుపరుస్తుందనే భావనను పిచాయ్ ప్రకటన బలపరుస్తుంది. ఎగ్జిక్యూటివ్ స్థాయి నాయకత్వంలో కృత్రిమ మేధను వాడడం, శ్రామిక శక్తి అంతటా ఎఐను ఏకీకృతం చేసే గూగుల్ విస్తృత వ్యూహానికి అనుగుణంగా ఈ ప్రకటన ఉందని టెక్ నిపుణులు భావిస్తున్నారు. పిచాయ్ తెలిపిన వివరాల ప్రకారం కార్య నిర్వాహక నిర్ణయాలను ఆటోమేట్ చేయడానికి బదులుగా ఎఐ వ్యూహాత్మక సలహాదారుగా పనిచేస్తుంది. పెద్ద మొత్తంలో డేటాను సేకరించడానికి, వర్క్ ఫ్లోలను ఆప్టిమైజ్ చేయడానికి, సృజనాత్మక పరిష్కారాలను మరింత సమర్థవంతంగా అన్వేషించడానికి నాయకులను ఎఐ సహాయపడుతుంది. పిచాయ్‌స్వయంగా రిప్లిట్, కర్సర్ వంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కోడింగ్ సాధనాలతో ప్రయోగాలు చేస్తున్నారు. వాటిని వైబ్ కోడింగ్ అని పిలుస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా సాధారణ ప్రాంప్ట్‌లతో కస్టమ్ వెబ్ పేజీలను సృష్టించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయపడుతుంది.

# డార్క్ మోసాలకు చెక్..డార్క్ పాటర్న్స్‌పై కేంద్రం ఫోకస్!

**ముంబై, జూన్ 9:** ఇ-కామర్స్ సైట్‌ల మాయాజాలానికి చెకపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇ-కామర్స్ సంస్థలకు ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేసింది. వినియోగదార్లను తప్పుదోవ పట్టించేలా తమ వెబ్‌సైట్‌ల్లో ఏమైనా ప్రకటనలు ఉంటే వాటిని గుర్తించి, తొలగించేందుకు స్వీయ ఆడిట్‌ను నిర్వహించుకోవాలని ఇ-కామర్స్ సంస్థలను సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఆదేశించింది. మూడు నెలల్లోగా ఈ ప్రక్రియ అమలుచేయాలని తెలిపింది. ఈ చర్యల వల్ల ఇకామర్స్ సంస్థలపై వినియోగదారుల్లో విశ్వాసం మరింత బలపడుతుందని తెలిపింది. అనైతిక వాణిజ్య మార్గాలు పాటించడం లేదా వినియోగదార్ల ఎంపిక నిర్ణయాన్ని ప్రభావం చూపించే విధానాలకు తమ ప్లాట్‌ఫామ్‌లు వేదికగా ఉన్నాయా? అనే విషయాన్ని కూడా ఇకామర్స్ సంస్థలు తప్పక పరిశీలించుకోవాలని వాణిజ్య వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. డార్క్ ప్యాటర్న్స్ నియంత్రణకు సంబంధించిన మార్గదర్శకాలను ఉల్లంఘించాయని కొన్ని ఇకామర్స్ సంస్థలు



ఇప్పటికే సీసీపీఏ నోటీసులు జారీ చేసింది. ఏయే కంపెనీలకు జారీ చేసిందీ మాత్రం వెల్లడించలేదు. వస్తువు లేదా సేవలను అంటగట్టేందుకు అనుసరించే వివిధ పద్ధతులే డార్క్ పాటర్న్స్‌గా వ్యవహరిస్తారు. వినియోగదారుల నిర్ణయాన్ని ప్రభావితం చేయడం, వారిని గందరగోళానికి గురిచేయడం, బలవంతంగా షాపింగ్ చేయించడమే వీటి లక్ష్యం. ఇలాంటి 13 రకాల డార్క్ పాటర్న్స్‌ను సీసీపీఏ గతంలోనే గుర్తించింది. అలాంటి వాటికి దూరంగా ఉండాలని ఇకామర్స్ సంస్థలకు సూచించింది. ఏదైనా వస్తువును నిర్దేశిత సమయంలో కొనుగోలు చేయకపోతే ఆఫర్‌ను కోల్పోతామని యూజర్‌ను గందరగోళంలోకి నెట్టేయడం ఈ పాటర్న్ ముఖ్య ఉద్దేశం. కొన్ని ప్లాట్‌ఫామ్‌లు యూజర్ల అనుమతి లేకుండా కొన్ని వస్తువులు లేదా సేవలను అదనంగా షాపింగ్ కార్ట్‌కు జోడిస్తుంటాయి. లేదా డొనేషన్, చారిటీ అంటూ పేమెంట్ చెక్‌బాక్స్‌ను యాడ్ చేస్తాయి. ఇవన్నీ కస్టమర్‌కు తెలియకుండానే తన పేమెంట్‌కు జమ అయి తాను కొన్న వస్తువు రేటు కంటే ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారులకు సేవల కోసం సైన్ అప్ చేసుకోమని సూచించడం, ఆపై దాన్ని రద్దు చేయడానికి వీలు కాకుండా చేయడం మరో ఎత్తుగడ. ఒకవేళ క్యాన్సిల్ చేయడానికి ప్రయత్నించినా అనేక దశలు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. ఫోర్స్‌డ్ యాక్షన్: ఇదోతరహా ట్రిక్కు. కొన్నిసార్లు యూజర్లు అదనంగా వస్తువులను కొనేలా బలవంతం చేస్తారు. లేదా అక్కర్లేని సర్వీసుకు తనకు ఇష్టం లేకపోయినా అంటగడతారు. వారెంటీ, సబ్‌స్క్రిప్షన్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వస్తువును కొనే క్రమంలో వ్యక్తిగత సమాచారాన్ని అవసరం లేకపోయినా తప్పనిసరిగా షేర్ చేయడం కూడా ఫోర్స్‌డ్ యాక్షన్ కిందకే వస్తుంది. కన్ఫామ్ షేమింగ్: ఆడియో, వీడియో, పద బంధాల రూపంలో యూజర్‌ను షేమ్ చేయడం. ఇన్సూరెన్స్ తీసుకోకపోతే ఫ్యామిలీని రిస్క్ పెడుతున్నాం దాతృత్వం పెద్దలకే అనే డైలాగులతో యూజర్‌ను కొనుగోలుకు ప్రేరేపించడం మరో తరహా మోసం. ఏదైనా వెబ్‌సైట్ తమ యాప్ డౌన్లోడ్ చేసుకోమని పదే పదే అడగడం, నోటిఫికేషన్లు ఆన్ చేసుకోమని పదే పదే కోరడం వంటివి ఈ పద్ధతి కిందకు వస్తాయి. ఇంటర్ఫేస్‌లో మార్పుల ద్వారా వినియోగదారుడిని తప్పుదోవ పట్టించడం. తమకు కావాల్సిన యాక్షన్‌కు మాత్రమే కలర్ ఇచ్చి హైలైట్ చేయడం వంటివి ఈ ప్యాటర్న్ కిందకు వస్తాయి.

# ఫుడ్ డెలివరీలోకి ర్యాపిడో..

**ముంబై, జూన్ 9:** ఫుడ్ డెలివరీ విభాగంలో స్విగ్గీ, జొమాటోలదే రాజ్యం. గతంలో కొన్ని కంపెనీలు ఈ విభాగంలో అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల పోటీలో నిలవలేకపోయాయి. ఇప్పుడు క్యాబ్ సేవలందిస్తున్న ర్యాపిడో ఈ విభాగంలో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ కంపెనీ అనుసరించబోయే ఫిక్స్‌డ్ కమీషన్ మోడల్ స్విగ్గీ, జొమాటోను కలవరపరుస్తున్నాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లు నేడు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఓలా, ఉబర్ తరహాలో క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ర్యాపిడో ఫుడ్ డెలివరీ విభాగంలోకి త్వరలో అడుగుపెట్టనుంది. ఇందులో భాగంగా రెస్టారంట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం రూ.400లోపు ఆర్డర్లపై రూ.25, రూ.400పైబడిన ఆర్డర్లపై రూ.50 చొప్పున హోటళ్లు/ రెస్టరంట్ల నుంచి కమీషన్ తీసుకోనుంది. అంటే కమీషన్ 815శాతం మధ్య ఉండనుంది. ప్రస్తుతం స్విగ్గీ, జొమాటో 1630 శాతం కమీషన్‌తో పోలిస్తే దాదాపు సగం కావడం గమనార్హం. జులై నెలలో బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఈ సేవలకు ర్యాపిడో శ్రీకారం చుట్టనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ర్యాపిడో యాప్‌లోనే రెస్టారంట్ల లిస్ట్ కూడా కనిపించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ విభాగంలో స్విగ్గీ, జొమాటో గుత్తాధిపత్యానికి ర్యాపిడో ఫిక్స్‌డ్ కమీషన్ మోడల్ చెక్ పెట్టే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో మార్కెట్ పాజిటివ్‌గా ఉన్నప్పటికీ.. రెండు కంపెనీల షేర్లు మాత్రం నేడు నష్టాల్లో ముగిశాయి. జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ షేరు విలువ ఎన్ఎస్ఈలో దాదాపు 2 శాతం నష్టంతో రూ.256 వద్ద ముగిసింది. స్విగ్గీ షేరు విలువ 2.63 శాతం నష్టంతో రూ364.90 వద్ద స్థిరపడింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.